www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 గురువారం

వెలుతురు

రంగారెడ్డి। 22, ఫిబ్రవరి 2024

తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 274, పేజీలు: 12, వెల: రూ.5/-

వారం రోజుల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్

200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు

- 14 ఎంపి సీట్లు గెలిపిస్తేనే మరింత ఉత్సాహం
- కెసిఆర్ ఏ మొహం పెట్టుకుని వస్తారు
- ఓట్లు అడిగే హక్కు కెసిఆర్‌కు లేదు
- పాలమూరు ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- కమిషన్ల కోసమే ప్రాజెక్టులు చేపట్టారు
- కోస్గీ సభలో సీఎం రేవంత్ విమర్శలు
- మహబూబ్‌నగర్ అభ్యర్థిగా వంశీచంద్ రెడ్డి ప్రకటన



కోస్గి,ఫిబ్రవరి21 (వెలుతురు):
వచ్చే వారం రోజుల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుపై ఆదేశాలు జారీ చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సీఎం హోదాలో తొలిసారి సొంత నియోజకవర్గం కోడంగల్‌కు రేవంత్ రెడ్డి బుధవారం నాడు వెళ్లారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ ప్రజలు గుండెల్లో హత్తుకుని ఆదరించడంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇక్కడ నిలబడగలిగా అన్నారు. నాడు పార్లమెంటులో నోరులేక పోయినా.. పాలమూరులో ఊరు లేకపోయినా కేసీఆర్ ను గెలిపించారు.. ఈ సభా వేదిక నుంచి కేసీఆర్ ను అడుగుతున్నా.. తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న నువ్వు పాలమూరుకు చేసిందేంటని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని మాజీ సీఎం కేసీఆర్ ను సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వని కేసీఆర్‌కు ఓట్లు అడిగే అర్హత లేదని, ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్ కు సిగ్గు రాలేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏం మొహం పెట్టుకుని పాలమూరు జిల్లాకు వస్తారు పాలమూరును ఎండబెట్టి.. కొడంగల్ ను పడావు పెట్టి ఎడారి చేశారంటూ మండిపడ్డారు. అతేగాకుండా ఉమ్మడి పాలమూరు జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే

వివరాలు 2లో...

వందేండ్ల భవిష్యత్‌కు ప్రణాళికలు

- పెట్టుబడులకు సర్కారు నుంచి రక్షణ
- అభివృద్ధి మీదే ఫోకస్ పెట్టాం
- జహీరాబాద్‌లో నిమ్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్యలో డ్రైపోర్టులు
- ఫార్మా విలేజ్‌లు డెవలప్ చేసి సౌకర్యాలు కల్పిస్తం
- సీఐఐ విద్య, నైపుణ్యాభివృద్ధి సమావేశంలో సీఎం రేవంత్

హైదరాబాద్,ఫిబ్రవరి21 (వెలుతురు):
తెలంగాణ రాష్ట్ర వందేండ్ల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దుతామని అన్నారు. తమ ఫోకస్ అంతా అభివృద్ధిపైనే పెట్టామని అన్నారు. ఇందుకోసమే కేంద్ర

వివరాలు 2లో...

ఫిబ్రవరి 29తో ముగియనున్న

ఈ-కేవైసీ ప్రక్రియ

- అనేక రాష్ట్రాల్లో ఇంకా పూర్తికాని ప్రక్రియ

హైదరాబాద్,ఫిబ్రవరి21 (వెలుతురు):
రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ చాలా కాలంగా కొనసాగుతోంది. రేషన్ కార్డులో ఉన్న సభ్యులు తమ వివరాలను రేషన్ డీలర్లను వద్ద నమోదు చేసి.. ధృవీకరించాలి. కానీ ఇప్పటికీ చాలా మంది ఇంకా చేయలేదు. ఫిబ్రవరి 29తో గడువు ముగుస్తుంది.ఇంకా 10 రోజులే సమయం ఉండడంతో.. ఇప్పటికీ రేషన్ కార్డుల ఈ కేవైసీ పూర్తి చేయవని వారు.. వెంటనే చేయాలని అధికారులు సూచిస్తున్నారు. మరోసారి గడువును పొడిగించే అవకాశం లేదని చెబుతున్నారు. ఫిబ్రవరి 29లోగా చేసుకోవాలని సూచిస్తున్నారు.రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ జనవరి 31తో ముగియాల్సి ఉంది. కానీ తెలంగాణ, ఏపీ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొత్తం ఇంకా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డులను ఆధార్ సంఖ్యతో అనుసంధానించే గడువును ఫిబ్రవరి నెలాఖరు వరకు పెంచింది కేంద్రం. తెలంగాణలో ఇప్పటి వరకు రేషన్ కార్డుల ఈ-కేవైసీ 85 శాతం మేర పూర్తయినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి నెలాఖరుకల్లా 100 శాతం పూర్తి చేయాలని పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, హైదరాబాద్

వివరాలు 2లో...

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

- కోస్గిలో రూ.4,369 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో ముఖాముఖిలో సీఎం రేవంత్

కొడంగల్,ఫిబ్రవరి21 (వెలుతురు):
ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళా

వివరాలు 2లో...



ఆరు గ్యారెంటీలపై

అడుగు వేయండి

- లేకుంటే బిఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుంది
- వెయ్యి ఊడల మర్రిని నిర్లక్ష్యం చేసిన కెసిఆర్
- బిజెపి గెలిస్తేనే రాష్ట్రానికి మోక్షం
- బిజెపి విజయ సంకల్ప యాత్రలో బండి సంజయ్

నిర్మల్,ఫిబ్రవరి21 (వెలుతురు):
ఎన్నికల షెడ్యూల్ కు గడువు మరో 30 రోజులే ఉందని, అందుకే 15 రోజుల్లోనే హామీలను అమలు చేసి కాంగ్రెస్ పార్టీ తన చిత్తుశుద్ధిని నిరూపించుకోవాలని ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నికల కోడ్ సాకు చూపి హామీలు అమలు చేయకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే

వివరాలు 2లో...

జగజ్యోతికి 14 రోజుల రిమాండ్

- ఉస్మానియా నుంచి డిశ్చార్జ్

హైదరాబాద్,ఫిబ్రవరి21 (వెలుతురు):
కాంట్రాక్టరు నుంచి రూ.84 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జగజ్యోతిని నాంపల్లి కోర్టులో ఏసీబీ అధికారులు హాజరు పర్చారు. ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఏసీబీ కోర్టులో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా.. 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మంగళవారం జగజ్యోతి నివాసంలో సోదాలు చేసిన అధికారులు రూ.65,50,000 నగదు, రూ.1,51,08,175 విలువైన 3.639 కిలోల బంగారం, ప్లాట్లు, వ్యవసాయ భూములకు సంబంధించి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భూముల విలువ అంచనా వేయాల్సి ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆమెకు ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇకపోతే ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి జ్యోతి రెండు రోజుల డ్రామాకు తెర పడింది. కాసేపటి క్రితమే జ్యోతిని ఉస్మానియా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు జ్యోతి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే ఆరోగ్యం బాగోలేదంటూ లేడీ ఆఫీసర్ ఆసుపత్రిలో చేరారు. ఏసీబీకి పట్టుబడిన వెంటనే అస్వస్థత పేరు చెప్పి జ్యోతి ఆస్పత్రిలో చేరారు. చికిత్స కోసం జ్యోతిని ఉస్మానియా ఆస్పత్రికి ఏసీబీ అధికారులు

వివరాలు 2లో...

మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ చేస్తా..

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ఓటు వేస్తే ఎలాంటి లాభం లేదు
- నరేంద్ర మోదీ ప్రభుత్వంతోనే దేశం అభివృద్ధి
- బీజేపీ నేత ఈటల రాజేందర్

హైదరాబాద్,ఫిబ్రవరి21 (వెలుతురు):
బీజేపీ నేత ఈటల రాజేందర్ ఎంపీగా బరిలోకి దిగే యోచన ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ లో ఆయన ఓటమిపాలయ్యారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల బరిలోకి దిగాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో తాను పోటీ చేసే విషయంపై క్లారిటీ ఇచ్చేశారు. బీజేపీ అధిష్టానం అవకాశం ఇస్తే ఎంపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధమేనని

వివరాలు 2లో...

భారీ ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నాహాలు

- నీటి పోరు పేరుతో త్వరలో ప్రజల్లోకి..!

హైదరాబాద్,ఫిబ్రవరి21 (వెలుతురు):
పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ యాక్టివ్ అవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో నీళ్లనే ప్రచారాస్త్రంగా మలుచుకునేందుకు వ్యూహం రచిస్తోంది. ఈ క్రమంలోనే రాజకీయంగా కొత్త పంచాయితీ ముందుకేసుకుంది. నీళ్లతో నిప్పులు రాజేయడానికి మళ్లీ పోరు బాట పట్టనుంది గులాబీ పార్టీ. త్వరలో నీటి పోరు యాత్ర చేసేందుకు రెడీ అయింది. దక్షిణ తెలంగాణలోని నాగార్జున సాగర్, ఉత్తర తెలంగాణలోని కాళేశ్వరం నుంచి నీటి పోరు యాత్ర ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. యాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు

వివరాలు 2లో...

ఢిల్లీలో మరోమారు ఉద్రిక్తత

- రైతుల చలో ఢిల్లీలో బాష్పవాయు ప్రయోగం
- చర్చలకు సిద్ధం అన్న కేంద్రమంత్రి అర్జున్ ముండా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి21 (వెలుతురు):
హస్తినలో మళ్లీ టెన్షన్ వాతావరణం నెలకొంది. రైతుల చలో ఢిల్లీ ఆందోళన బుధవారం నుంచీ మళ్ళీ ప్రారంభం కావడంతో శంభు సరిహద్దుల వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సరిహద్దుల వద్ద మోహరించిన వేలాదిమంది రైతులు బుధవారం ఉదయం ఒక్కసారిగా ముందుకు కదలడంతో వారిని ఆపేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. రైతులు భారీయెత్తున పొకెయినర్లు,

వివరాలు 2లో...

జనసంద్రంగా మారిన మేడారం

- దారులన్నీ అటే అన్నట్లుగా ప్రజల కదలిక

ములుగు,ఫిబ్రవరి21 (వెలుతురు):
మేడారం జనసంద్రంగా మారిపోయింది. దారులన్నీ అటువైపే అన్నట్టుగా అక్కడి జనసందోహం అడుగులు వేస్తున్నారు. నేడు మహాజాతర ప్రారంభం సందర్భంగా సమ్మక్క-సారలమ్మల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయం ప్రాంగణాలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు పెద్ద సంఖ్యలో జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. కాగా మేడారం మహాజాతరకు సర్వం సన్నద్ధమైంది. బుధవారం సారలమ్మర రాకతో నాలుగు రోజుల జాతర షురూ అయ్యింది. ఈ మేరకు తెల్లవారుజాము నుంచే తల్లి కొలువైన కన్నెపల్లిలో కార్యక్రమాలు మొదలయ్యాయి. పొద్దున్నే సారలమ్మ ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరించారు. ప్రధాన పూజారి అయిన కాక సారయ్య పలు

వివరాలు 2లో...

మేడారం జాతర అద్భుతం

- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి21 (వెలుతురు):
ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ, తెలంగాణ కుంభమేళగా పిలిచే మేడారం సమ్మక్క సారక్క జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

వివరాలు 2లో...

ఫిబ్రవరి 29తో ముగియనున్న ఈ-కేవైసీ ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీచేశారు. రేషన్‌కార్డులకు సంబంధించి అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించిన కేంద్రం ప్రభుత్వం..వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఈకేవైసీని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. లబ్ధిదారులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలసలు వెళ్లటం, మరణించిన కుటుంబ సభ్యుల పేర్లు ఇంకా కార్డుల్లో ఉండటంతో..వాటిని ప్రక్షాళన చేస్తోంది.రేషన్ కార్డులో పేర్లున్న వారంతా.. తమ ఆధార్ కార్డుతో బయోమెట్రిక్ వివరాలు ఇవ్వాలి. అప్పుడు మాత్రమే వారి పేర్లను రేషన్ కార్డుల్లో కొనసాగిస్తారు. లేదంటే తొలగిస్తారు. ఈ నేపథ్యంలోనే ఈకేవైసీ కోసం రేషన్ షాపుల వద్ద జనాలు బారులు తీరుతున్నారు. చాలా చోట్ల అప్‌డేట్ కావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.ఈ క్రమంలోనే రేషన్ కార్డుల ఈకేవైసీ గడువును మరోసారి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఫిబ్రవరిలోగా అందరూ వివరాలను సమర్పించాలని స్పష్టం చేసింది. ఈకేవైసీ పూర్తి చేసిన కుటుంబ సభ్యుల వివరాలే.. రేషన్ కార్డులో ఉంటాయని.. వారికి మాత్రమే రేషన్ సరుకులు వస్తాయని తెలిపింది.

ఢిల్లీలో మరోమారు ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

బుల్ డోజర్లు, జేసీబీలతో ముందుకు కదులుతున్నారు. శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద 14వేల మంది రైతులు 1200 ట్రాక్టర్లు, 300 కార్లు, 10 మినీ బస్సుల్లో మోహరించారు. వీరిని అడ్డుకునేందుకు ప్రభుత్వం వేలాదిమంది పోలీసులను రంగంలోకి దింపింది.23 పంటలకు ఎంఎస్పీ అమలు చేయాలని, కేంద్రం నల్లచట్టాల రద్దు సమయంలో ఇచ్చిన హామీలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై కేంద్రంతో చర్చలు జరిపిన రైతు ప్రతినిధులు బుధవారం ఉదయం 11 గంటల వరకు డెడ్ లైన్ పెట్టారు. అది దాటడంతో రైతులు చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఢిల్లీ సరిహద్దులోని శంభు వద్ద ముండ్ల కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రులతో రైతు నేతలు చర్చలు జరిపి, తమ ఆందోళనకు రెండు రోజులు విరామం ప్రకటించిన నేపథ్యంలో రైతులు పంజాబ్-హర్యానా జాతీయ రహదారిపై శంభు, ఖానౌరీ సరిహద్దులవద్ద వేల సంఖ్యలో వేచి చూస్తున్నారు. చర్చలు విఫలమయ్యాయనీ, తమ ఆందోళన కొనసాగుతుందనీ సోమవారమే రైతు నేతలు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాము శాంతియుతంగా ఢిల్లీలోకి ప్రవేశించాలని భావిస్తున్నా మనీ, తమను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి, తమకు అనుమతి ఇవ్వాలనీ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ విజ్ఞప్తి చేశారు. కాగా రైతులకు బుల్ డోజర్లు, పొక్లెయినర్లను ఇవ్వకూడదనీ, అలా ఇచ్చినవారిపై క్రిమినల్ కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించారు.

ఢిల్లీకి ప్రవేశించే రూట్లలో దాదాపు 40 వేల బారికేడ్లు వెలిశాయి. రైతుల ఆందోళన నేపథ్యంలో కేంద్రం పలువురు రైతు నాయకుల సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేసింది. చలో ఢిల్లీ నేపథ్యంలో 1200 ట్రాక్టర్లతో సుమారు 14 వేల మంది రైతులు ఢిల్లీని చుట్టుముట్టారు. ప్రతిఘటించి ఢిల్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని నిలువరించేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగిస్తుండటంతో శంభు ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఢిల్లీ సరిహద్దు కాశ్మీర్ బార్డర్ ను తలపిస్తోంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా రైతు ప్రతినిధులను ఇవాళ మరోమారు చర్చలకు ఆహ్వానిస్తూ ట్వీట్ చేశారు. ఎంఎస్పీ, పంటల వైవిధ్యం, పంట వ్యర్థాల సమస్య, ఎఫ్ఐఆర్ వంటి అన్ని అంశాలపై ఐదో రౌండ్‌లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. శాంతిని కాపాడుకోవడం ముఖ్యమంటూ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ చేస్తా..

(మొదటి పేజీ తరువాయి)

ఈటల స్పష్టం చేశారు. ఎక్కడ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారో కూడా వెల్లడించారు. తాను మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీచేయాలను కుంటున్నానని చెప్పారు. బీజేపీ అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని తేల్చి చెప్పేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈటల రాజేందర్ లోక్ సభ ఎన్నికలపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ఓటు వేస్తే ఎలాంటి లాభం ఉండదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు. మోదీ హయాంలో భారత్ లో సమూలమార్పులు తీసుకొచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల వేళ తెలంగాణ ప్రజలు మార్పుకోరుకున్నారని ఈటల తెలిపారు. అందుకే కాంగ్రెస్ అధికారం కట్టబెట్టారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓడిపోయిన అభ్యర్థులు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అహంకార పాలనకు ఇదే నిదర్శనమని విమర్శించారు.2018 అసెంబ్లీ ఎన్నికల్లో బండి సంజయ్, కిషన్ రెడ్డి ఓడిపోయారు. కానీ ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఇద్దరు నేతలు పోటీ చేశారు. కరీంనగర్ నుంచి బండి సంజయ్ ఎంపీగా విజయం సాధించారు. అలాగే సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి ఎంపీగా గెలిచారు. కేంద్ర మంత్రి పదవిని చేపట్టారు. ఇప్పుడు ఇదే బాటలో ఈటల రాజేందర్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన ఈటల.. ఇప్పుడు లోకసభ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. బీజేపీకి కాస్త కూస్తో పట్టున్న హైదారాబాద్ ను వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. మహానగరంలో పరిధిలోని మల్కాజ్ గిరి నుంచి బరిలోకి దిగాలని తన మనసులో మాటను బయటపెట్టారు. బీజేపీ అధిష్టానం ఈటలకు మల్కాజ్ గిరి టిక్కెట్ ఇస్తుందా? ఒకవేళ ఇవ్వకుంటే ఆయన పరిస్థితి ఏంటి ? అనే చర్చ నడుస్తోంది.

జగజ్యోతికి 14 రోజుల రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

తరలించారు. జ్యోతి ఆరోగ్యంగా ఉందంటూ ఉస్మానియా వైద్యులు బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఆ వెంటనే లేడీ అధికారిణిని ఏసీబీ న్యాయస్థానం ముందు అధికారులు హాజరుపర్చారు. అయితే 24 గంటలు దాటిన మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చలేదు కాబట్టి రిమాండ్ రిజెక్ట్ చేయాలని జ్యోతి తరుపు న్యాయవాది వాదించారు. జ్యోతికి అనారోగ్య సమస్య కారణంగా హాస్పిటల్‌లో అడ్మిట్ చేశామని కోర్టుకు ఏసీబీ చెప్పింది. అరెస్ట్ చూపించిన 24 గంటలకు ఎందుకు రిమాండ్ చేయలేదని కోర్ట్ ప్రశ్నించగా... హాస్పిటల్‌లో ఉన్న కారణంగా రిమాండ్ చేయలేదని నిన్న మెమో దాఖలు చేసినట్టు కోర్ట్‌కు ఏసీబీ తెలిపింది. దీంతో జ్యోతికి ఏసీబీ కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. మార్చ్ 6 వరకు జ్యోతికి కోర్టు రిమాండ్ విధించింది. కాగా... దాదాపు రూ.84వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు జ్యోతి పట్టుబడగా.. ఆ తరువాత ఆమె నివాసంలో సోదాలు జరిపిన ఏసీబీ అధికారులు విస్తుపోయారు. జ్యోతి ఇంట్లో 3.6 కేజీల బంగారం, 65 లక్షల నగదు, వ్యవసాయ భూమి పత్రాలు, ఓపెన్ ఎ÷-లాట్స్ పాత్రలను ఏసీబీ సీజ్ చేసింది. జ్యోతిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేయనుంది. జ్యోతి ఆస్తులు మరికొన్ని బీనామీలపై ఉన్నట్లు ఏసీబీ అనుమానిస్తోంది.

జనసంద్రంగా మారిన మేడారం

(మొదటి పేజీ తరువాయి)

పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆదివాసీ పూజారులు రహస్య పూజలు చేస్తారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. తర్వాత సారలమ్మను (సారయ్య రూపంలో) ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు తీసుకొస్తారు. రాత్రి పగిడిద్దరాజు, గోవిందరాజులను కూడా గద్దెలపైకి తీసుకొస్తారు. మహాజాతర మొదలవనున్న వేళ మేడారం ఇప్పటికే జనసంద్రంగా మారిపోయింది. దారులన్నీ అటువైపే అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.

సమ్మక్క గారాల బిడ్డ అయిన సారలమ్మ ధైర్యానికి, వీరత్వానికి, త్యాగానికి ప్రతీక. 12వ శతాబ్దాంలో తమ గిరిజన ప్రాంతాన్ని కాపాడుకునేందుకు కాకతీయలతో సారలమ్మ యుద్ధం సాగించిన తీరును, వీరమరణం ద్వారా ఆమె త్యాగాన్ని భక్తులు స్మరించుకుంటూ దైవంగా కొలుస్తారు. తల్లిని మొక్కితే సంతానం ప్రాప్తిస్తుందని, రుగ్మతలు పోతాయని భక్తుల విశ్వాసం. ఫలితంగా మేడారానికి సాగుతున్న సమయంలో సారలమ్మకు కన్నెపల్లిలో భక్తులు ఎదురెళ్లి మంగళహారతులు ఇస్తారు. సంతానం కలగాలని, సమస్యలు తీరాలని తడి బట్టలతో భక్తులు వరం పడతారు.

భారీ ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ పెద్దలు ప్లాన్ చేశారు. ఇటీవలే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించడంపై నల్గొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభ సక్సెస్‌తో జోష్‌లో ఉన్న బీఆర్ఎస్ ఇదే ఊపులో నీటి పోరు యాత్ర చేసి తమ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కారు పార్టీ డిసైడైనట్లు కనిపిస్తోంది. తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఎన్నికల వేళ మరోసారి ప్రజలకు గుర్తుచేసేందుకే ఈ యాత్ర అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే, స్వతంత్ర్య భారతవనీలో కనువినీ ఎరుగని జల దోపిడి. నీటి పేరుతో నోట్ల కట్టలను వెనకేసుకున్నారంటూ ఇటీవల శాసనసభ సాక్షిగా ప్రస్తుత ప్రభుత్వం. గత ప్రభుత్వంపై విరుచుకుపడింది. అసలే మేడిగడ్డ పేకమైడైందని.. సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లు కూడా డేంజర్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మరి తాతలనాటి ప్రాజెక్టులు తాపీగా నిలబడ్డా.. ఇప్పటి ప్రాజెక్టులెందుకు కుంగిపోతున్నాయి. ఈ కుంగుబాటుకు కారణం మీరంటే మీరంటూ అసెంబ్లీలో అధికార విపక్షాల మధ్యవాదోప వాదాలు తారాస్థాయిలో జరిగాయి. ఇంతకూ ప్రాజెక్టుల పంచాయితీలో ఎవరి వాదనలో వాస్తవముంది..? నీటి వాటాలపై ఏపీ, తెలంగాణ మధ్య యుద్ధం ఎప్పటి నుంచో జరుగుతున్న ముచ్చట. లేటెస్ట్‌గా తెలంగాణలోనే అధికార, విపక్షాల మధ్య వార్ మొదలైంది. తప్పు నీదంటే నీదంటే ఇరు వర్గాలు వాదించుకుంటున్నాయి. అదే సమయంలో తమపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతోంది ఏపీ. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల విషయంలో అన్యాయం జరిగింది. ఆ అన్యాయానికి బీఆర్ఎస్సే కారణం అని కాంగ్రెస్ అరోపిస్తోంది. అయితే కాంగ్రెస్ వల్లే రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఆరోపిస్తోంది గులాబీ పార్టీ. ఇదే అంశంపై అటు అసెంబ్లీలో.. ఇటు మేడిగడ్డ గట్టు మీద నుంచి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది అధికార పార్టీ. ఇక నల్గొండ వేదికగా కాంగ్రెస్ పార్టీపై గర్జించారు మాజీ సీఎం కేసీఆర్. మొత్తంగా అటు కేఆర్ఎంబీ, ఇటు కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో రాజకీయం భగ్గుమంటోంది. ఈ వివాదం ఎంత వరకూ వెళ్తుందో.. ఎక్కడ ఎండ్ కార్డ్ పడుతుందో చూడాలి మరి.

ఆరు గ్యారెంటీలపై అడుగు వేయండి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు పడుతుందని బండి సంజయ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసేలా కనిపిస్తోందన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. '6 గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. 70 రోజుల గడువు ముగిసింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముంది. ఆలోపే ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. జీతాలకే డబ్బుల్లేవు. 2 నెలల్లోనే రూ.10 వేల కోట్ల అప్పు తీసుకొచ్చి జీతభత్యాలు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎట్లా అమలు చేస్తుందో ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో 17కు 17 ఎంపీ సీట్లలో బీజేపీని గెలిపిస్తే కేంద్రం వద్దకు వెళ్లి తెలంగాణకు అధిక నిధులు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంది. రాముడు, మోదీ బీజేపీ వైపు ఉన్నారు. ప్రజలు ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలని' అన్నారు. కొమరం భీం విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నిర్మల్ జిల్లాకు వచ్చారు. అనంతరం బండి సంజయ్ కుమార్ స్థానిక ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్ లతో కలిసి నిర్మల్ లోని వెయ్యి ఊడల మర్రిని సందర్శించారు. రాంజీగోండు స్మారక కేంద్రం వద్ద ఒక వర్గానికి చెందిన వ్యక్తి సమాధి ఉండటంతో స్థానికులంతా బండి సంజయ్ ను కలిసి ఫిర్యాదు చేశారు. మహేశ్వర్ రెడ్డితో కలిసి అక్కడికి వెళ్లి రాంజీగోండు స్మృతి కేంద్రం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'ఒక వర్గం ఓట్ల కోసం ఆదివాసీల చరిత్రను తెరమరుగు చేసే కుట్ర చేస్తోన్నారా అని మండిపడ్డారు. గతంలో కెసిఆర్ వెయ్యి ఊడల మర్రిని నిర్లక్ష్యం చేశారని అన్నారు. అక్కడే తాము స్మారకం నిర్మిస్తామని అన్నారు.

అక్కడి నుండి బీజేపీ నేతలతో కలిసి బోథ్ నియోజకవర్గం వెళ్లిన బండి సంజయ్ విజయ సంకల్ప యాత్రలో పాల్గొని ప్రసంగించారు. 'నిజాం, బ్రిటీషర్లను ఉరికించిన పోరాట యోధుడు రాంజీగోండు. అలాంటి యోధుడితోపాటు వెయ్యి మందిని చెట్టుకు ఉరేసిన పాలకులు నిజాం రాజులు. ఆ ప్రాంతాన్ని స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాల్సిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు దానిని వేరే చోటుకు తరలించాల నుకోవడం దుర్మార్గం. వచ్చే ఏడాదిలోపు అదే స్థలంలోనే రాంజీగోండు స్మృతి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమై భూమి పూజ చేసి వచ్చినట్లు వెల్లడించారు. గతంలో కేసీఆర్ ఇట్లనే ఒక వర్గం ఓట్ల కోసం కక్కుర్తి పడి రాంజీగోండుసహా వెయ్యి మంది పోరాట యోధుల చరిత్రను కనుమరుగు చేయాలను కున్నరు. చివరకు బీఆర్ఎస్ పార్టీ చరిత్రను ప్రజలు తెరమరుగు చేశారు. కాంగ్రెస్ కూడా ఇట్లనే చేస్తే ఆ పార్టీని బొంద పెట్టేందుకు సిద్ధం. నిర్మల్ లో ఎవరైనా ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. వెయ్యి ఉరుల మర్రి కంటే ఒక వర్గం వాళ్ల సమాధి ముఖ్యమా? కాంగ్రెస్ నేతలు తేల్చుకోవాలన్నారు. బీజేపీ నిర్మించే రాంజీగోండు స్మృతి కేంద్రం నిర్మాణానికి సహకరించాలని' కోరారు. ఆర్థిక ప్రగతిలో 10వ స్థానంలో ఉన్న భారత్ ను 5వ స్థానానికి చేర్చిన ఘనత మోదీదే. ఈ దేశంలో 80 కోట్ల మందికి ఉచితంగా బియ్యం ఇస్తున్నారు. కోట్లాది గ్యాస్ కనెక్షన్లు, టాయిలెట్లు నిర్మించిన నేత మోదీ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కు పనీపాట లేదని.. కొత్త స్కాచ్ బాటిల్ టేస్ట్ చూడటానికే ఢిల్లీ వెళుతున్నారని సెటైర్లు వేశారు. ఆయనతో చర్చలు జరపాల్సిన ఖర్మ బీజేపీకి లేదని, అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్ తో పొత్తు పెట్టుకోలేదు. ప్రజలు ఛీత్కరించిన పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ మాకెందుకని అన్నారు. మోదీ వచ్చాక కనీస మద్దతు ధరను రెట్టింపు చేసి రైతులకు మేలు చేశారు. అట్లాగే యూరియా, డీఏపి వంటి ఎరువుల సబ్సిడీ పేరిట వరి పంటవేసే రైతులకు ఎకరాకు దాదాపు రూ 24 వేలు, పత్తి పంటకు రూ.16 వేలకుపైగా సబ్సిడీ ఇస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని మాట తప్పుతోంద న్నారు. జీతాలకే డబ్బుల్లేని పరిస్తితి ఉంటే... ఇచ్చిన హామీలను ఎట్లా అమలు చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

మేడారం జాతర అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'మేడారం జాతర.. గిరిజనుల అతిపెద్ద పండుగల్లో ఒకటి. ఈ జాతర భక్తి, సంప్రదాయం, సమాజ స్ఫూర్తిల గొప్ప కలయిక. మనం సమ్మక్క- సారక్కలకు ప్రణమిల్లుదాం. వారు అభివ్యక్తీకరించిన ఐక్యతా స్ఫూర్తిని, పరాక్రమాన్ని గుర్తు చేసుకుందాం. మన సాంస్కృతిక వారసత్వానికి చిరకాల స్ఫూర్తిగా నిలిచే ఈ సమ్మక్క-సారక్క మేడారం జాతర ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. కాగా, తెలంగాణలో అతి పెద్ద మహా కుంభవేళగా భావించే మేడారం మహాజాతర రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. ఈ ఏడాది బుధవారంఈ మహాజాతర మొదలైంది. జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇంకా పెద్ద ఎత్తున భక్తులు వస్తూనే ఉన్నారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా మేడారం తరలి వస్తున్నారు. సమ్మక్క తనయుడు కన్నెపల్లిలో కొలువైన జంపన్న మంగళవారం రాత్రి 7.09 గంటలకు బయలుదేరి 8 గంటలకు వాగు ఒడ్డున ఉన్న గద్దెపైకి చేరుకున్నాడు. పూజారి పోలెబోయిన సత్యం కన్నెపల్లిలోని ఇంటిలో పూజా సామగ్రిని శుద్ధిచేసిన అనంతరం జంపన్న గద్దెకు అలుకుపూతలు నిర్వహించి ఆయన ప్రతిరూపమైన డాలు, కర్రకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. గ్రామ మహిళలు ఊరు పొడవునా నీళ్లారబోస్తూ జంపన్నను సాగనంపారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలపైకి తెచ్చే పక్రియ ఇవాళ మొదలైంది. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సాయంత్రం ఆరు గంటలకు పూజలు నిర్వహిస్తారు. ఆదివాసీ పూజారులు, మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ఏఎస్పీలు కలిసి కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారం లోని గద్దెల వద్దకు తీసుకొస్తారు.

వారం రోజుల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్

(మొదటి పేజీ తరువాయి)

జల దోపిడీ ఎక్కువగా జరిగిందని ఆరోపించారు. బుధవారం కోస్గీ సభలో ఆయన మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ప్రకటించారు.

ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్ రెడ్డిని ప్రకటించిన అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఒక్క ప్రాజెక్టుగానీ, పరిశ్రమగానీ రాలేదన్నారు. అలాంటి పార్టీకి వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. జిల్లాలో ఒక్క ఎకరానికి కేసీఆర్ నీళ్లివ్వలేదని.. ప్రజలకు క్షమాపణ చెప్పే ఓట్లడగాలన్నారు. మరికొద్ది రోజుల్లో రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గ్యారంటీ హామీలను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో 14 ఎంపీ సీట్లను గెలిపించాలని ప్రజలను కోరారు. కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లు తీసుకుని ప్రాజెక్టులు పూర్తి చేయలేదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టి ఒక ఎకరాకు నీళ్లు ఇవ్వలే అని విమర్శించారు. వేల కోట్లు రూపాయలు కాంట్రాక్టర్ల దగ్గర నుంచి కమిషన్లుగా తీసుకున్నారని చెప్పారు. పదేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. కొడంగల్ లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. వారం రోజుల్లోనే రూ.500కు గ్యాస్ సిలిండర్ అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు గ్యారెంటీలు అమలు చేసే దిశగా ముందుకెళ్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్ త్వరలోనే ఇస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లోనే రైతు రుణమాఫీ కూడా చేపడాతామని తెలిపారు. రైతుభరోసాను పది రోజుల్లో అర్హులందరికి వేస్తామని చెప్పారు.

గతంలో మహబూబ్ నగర్ కు వలస వచ్చి ఎంపీగా పోటీ చేసిన కేసీఆర్ ఇక్కడి ప్రాంతానికి అన్యాయం చేశారని చెప్పారు. ఉమ్మడి పాలన కంటే రాష్ట్రం వచ్చాకే ఎక్కువ అన్యాయానికి గురయ్యామని అన్నారు. చిన్నా రెడ్డి ప్రారంభించిన తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ దూరారని విమర్శించారు. రోజా పెట్టిన రాగి సంకటి తిని రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని హామీ ఇచ్చి వచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ ను చీ కొట్టిన సిగ్గురాలేదని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ పాలమూరులో సభ పెట్టి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ హోదా ప్రకటిస్తామని చెప్పి ఎందకు చేయలేదని ప్రశ్నించారు. నలుగురు బీజేపీ ఎంపీలు తెలంగాణ నుంచి ఉండి ఈ రాష్ట్రానికి ఏం తెచ్చారని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటే అని అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని అన్నారు. ఇంకా కాంగ్రెస్ పార్టీ యుద్ధం ముగియలేదని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు వచ్చేల కార్యకర్తలు పని చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న వేళ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి తొలి అభ్యర్థిని ప్రకటించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్ రెడ్డిని ప్రకటించారు. వంశీచంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే దేశ స్థాయిలో తెలంగాణ గొప్పతనం తెలుస్తుందన్నారు.

అసెంబ్లీ ఎన్నికలతోనే కాంగ్రెస్ యుద్ధం అయిపోలేదని.. పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లు గెలిస్తేనే కాంగ్రెస్ యుద్ధం గెలిచినట్లు అవుతుందని చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలన్నారు. వంశీ చంద్ రెడ్డి 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి 78 ఓట్ల స్వల్ప తేడాతో గెలుపొంది తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్ చేతిలో ఆయన ఓటమి పాలయ్యాడు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి చేతిలో ఓడిపోయారు.

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంఘాలను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో తొలిసారి ఆయన పర్యటించారు. కోస్గిలో రూ.4,369 కోట్ల విలువైన 20 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అందులో ప్రధానమైనది రూ.2,945 కోట్లతో నిర్మించనున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం. అనంతరం మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. వారితో ముఖాముఖిలో పాల్గొన్నారు. అభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేస్తామని.. ఐకేపీ, మహిళా సంఘాల ద్వారా పంటల కొనుగోళ్లు చేపడతామని సీఎం తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు పునరుద్ధరిస్తామని చెప్పారు. ఐకేపీ, మహిళా సంఘాల ద్వారా పంటల కొనుగోళ్లు చేస్తామని తెలిపారు. అనంతరం మెడికల్, నర్సింగ్, డిగ్రీ, ఇంటర్ కాలేజీల నిర్మాణానికి శంకుస్థ



గర్ల్స్ హై స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌నీ
ప్రారంభించిన ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట టౌన్, వెలుతురు ఫిబ్రవరి 21:
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హై స్కూల్ లో కంప్యూటర్ ల్యాబ్ నీ ప్రారంభించిన మాజి మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్భంగా హరీష్ రావు గారు మాట్లాడుతూ ఈ పాఠశాల దినదిన అభివృద్ధి జరుగుతుంది గతంలో ఈ పాఠశాల వర్షం వస్తే పెచ్చులు ఉడుతాయని బంద్ చేసేది నేడు కార్పొరేట్ స్కూల్ నీ తలదన్నేలా ఉంది 50లక్షల సిఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నాం త్వరలోనే ఈ పాఠశాలకు కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ ను ఏర్పాటు చేస్తాం రాబోయే కాలం మొత్తం కంప్యూటర్ కాలమే కావున విద్యార్థులు వీటిని వినియోగించుకోవాలి కంప్యూటర్ పరిజ్ఞానం జీవన విధానం లో భాగమైంది.

జిల్లాలో ఎక్కువ మంది ఆడపిల్లలు చదివే పాఠశాల ఇది ఈసారి ఈ పాఠశాల పదవ తరగతి లో వందశాతం పలితాలు సాధించాలి మీరు బాగా చదవండి భవిష్యత్ మీ చేతిలోనే ఉంది. మీరు నాకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ పదిలో 10 GPA 100 శాతం మార్కులు సాధించాలి సిద్దిపేట నియోజకవర్గం లో పదిలో ప్రథమ స్థానం లో నిలవాలి నీటిని వృధా చేయవద్దు అవసరం మేరకే వాడుకోవాలి.

పలు బిఆర్ఎస్ కుటుంబాలను పరామర్శించిన
మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

నంగునూరు మండలం వెలుతురు ఫిబ్రవరి21:
ఘనపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మాజీ గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు కీ. శే.బండి వెంకటయ్య తండ్రి ఈరోజు మృతి చెందగా మృత దేహానికి నివాళ్లు అర్పించి

కుటుంబాన్ని ఓదార్చిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు నంగునూర్ మండల సాక్షి రిపోర్టర్ తులసి బంధువులు ఇటీవల రోడ్డు ప్రమాదం లో మృతి చెందగా పాలమాకుల లో తులసి ని పరామర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అదేవిదంగా పాలమాకుల గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త అసర్ల యాదగిరి తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.

మాజీ ఉపముఖ్యమంత్రిని కలిసిన
జహీరాబాద్ కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్, 21 ఫిబ్రవరి, వెలుతురు :
తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ఉపముఖ్యమంత్రి, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ శాసనసభ సభ్యులైన తాటికొండ రాజయ్య కర్ణాటక రాష్ట్రంలో ఒక శు భాకార్యానికి వెళుతున్న విషయాన్ని తెలుసుకున్న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కే. సుమిత్ర రాజ్, కో ఆప్షన్ మెంబర్ కమలమ్మ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ కె. యువరాజ్ కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తాటికొండ రాజయ్య యువరాజ్ గృహనికి వెళ్ళి వారి ఆరోగ్య విషయాలు

తెలుసుకొని వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన తేనెటి విందును స్వీకరించారు. ఈ విషయాన్ని తెలుసుకొన్న జహీరాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి మాట్లాడారు. అనంతరం మాజీ మంత్రిని శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. రాజయ్యను కలవడానికి వచ్చిన ప్రతి ఒక్క నాయకునీతో కార్యకర్తలతో వారు ఆప్యాయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ అబ్దుల్ సమద్, మహమ్మద్ గౌస్, మహమ్మద్ రబ్బాని ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కాలం తీరిన మందులు అమ్ముతున్న
MedPlus+

ఆన్‌లైన్ బుక్ చేయండి
ఇంటి వద్దకే మందులు
అజాగ్రత్తగా సరఫరా
నిర్లక్ష్యంగా సమాధానం
పోలీసుల జోక్యం
బాధితులకు న్యాయం

హైదరాబాదు వెలుతురు ఫిబ్రవరి 21:
కాలం తీరిన మందులు అమ్ముకుంట్ను ఆర్థికంగా బలపడుతున్న మందుల కంపెనీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంది. ఆన్‌లైన్ బుక్ చేయండి.
ఇంటి వద్దకే మందులు సరఫరా చేస్తామని ఊదరగొడుత్ను పేషంట్లను ఆకర్షించే ప్రచారార్భాటంతో తన వ్యాపారం విస్తృత పర్చుకుంటుంది. కానీ ఆన్‌లైన్ లో పంపిన మందులు కాలం తీరినవా..! డాక్టర్ స్సుచించిన మందులే పంపుతున్నామా? ప్రత్యామ్నాయం పేరుతో మార్చి పంపుతున్నామా అనే పర్యవేక్షణ ఫుర్తిగా కొరవడిందనటానికి తాజా ఉదాహరణలు చాలానే వున్నాయి. సరైన మందులు పంపలేదని అడిగిన కస్టమర్‌కు నిర్లక్ష్యం గా సమాధానం చెప్పటం హేళన గా మాట్లాడటంతో పోలీసులను ఆశ్రయించగా వారి జోక్యంతో బాధితుడికి న్యాయం జరిగింది .
వివరాల్లోకి వెళితే దిల్సుక్ నగర్‌లో నివాసముండే 71సంవత్సరాల కె.రాఘవాచార్యులు, వయ్యెవృద్దుడు కావటంతో తనకు కావలసి మందులను ద్వారకాపురి కాలనీ లోని మెడ్ ప్లస్ ఫార్మసీ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 15న ఇన్ వాయిస్ నెంబరు 232405067053520.



మందులు తెప్పించుకోవడం జరిగింది. మంచి మందులు తాము ఆర్డర్ల పెట్టినవే వుంటాయనుకున్న రాఘవాచార్యులు పార్సిల్ తీసి ఇంట్లో పెట్టుకున్నారు. వినియోగ సమయంలో ఓపన్ చేసి చ్చుసి హతాశు డయ్యారు. పంపిన మందులలో ఇంచుమించు ప్రత్యేకంగా గుర్తించలేని ఒకే రకమైన క్యాప్సిల్స్ ,టాబ్లెట్స్ అక్టోబర్ 23 ఎక్స్పైరీ డేట్ కలిగిన మందులు ఆర్డర్ లో పంపారు. రోజు అలవాటుగా వాడే క్యాప్సిల్ రంగు కాక వేరే రంగులో క్యాప్సిల్ ఉండడం తాను ఆర్డర్ పెట్టినవి కాకుండా అందుకు భిన్నమైన వేరే మందులు కొన్ని వుండటం మరికొన్ని (అక్టోబర్ 2023) కాలం తీరినవి వుండటం తో ఆశ్చర్యపోయారు. కాలం తీరిన ఆ మందులు తింటే ప్రాణాలకే ప్రమాదమని భయపడి మందులు పంపిన మెడ్ ప్లస్ కు ఫోన్ చేయగా వారినుంచి నిర్లక్ష్యం గా సమాధానం రావటంతో కనీసం రీప్లేస్మెంట్కు క్షుడా తిరస్కరించటంతో పోలీసు లకు ఆశ్రయించాల్సి వచ్చింది.
పోలీసుల జోక్యంతో మందులు రీప్లేస్మెంట్ ఇచ్చారు .
మీరు ఆన్లైన్లో మందులు కొంటున్నారా..!
తస్మాత్ జాగ్రత్త నాసిరకం మందులు,కాలం తీరిన మందులు మీ పార్సిల్ లో ఉంటాయి అంటూ బాధితుడు రాఘవాచార్యులు ప్రజలకు అప్రమ త్తం చేస్తున్నారు.
నాసిరకం మందులు కాలం తీరిన మందులు అమ్ముతున్న మెడ్ ప్లస్ ఫార్మసీ మీద మందుల నాణ్యత, నియంత్రణ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. చర్యలు తీసుకోవాల్సిన అధికారుల మౌనం వహించటం వెనక వున్న ఒప్పందం ఏమిటో తెలియాల్సి వుంది.

చదువుకు పేదరికం అడ్డు కాదు

సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్

- **సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ కళాశాల విద్యార్థులకు ప్యాడ్‌లు రాత కిట్లు పంపిణీ**
- **ప్రతి విద్యార్థి క్రమశిక్షణను అలవర్చుకోవాలి**
- **నోడల్ ప్రధానోపాధ్యాయులు కొత్త జగన్మోహన్ రెడ్డి**
- **పదవ తరగతిలో10/10, ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధిస్తే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్న సమ్మి గౌడ్**
- **ఉన్నత లక్ష్యమే ధ్యేయంగా విద్యార్థి చదవాలి: సమ్మిగౌడ్**

కేసముద్రం మండలం వెలుతురు ఫిబ్రవరి 21:
కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు,పెన్నులు, పెన్సిల్, షార్ప్నర్, ఎరేజర్ లతో కూడిన కిట్ లను ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ చిలువేరు సమ్మయ్య గౌడ్ అందజేశారు. పాఠశాల ఆవరణలో ఇన్చార్జి ప్రిన్సిపల్ తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల నోడల్ ప్రధానోపాధ్యాయులు కొత్త జగన్మోహన్ రెడ్డి, సమ్మి గౌడ్ ఫౌండేషన్ ప్రతినిధులు, శ్రేయోభిలాషుల చేతుల మీదుగా పదవ తరగతి విద్యార్థులకు 82, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 98 పరీక్ష సామాగ్రి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ ఫౌండేషన్ చైర్మన్ చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ మంచిగా చదువుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థానం లభిస్తుందని, దేవాలయం లాంటి పాఠశాలలో భగవంతుడి స్వరూపం లాంటి ఉపాధ్యాయుల

పాఠాలను శ్రద్ధగా విని, కష్టం అనుకోకుండా ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో చదువుకున్న వారికి మాత్రమే మంచి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు కూడా ఉన్నత స్థాయి చదువుతో మంచి గుర్తింపును సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. ముఖ్యఅతిథి మండల నోడల్ ప్రధానోపాధ్యాయులు కొత్త జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమ్మె గౌడ్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పరీక్ష సామాగ్రిని అందజేయడం సంతోషకరమని, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ కు ప్రభుత్వ పాఠశాలల పట్ల మక్కువ ఎక్కువ అన్నారు. 2011 సంవత్సరంలో బిచ్చ నాయక్ తండ ప్రభుత్వ పాఠశాలలో తేలు కుట్టడం వల్ల అమ్మాయి చనిపోయిన విషయానికి చలించి మళ్లీ అలాంటి ప్రమాదం జరగకుండా ఉండాలని తన స్నేహితులతో కలిసి మండలంలోని 77 ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పరిశుభ్రత పేరుతో శ్రమదానం చేశారని గుర్తు చేశారు. సమాజం పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగిన చిలువేరు సమ్మయ్య గౌడ్ భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ వరం లాంటిదని, పాఠశాలలో వసతుల సౌకర్యం లేకున్నా విద్యార్థులు బాధపడవద్దని, స్వార్థం పెరిగిపోతున్న ప్రస్తుత కాలంలో ప్రజల అవసరాలను గుర్తించి తన వంతు సహాయంగా ముందుకు వస్తున్న చిలువేరు సమ్మయ్య గౌడ్ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని సిపిఎం మండల కార్యదర్శి, కేజీకేఎస్ రాష్ట్ర నాయకులు మోడెం వెంకటేశ్వర్లు అన్నారు. ఉన్నదాంట్లో సమాజంలోని నలుగురికి సహాయం చేస్తూ తలలో నాలుకలా, కుటుంబ సభ్యుడిగా సేవ

చేస్తున్న చిలువేరు సమ్మయ్య గౌడ్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దామరకొండ ప్రవీణ్ కుమార్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సామల నరసయ్య, చిలువేరు సాయి గౌడ్, దడ్వాయి సంఘం మండల అధ్యక్షుడు ఎర్రంశెట్టి అశోక్, కల్వల గౌడ సొసైటీ అధ్యక్షుడు ఓరుగంటి వెంకన్న, ఉపాధ్యాయ బృందం శాంతి కిరణ్, మస్లియోద్దీన్, పరుపాటి కిరణ్ రెడ్డి, నబీ, రామకృష్ణ, ఏఎన్ఎం పొన్నం కవిత, ఆశా కార్యకర్త పూజారి పద్మ, ఎదునూరి మహేందర్, కళాధర్, ఉపాధ్యాయునిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం..

ప్రజలను వెంటాడుతున్న విద్యుత్ పాపాలు !

మసిపూసి మారేడుకాయ చందంగా ఇప్పుడు విద్యుత్ వ్యవస్థ తయారయ్యింది. గత ప్రభుత్వం నిరంతర విద్యుత్ పేరుతో ఊదరొగట్టింది. లోపాలు బయటకు రాకుండా...లోపాల వార్తలను ప్రచురించకుండా కట్టడి చేయించింది. ఇప్పుడేమో గతంలో అధికారంలో ఉన్న పార్టీ గగ్గోలు పెడుతున్నది. విద్యుత్ అందక ఆందోళనలు చేసిన రైతులు అప్పుడూ ఉన్నారు..ఇప్పుడు కూడా ఉన్నారు. ఇప్పుడు అవే వార్తలను బలంగా ప్రచారం చేస్తున్న తీరు గత పాలకుల దుర్నీతిని తెలియచేస్తోంది. అప్పులు చేసి విద్యుత రంగాన్ని కుప్ప చేసిన వారు ఇప్పుడు మొసలు కన్నీరు కారుస్తున్నారు. నిజానికి విద్యుత్ బిల్లులు....విద్యుత్ కోతలు ముందునుంచీ తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాల్లో వివిధ విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. గతంలో ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోలేదు. తెలంగాణలో బెటర్‌మెంట్ ఛార్జీలతో షాక్‌లు ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. ఇక ఎపిలో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించడంతో పాటు..విద్యుత్ కోతలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.. ఛార్జీల పెంపు ఇప్పటికే తడిసి మోపెడు చేశారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పినా నష్టాలను తట్టుకోలేని విధంగా తయారు చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. వినియోగదారులకు దిమ్మతిరిగేల బిల్లులు వస్తున్నాయి. ఒక్కసారిగా వేల రూపాయల విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. కోలుకోలేని విధంగా విద్యుత్ చార్జీలు అప్పుడే పెంచేసారు.. విద్యుత్ వినియోగంలో పెరిగిన లోడ్‌కు సంబంధించి డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌లు వసూలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. దీనిని కొత్తగా వచ్చిన ప్రభుత్వం సవరించాల్సి ఉంది. గత ఏడాది నుంచే ఈ డెవలప్‌మెంట్ చార్జీలు కట్టాలంటూ బిల్లుల కింద సూచించినప్పటికీ వినియోగదారులు గమనించలేకపోతున్నారని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి బిల్లుల్లోనే కలిపి ప్రస్తుతం ఇవ్వడంతో బిల్లులు అధికంగా వచ్చాయంటున్నారు. కిలోవాట్ లోడ్ జీఎస్‌టీతో కలుపుకుని సుమారు రూ.1500 డెవలప్‌మెంట్ చార్జీలు వడ్డించినట్లు నాటి విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారు. బాయిలకాడ మీటర్లు పెట్టమని చెబుతూ వచ్చిన కెసిఆర్..ఇలా గృహ వినియోగదారులపై ఎడాపెడా ఛార్జీలు వేసి ముక్కు పిండి వసూలు చేయిం చారు. ఘనత వహించిన పాలకుల కాలంలో వందల్లో వచ్చే బిల్లులు వేల రూపాయల్లో వచ్చాయి. డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో అదనపు బాదుడు సామాన్య, మధ్య తరగతి ప్రజలను షాక్‌కు గురిచేసాయి. ఇళ్లలో ప్రతినెల రూ.200 నుంచి రూ.500లోపు విద్యుత్ బిల్లులు వస్తుండేవి. డెవలప్‌మెంట్ చార్జీలు ఒక్కసారి మాత్రమే వస్తాయని అవి తప్పనిసరిగా కట్టాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ భారం ఇప్పటికీ పడుతూనే ఉంది. ఇక ఎపిలో పరిస్థితి మరోలా ఉంది. పల్లెల్లో ఎప్పుడంటే అప్పుడు విద్యుత్ కట్ అవుతోంది. 9గంటల వ్యవసాయ విద్యుత్ అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ కోసం రాత్రిళ్లు రైతులు పొలాల వద్ద పడిగాపులు పడుతున్నారు. లోడ్ పెరగడమే కారణం అంటున్న అధికారులు జిల్లాల్లో అనధికార విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ... ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా సమాచారం ఇచ్చేవారు లేకపోవడం తో విద్యుత్ మోటార్ల వద్ద రైతులకు కాలం గడుపుతున్నారు. వేసవి ప్రారంభం కాకుండానే ఇలా ఉంటే ముస్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కాలం కావడంతో పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్న పరిశ్రమలకూ విద్యుత్ కష్టలు తప్పడం లేదు. వారబంది అమలు చేస్తుండటం వల్ల పూర్తిస్థాయిలో వరిసాగుకు నీరు అందటం లేదు. రాత్రిపూట ఫీడర్లు, సబ్‌స్టేషన్ల వారీగా కరెంటు ఇవ్వడంతో రైతులు వంతుల వారీగా రాత్రిపూటే పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇకపోతే గ్రామీణ ప్రాంతాల్లో అనధికార విద్యుత్ కోతలను అమలు చేశారు. ముఖ్యంగా విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిన సందర్భాల్లో గృహ విద్యుత్ వినియోగదారులకు సాయంత్రం, రాత్రి సమయాల్లో గంటనుంచి రెండుగంటల పాటు అనధికార కోతలు విధిస్తున్నారు. విద్యుత్ లోడ్ పెరిగిన సమయంలో అందుకు అనుగుణంగా డివిజన్ల వారీగా కోతలు విధిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ కోతలు మరింత పెరిగే అవకాశముందని అధికార వర్గాల సమాచారం. వ్యవసాయ సర్వీసులకూ గంటనుంచి రెండు గంటలపాటు అనధికార కోతలు అమలు చేస్తున్నారు. వ్యవసాయ అవసరా లకు పగటిపూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న ప్రభుత్వ ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండటం లేదని చెబుతున్నప్పటికీ చిన్నతరహా పరిశ్రమలకు కోతల బెడద తప్పటం లేదు. దీనితో రైతులకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. రబీలో మొక్కజొన్న, జొన్న పంటలూ అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో 5గంటలకే కుదిస్తే ఎలాగని రైతులు మండిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో 5 గంటల నుంచి 8 గంటలపాటు విద్యుత్ కోత విధిస్తున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. వ్యవసాయపంపు సెట్లకు ఉదయం 9గంటల విద్యుత్ సరఫరా చేయాల్సివుంది.

అది సక్రమంగా అమలు కాకపోవడంతో మొక్కజొన్న, తెల్లజొన్న, అపరాల సాగుకు వ్యయ ప్రయాసలకోర్చి నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో రోజుమార్చి రోజు ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నారు. దీనితో ఐదు గంటలపాటు సరఫరా నిలిపివేస్తున్నారు. వేసవి ప్రారంభం ముందే కోతలు మొదలయ్యాయని ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం, గ్రామాల్లో విద్యుత్ కోతలతో రైతులు, సామాన్య ప్రజానీకం నిత్యం కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అప్పుడే సమస్యలు తీరుతాయి.

శ్రీశైలంలో మహాకుంభాభిషేకం

మహాకుంభాబిషేకం క్రతువులు ప్రత్యేక పూజలు శ్రీశైలంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజులపాటు ఆలయంలో యాగాలు, హోమాలతో వేదపండితుల ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతిస్వామి, శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ, పండిరాధ్యులు కాశీ పీఠాధిపతి మల్లికార్జునమహాస్వామి మహాకుంభాబిషేకం పూజలలో పాల్గొనేందుకు శ్రీశైలం ఆలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9:45 ఉభయ దేవాలయాల గర్భాలయ విమాన గోపురాలకు మూలామూర్తులకు.. దేవతామూర్తులకు శాస్త్రోక్తంగా మహాకుంభాబిషేకం నిర్వహించనున్నారు. మహాకుంభాబిషేకం పూజలలో మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. మహాకుంభాబిషేకం పూజల సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు స్వామి అమ్మవార్ల దర్శనాలను ఈఓ పెద్దిరాజు తాత్కాలికంగా నిలిపివేశారు. మహాకుంభాబిషేకం వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అర్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీశైలం మారుమోగుతోంది.

శ్రీకాళహస్తిలో శివరాత్రి ఏర్పాట్లు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువుదీరిన వాయులింగేశ్వరుడు మహా శివరాత్రి ఉత్సవాలు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఇందుకు అనుగుణంగా ఆలయ అధికారులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో శివరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని చలువపందిళ్లు, మంచినీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికితోడు స్వామి దర్శనానికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఇదిలావుంటే భక్తుల పాలిట భూకైలాసంగా విరాజిల్లే శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోపల, ఆవరణలో కళాకారులు తీర్చిదిద్దిన రంగవల్లులు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన ఆలయం, గోపురాలకు చేసిన విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. జ్ఞానప్రసూ నాంబిక అతిథిగృహ సమీపంలోని దుకాణ సముదాయ గోడకు వేసిన చిత్రాలు అబ్బుర మనిపిస్తున్నాయి. విభిన్నరకాల నృత్య భంగిమలున్న ఈ చిత్రాలు అందరినీ కట్టిపడేస్తున్నాయి. ఇక్కడే శ్రీ-కాళ-హస్తి క్షేత్ర విశిష్టతను ప్రతిబింబించే చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయంలోని పలు ప్రదేశాలను కూలీలు నీటితో శుభ్రం చేస్తున్నారు. రాతిస్తంభాలపై పడిన ధూళిని ప్రత్యేక యంత్రాలతో తొలగిస్తున్నారు. ఉత్సవాలకు వివిధప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ ప్రాంగణంలో అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేయనున్నారు.

విజ్ఞాన జ్యోతి ఆచార్య విద్యాసాగర్ జీ

-నరేంద్రమోదీ ప్రధానమంత్రి

ఇటీవల సమాధి చెందిన సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ కు నివాళులు అర్పిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాసిన వ్యాసం

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ సమాధిని పొంది మనందరినీ విషాదంలో ముంచెత్తారు. లోతైన జ్ఞానం, ఎల్ల లెరుగని దయ , మానవాళిని ఉద్ధరించాలన్న అచంచలమైన నిబద్ధతతో ఆయన జీవితం ఆధ్యాత్మికంగా సుసంపన్నం అయింది. అనేక సందర్భాల్లో ఆయన ఆశీస్సులు అందుకున్న గౌరవం నాకు దక్కింది. అందువలన, నాతో సహా లెక్కలేనన్ని ఆత్మలకు మార్గాన్ని ప్రకాశవంతం చేసిన మార్గదర్శక కాంతిని కోల్పోయినట్లుగా నేను తీవ్రమైన లోటును అనుభవిస్తున్నాను. ఆయన అనురాగం, ఆప్యాయత, ఆశీస్సులు కేవలం సుహృద్భావ సంకేతాలు మాత్రమే కాదు, ఆధ్యాత్మిక శక్తిని ప్రసరింపజేసి, ఆయనతో సన్నిహితంగా మెలిగిన అదృష్టవంతులందరినీ శక్తివంతం చేసి, స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.

జ్ఞానం, కరుణ, సేవ కలిగిన త్రివేణిగా పూజ్య ఆచార్య జీ ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన నిజమైన తపస్వి, ఆయన జీవితం భగవాన్ మహావీర్ ఆదర్శాలకు ప్రతీక. ఆయన జీవితం జైన మతం మూల సూత్రాలకు ఉదాహరణగా నిలిచింది, దాని ఆదర్శాలను తన స్వంత చర్యలు, బోధనల ద్వారా ప్రతిబింబింప చేశారు. సకల జీవరాశులపట్ల ఆయనకున్న శ్రద్ధ జైన మతానికి జీవితం పట్ల ఉన్న అమితమైన గౌరవానికి అద్దం పట్టింది. ఆలోచనలో, మాటలో, చేతల్లో నిజాయితీకి జైన మతం ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తూ ఆయన నిజాయతీతో కూడిన జీవితాన్ని గడిపారు. ఆయన చాలా సరళమైన జీవనశైలిని కూడా అనుసరించారు. జైనమతం, భగవాన్ మహావీర్ జీవితం నుంచి ప్రపంచం ప్రేరణ పొందడానికి ఆయన వంటి మహానుభావులే కారణం. జైన సామాజిక వర్గంలో ఆయన ఉన్నత స్థానంలో నిలిచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాలేదు. మతాలు, ప్రాంతాలు, సంస్కృతులకు అతీతంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చారు. ఆధ్యాత్మిక జాగృతికి, ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారు.

విద్య ఆయన హృదయానికి చాలా దగ్గరైన రంగం. విద్యాధర్ (ఆయన చిన్ననాటి పేరు) నుండి విద్యాసాగర్ వరకు ఆయన ప్రయాణం విజ్ఞానాన్ని సంపాదించడం, అందించడంలో లోతైన నిబద్ధతతో కూడుకున్నది. న్యాయమైన, విజ్ఞానవంతమైన సమాజానికి విద్య మూలస్తంభమని ఆయన ప్రగాఢ విశ్వాసం. వ్యక్తులను శక్తివంతం చేయడానికి, లక్ష్యం, సహకారంతో కూడిన జీవితాలను గడపడానికి వీలు కల్పించే సాధనంగా జ్ఞానం లక్ష్యాన్ని అతను సమర్థించాడు.

న్యాయమైన మరియు జ్ఞానోదయమైన సమాజానికి విద్య మూలస్తంభమని అతని దృఢ విశ్వాసం. విద్యను వ్యక్తులకు సాధికారత కల్పించి ఒక ప్రయోజనం, సేవాభావం తో జీవితం గడిపేందుకు దోహదపడే సాధనంగా ఆయన భావించారు. వారి బోధనలు స్వీయ-అధ్యయనం , స్వీయ-అవగాహన ప్రాముఖ్యతను నిజమైన విజ్ఞానానికి మార్గాలుగా నొక్కిచెప్పాయి, జీవితకాల అభ్యాసం, ఆధ్యాత్మిక ఎదుగుదలలో నిమగ్నం కావాలని వారి అనుచరులను ప్రబోధించాయి.

అదే సమయంలో, మన సాంస్కృతిక విలువలతో ముడిపడి ఉన్న విద్యను మన యువత పొందాలని సంత్ శిరోమణి ఆచార్య విద్యాసాగర్ జీ మహరాజ్ జీ ఆకాంక్షించారు. నీటి ఎద్దడి వంటి కీలక సవాళ్లకు పరిష్కారం కనుగొనలేక పోయామని, గతం నుంచి నేర్చుకున్న పాఠాలకు దూరంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన తరచూ చెప్పేవారు. సంపూర్ణ విద్య

అనేది నైపుణ్యం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించేదని ఆయన విశ్వసించారు. భారతదేశ భాషా వైవిధ్యం పట్ల ఆయన ఎంతో గర్వపడ్డారు. భారతీయ భాషలను నేర్చుకోవడానికి యువతను ప్రోత్సహించారు.

పూజ్య ఆచార్య జీ స్వయంగా సంస్కృతం, ప్రాకృతం, హిందీలో విస్తృతంగా రచనలు చేశారు. ఒక సాధువుగా ఆయన చేరుకున్న శిఖరాలు, భూమిపై ఆయన ఎంత నిలదొక్కుకున్నారో ఆయన ప్రతిష్ఠాత్మక రచన 'మూకమతి'లో స్పష్టంగా కనిపిస్తుంది. తన రచనల ద్వారా అణగారిన వర్గాలకు గళం అందించారు.

ఆరోగ్య సంరక్షణ రంగంలో కూడా పూజ్య ఆచార్య జీ చేసిన కృషి చిరస్మరణీయం. ముఖ్యంగా నిరుపేదల నివాస ప్రాంతాల్లో ఆయన అనేక ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ఆయన విధానం సంపూర్ణమైనది, శారీరక శ్రేయస్సును ఆధ్యాత్మిక శ్రేయస్సుతో మిళితం చేస్తుంది, తద్వారా వ్యక్తి మొత్తం అవసరాలను తీర్చింది.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ విద్యాసాగర్ జీ మహరాజ్ జీ దేశ నిర్మాణం పట్ల చూపిన నిబద్ధత గురించి రాబోయే తరాలు విస్తృతంగా అధ్యయనం చేయాలని నేను ప్రత్యేకంగా కోరుతున్నాను. పక్షపాత ఆలోచనలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించాలని ఆయన ప్రజలను ఎల్లప్పుడూ కోరేవారు. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో భాగస్వామ్య వ్యక్తీకరణగా భావించిన ఆయన ఓటును బలంగా విశ్వసించేవారిలో ఒకరు. ఆయన ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన రాజకీయాలను సమర్థించారు, విధాన రూపకల్పన ప్రజా సంక్షేమం గురించి ఉండాలి కానీ స్వప్రయోజనాల గురించి కాదు (లోక్ నీతి లోక్ సంగ్రహ్ గురించి కాని లోభ్ సంగ్రహ్ గురించి) అని చెప్పారు.

పౌరుల తమ పట్ల, తమ కుటుంబాల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల బాధ్యతల విషయంలో తన పౌరుల నిబద్ధత పునాదులపై ఒక బలమైన దేశం నిర్మితమవుతుందని ఆయన విశ్వసించారు.

నిజాయితీ, చిత్తశుద్ధి, స్వావలంబన వంటి సుగుణాలను పెంపొందించుకోవాలని ఆయన వ్యక్తులను ప్రోత్సహించారు, ఇది న్యాయమైన, దయగల, అభివృద్ధి చెందుతున్న సమాజ నిర్మాణానికి అవసరమని ఆయన భావించారు. మనం వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నందున విధుల పట్ల ఈ ప్రాధాన్యత చాలా ముఖ్యం.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ క్షీణత విపరీతంగా ఉన్న ఈ కాలంలో, పూజ్య ఆచార్య జీ ప్రకృతికి కలిగే హానిని తగ్గించే జీవన విధానానికి పిలుపునిచ్చారు. అదేవిధంగా, మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి అత్యంత ముఖ్యమైన పాత్రను ఆయన చూశారు, వ్యవసాయాన్ని ఆధునికంగా, సుస్థిరంగా మార్చాలని కూడా నొక్కి చెప్పారు. జైలు ఖైదీల సంస్కరణకు ఆయన చేసిన కృషి కూడా చెప్పుకోదగినది.

వేల సంవత్సరాలుగా మన నేల ఇతరులకు వెలుగులు చూపించి మన సమాజాన్ని బాగు చేసిన మహానుభావులను అందించింది. సాధువులు, సంఘ సంస్కర్తల ఈ మహోన్నత వంశంలో పూజ్య ఆచార్య జీ మహోన్నత వ్యక్తిగా నిలుస్తారు. ఆయన ఏం చేసినా వర్తమానం కోసమే కాకుండా భవిష్యత్తు కోసం కూడా చేసేవారు. గత ఏడాది నవంబర్ లో ఛత్తీస్ గఢ్ లోని డోంగర్ గఢ్ లోని చంద్రగిరి జైన మందిరాన్ని సందర్శించే అవకాశం నాకు లభించింది. అప్పటి పూజ్య ఆచార్య జీ సందర్శన నా చివరి సమావేశం అవుతుందని నాకు తెలియదు. ఆ క్షణాలు చాలా ప్రత్యేకమైనవి. ఆయన నాతో చాలాసేపు మాట్లాడి, దేశానికి సేవ చేయడంలో నేను చేసిన కృషిని ఆశీర్వదించారు. మన దేశం తీసుకుంటున్న దిశ, ప్రపంచ వేదికపై భారత్ కు లభిస్తున్న గౌరవం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తాను చేస్తున్న పని గురించి మాట్లాడేటప్పుడు ఉత్సాహం చూపించారు. అప్పుడు, ఎప్పుడూ, వారి సున్నితమైన చూపులు, నిర్మలమైన చిరునవ్వు శాంతి , సేవా భావనను కలిగించడానికి సరి పోతాయి. ఆయన ఆశీస్సులు మనసుకు ఓదార్పునిచ్చే ఔషధంలా, మనలోని, చుట్టుపక్కల ఉన్న దైవిక ఉనికిని గుర్తు చేస్తాయి.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ లేని లోటును ఆయన గురించి తెలిసిన వారు, ఆయన బోధనలు, జీవితం స్పృశించినవారు శూన్యంగా భావిస్తారు. అయితే, ఆయన వల్ల స్ఫూర్తి పొందిన వారి హృదయాల్లో వారు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన జ్ఞాపకాలను గౌరవించడంలో, వారు బోధించిన విలువలను ప్రతిబింబించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఈ విధంగా, మనం ఒక గొప్ప ఆత్మకు నివాళులు అర్పించడమే కాకుండా, మన దేశం, ప్రజల కోసం ఆయన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తాము.

రచయిత: భారత ప్రధానమంత్రి

రైతులు దేశ ద్రోహులా?

రైతులు మరోసారి తమ డిమాండ్లకు దేశ రాజధాని పరిసరాల్లో వీధుల్లోకి రావలసి వచ్చింది. వారి డిమాండ్ల మంచిచెడులను అటుంచితే, ఈ సందర్భంగా రైతుల గురించి ముఖ్యంగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విషప్రచారం కొనసాగుతూ ఉండటం దురదృష్టకరం. ఒకప్పుడు దేశానికి అన్నం పెట్టే రైతులను 'జై కిసాన్' అంటూ హీరోలుగా చూసిన దేశంలో నేడు ఖలిస్తాన్ మద్దతుదారులుగా చిత్రీకరించే దుస్థితికి దిగజారడానికి మించిన దేశద్రోహం మరొకటి ఉండదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన వివాదాస్పదమైన మూడు రైతు చట్టాల పట్ల చెలరేగిన రైతుల ఆగ్రహ జ్వాలలు సుమారు సంవత్సరం పాటు తీవ్ర నిరసనలకు దారితీయగా, స్వయంగా ప్రధాన మంత్రి జోక్యం చేసుకొని, ఆ చట్టాలను ఉపసంహరించుకొంటున్నట్టు పార్లమెంట్ లో ప్రకటించడంతో ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ గత మూడేళ్లలో ఆ దిశలో ఎటువంటి ప్రయత్నం జరగకపోవడంతో రైతులు అసహనానికి గురవుతున్నారు.

తిరిగి ఇప్పుడు 'చలో ఢిల్లీ' పేరుతో రైతులు ఉద్యమిస్తున్నారు. ఇప్పుడు రైతులు కొత్తగా ప్రభుత్వం ముందుకు ఈ డిమాండ్లు తీసుకురావడం లేదు.

ఎన్నికల ముందు ప్రతిపక్షాలు వీరిని రెచ్చగొడుతున్నాయంటూ బాధ్యతా రహితంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజంగా ప్రతిపక్షాలకు అంతటి బలం ఉంటే ఎన్నికల్లోనే తమ ప్రతాపం చూపే ప్రయత్నం చేసేవి గదా! చివరకు కనీసం మద్దతు ధర గురించి కేంద్ర ప్రభుత్వం నియమించిన 'నిపుణుల కమిటీ' సభ్యుడు ఒకరు ఒక టివి చర్చలో ఉద్యమిస్తున్న రైతులను 'దేశద్రోహులు' అని పేర్కొన్నారంటే 'రైతు వ్యతిరేక' వ్యక్తులు లేదా రైతుల సమస్యలపట్ల కనీసం అవగాహనలేని వ్యక్తులు నేడు కీలక స్థలం లో ఉండటంతో పరిస్థితులను అర్థం చేసుకోలేకపోతున్నారు.

స్వాతంత్ర్యం తర్వాత ప్రధాని పదవిలో ఉన్నవారిలో కేవలం ఇద్దరు మాత్రమే నిజమైన రైతులు లేదా వారి ప్రతినిధులు ఉన్నారని చెప్పవచ్చు. వారిలో అగ్రనేత చరణ్ సింగ్. ఆయన ప్రధానిగా పార్లమెంట్ ముఖం చూడకుండానే రాజీనామా చేశారు.

ఆ తర్వాత హెచ్‌డి దేవెగౌడ 11 నెలలకు మించి పదవిలో ఉండలేకపోయారు. మిగిలిన ప్రధానులు ఎవ్వరికీ రైతుల సమస్యలపట్ల సరైన అవగాహన లేకపోవడంతోనే వారి సమస్యలను కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల దృష్టిలో చూస్తున్నారు. అయితే, ఇందిరా గాంధీ ప్రధాని పదవి చేపట్టగానే మొదటి సారిగా అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు 'ఓ భిక్ష పాత్రతో భారత్ ప్రధాని అమెరికాకు వచ్చారు' అని అక్కడి మీడియా పతాక శీర్షికతో వార్తలు రాయడంతో ఆమె అవమానంగా భావించారు. వెంటనే భారత్‌లో ఆహారోత్పత్తులు పెంచాలని దృఢమైన నిర్ణయం తీసుకొని, ఆహార విప్లవంను పట్టుదలతో సాధించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి వంగడాలు రూపొందించడంలో ఆమెకు బాసటగా ఎంఎస్ స్వామినాథన్ నిలిచారు. ఈ మధ్య ప్రధాని మోడీ దేశ అభివృద్ధికి నాలుగు 'కులాలు' తనకు ప్రధానం అంటూ యువత, మహిళలు, పేదలు, రైతులు అని చెప్పడం ద్వారా రైతుల అభ్యున్నతే తన ప్రాధాన్యతగా వెల్లడించారు. అయితే 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రకటించిన ప్రధాని ఇప్పుడా విషయం గురించి మాట్లాడటం లేదు.

మరోవంక, తన ప్రభుత్వం పట్ల రైతులు ఆగ్రహంతో ఉన్నారని గ్రహించి ఎన్నికలముందు హడావుడిగా చరణ్ సింగ్, స్వామినాథన్‌లకు 'భారత్ రత్న' లను ప్రకటించారు. కానీ రైతుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని రైతులలో ఇప్పటికీ విశేషమైన ప్రభావం గల చరణ్ సింగ్‌కు 'భారత్ రత్న' ప్రకటించడంతో పార్లమెంట్‌కు సొంతంగా ఎన్నిక కాలేక ఇబ్బందిపడుతున్న ఆయన మనుమడు జయంత్ చౌదరి 'ఇండియా' కూటమి నుండి నిష్క్రమించి 'ఎన్‌డిఎ' కూటమిలో చేరుతున్నట్లు ప్రకటించారు. తద్వారా బిజెపి రాజకీయంగా లోక్‌సభ ఎన్నికలలో ప్రయోజనం పొందే అవకాశం ఉంది. అయితే, కనీస మద్దతు ధరతో పాటు ఇతర డిమాండ్లపై ఇప్పటికి మూడు సార్లు కేంద్ర మంత్రులతో రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోయింది. తమ డిమాండ్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు దేశసరిహద్దులను మూసివేస్తూ కంచెలు వస్తున్నట్లుగా ఢిల్లీ చుట్టూ తీవ్రమైన నిర్బంధాలకు దిగుతున్నారు. భారీ ఎత్తున భద్రతా దళాలను మోహరింపచేసి రైతులు కదలకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు.

2020లో రైతుల మధ్య చీలికలు తీసుకొచ్చి, వారిలో ఖలిస్థాన్ ఉగ్రవాదులు చేరిపోయారంటూ ప్రచారం చేస్తూ ఉద్యమాన్ని అణచివేయడం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. దాంతో ఇప్పుడు ముందుగానే ప్రభుత్వం అప్రమత్తమై రైతులు అసలు ఢిల్లీకి రాకుండా కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం మద్దతు ధరను చట్టబద్ధం చేస్తే ఆహార ద్రవ్యోల్బణం పెద్ద ఎత్తున పెరుగుతుందని, ప్రభుత్వంపై రూ. 10 లక్షల కోట్లమేరకు అదనపు వ్యయం అవుతుందని నిరాధారమైన కథనాలు నేడు మీడియాలో వ్యాపిస్తున్నాయి. భారత్ ను 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెబుతున్న ప్రధాని మోడీ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయకుండా సాధింపగలరా? 'సబ్ కా సాత్ %్%్% సబ్ కా వికాస్' తన లక్ష్యంగా ప్రధాని చెబుతున్నారు. దేశ జనాభాలో సగం మంది, అంటే 70 కోట్ల మందికి ఇంకా వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయ కుటుంబాల గురించిన తాజా సర్వే ప్రకారం ఒక్కో కుటుంబం సగటు వార్షిక ఆదాయం రూ. 10,218 మాత్రమే.

వారి వ్యవసాయేతర ఆదాయాలను పరిగణనలోకి తీసుకొని పక్షంలో రోజువారీ ఆదాయం రూ. 27 మాత్రమే. అంటే, దేశంలో అత్యంత పేదవారు రైతులే అని గ్రహించాలి. ప్రభుత్వం 23 పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తుంది. వాటిల్లో కేవలం బియ్యం, గోధుమలు మాత్రమే నియంత్రిత మార్కెట్లు ఉన్నాయి. పత్తి, చెరకు, పప్పుధాన్యాలు పాక్షికంగా కొన్ని రాష్ట్రాలలో ఉన్నాయి. కేవలం 14% మంది రైతులకు మాత్రమే మద్దతు ధర లభిస్తున్నట

అధికారుల నిర్లక్ష్యమా..? పాలకుల చేతకాని తనమా...?

నూతనకల్, వెలుతురు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు, జంతువులకు ప్రాణ సంకటంగా మారుతోంది.. నిత్యం ప్రజలు తిరిగే చోట విద్యుత్ అధికార్లు ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండలం పరిధిలోని చిల్పకుంట్ల గ్రామం ఎస్సి కాలనీలో కరెంట్ స్తంబానికి పెట్టిన ట్రాన్స్ ఫార్మర్ కూలి ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాదుడు లేడంటు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు.. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా విద్యుత్ ఆధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇరుకైన చౌరస్తా, ఆపై ట్రాన్స్ ఫార్మర్ ఇలా ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందో అంటూ గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు.. అధికారుల నిర్లక్ష్యమా..? లేకుంటె పాలకుల చేతకాని తనమా...? అంటూ గ్రామస్థులు మండిపడుతున్నారు.. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.. లేని పక్షంలో ఎలాంటి అవాంతరాలు జరిగినా దానికి స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు..

రాష్ట్ర ఎస్సి మోర్చా కోశాధికారిగా
బచ్చిగళ్ళ రమేష్ నియామకం

తుర్కయంజాల్, వెలుతురు:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటి కి చెందిన బచ్చిగళ్ళ రమేష్ ను బిజెపి రాష్ట్ర ఎస్సిమోర్చా కోశాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసిన బిజెపి రాష్ట్ర ఎస్సిమోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ రమేష్ గతం లో రెండు పర్యాయాలు రంగారెడ్డి జిల్లా ఎస్సిమోర్చా అధ్యక్షునిగా సేవాలందించారనీ ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ఎస్సిమోర్చా కోశాధికారిగా నియమించినదుకు చాలా సంతోషంగా ఉందని నాకిచ్చిన భాద్యను ఇంకను సమర్ధవంతంగా నిర్వహిస్తానని వారు తెలిపారు. నాకు రాష్ట్ర బాధ్యత ఇచ్చిన బిజెపి ఎస్సిమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ కి రాష్ట్ర బిజెపి అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డికి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ కి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతికి, రాష్ట్ర క్రమశిక్షణ క్షమిటి సభ్యులు శ్రీ బోసుపల్లి ప్రతాప్ గారికి, బిజెపి రంగారెడ్డి జిల్లా రథసారథి బొక్క నర్సింహా రెడ్డికి దన్యవాదాలు తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం
- విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నంగునూరు మండల్, వెలుతురు ఫిబ్రవరి21:
ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్మెటలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగింది పదవ తరగతి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నేడు డీఈవోగా పిల్లి శివకుమార్ ఎంఈఓగా కాలకుంట్ల శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయురాలుగా కొలుపుల వైష్ణవి ఉపాధ్యాయులుగా అఖిలా శృతి పూజ వర్షా శ్రీజాస్మిని దివ్య హారిక హాసిని

భార్గవి హాసిని మనోజ్ఞ మనుష ప్రణతి రమ్య సంధ్య అఖిల శ్రావణి స్నేహరితిక వైష్ణవి అవినాష్ రెడ్డి జితేందర్ మనోజ్ రాకేష్ హర్షవర్ధన్ చరణ్ పావని పూజ రాజు కరుణాకర్ అటెండర్‌గా కట్ట గణేష్ తదితరులు వివరించడం జరిగింది అని ఎంఈఓ దేశిరెడ్డి పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి శ్రీనివాస్ తెలియ చేయనైనది.

నేటి ప్రధానోపాధ్యాయులుగా కొలుపుల వైష్ణవి మాట్లాడుతూ గురుతర బాధ్యత ఎంత కఠిన తరంగా ఉంటుందో విద్యార్థుల క్రమశిక్షణ పట్ల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించడం మరియు పాఠశాల నిర్వహణ ఎంత కష్టంగా ఉంటుందో ఈరోజు అర్థమైంది అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి శ్రీనివాస్ ఉపాధ్యాయులు సత్యనారాయణ ఉపేందర్ రెడ్డి గణేష్ ప్రభాకర్ రెడ్డి మన్మోహన్ రెడ్డి కనకయ్య జనార్దన్ రెడ్డి ఆనంద రెడ్డి గఫూర్ శివయ్య లలిత నరేందర్ రాజ్ కుమార్ సి ఆర్ పి రేణుక ఎస్టై వి టీచర్లు చంద్రకళ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధి
మీడియా: వజ్రేష్ యాదవ్

మేడిపల్లి, వెలుతురు:
మేడిపల్లి మండలంలోని ప్రతీ జర్నలిస్టుకు కనీస వసతులు కల్పిస్తూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందరికి అందేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుదవారం బుద్దానగర్ లోని మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే మీడియా.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా తమ విలువైన సూచనలు అందజేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఆయన సూచించారు.. రాజకీయ వత్తిళ్లకు తలొంచకుండా ప్రజల పక్షాన మీడియా ప్రతినిధులు నిలబడాలని కోరారు.. గత ప్రభుత్వం హయాంలో మీడియాను బీఆర్ఎస్ నాయకులు అణచివేతలకు గురి చేశారని ఆయన ఆరోపించారు..

రానున్న కాలంలో జర్నలిస్ట్ లకు రాష్ట్ర సర్కారు అనేక పథకాలను అందించేందుకు సిద్దంగా ఉన్నదని చెప్పారు వజ్రేష్.. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మూడు చింతలపల్లి వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్ గౌడ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కార్పొరేటర్లు చందర్ గౌడ్, సుమన్ నాయక్, బింగి జంగయ్య యాదవ్, రసాల వెంకటేష్ యాదవ్, గుర్రాల వెంకటేష్ యాదవ్, పులకండ్లజంగా రెడ్డి, కీసర మండల్ ప్రధాన కార్యదర్శి రామిడి విజయ్ రెడ్డి, కీసర మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ రామ్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, లోకేష్, రామ్ చందర్ యాదవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్లయ్య, శ్రీదర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

చేవెళ్ల, మహబూబ్ నగర్ స్థానాలు బిజెపివే...

కొండా విశ్వేశ్వర్ రెడ్డి గుణవంతుడు
మోడీ హ్యాట్రిక్ పిఎం కావడం ఖాయం
కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట్ రమణా రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):
చేవెళ్ల, మహబూబ్ నగర్ స్థానాలను బిజెపి కైవసం చేసుకోవడం ఖాయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట్ రమణారెడ్డి పేర్కొన్నారు.బుధవారం బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి అధ్యక్షతన బిజెపి నాయకులు హరిత రిసార్ట్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట్ రమణారెడ్డి, రాణి రుద్రమదేవి, మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, బద్దం మహిపాల్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్ రమణారెడ్డి మాట్లాడుతూ,రేవంత్ రెడ్డి ఇన్చార్జిగా ఉన్న రెండు పార్లమెంట్ స్థానలలో ముఖ్యమంత్రి కి ఓటమిని చూపిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కామారెడ్డి లో ఓటమిని చూపించామని, 60 రోజుల్లో మరోసారి ఓటమిని చూపిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఇన్చార్జిగా ఉన్న చేవెళ్ల, మహబూబ్నగర్ రెండు చోట్ల ఓటమిని చూపిస్తామన్నారు.

చేవెళ్ల పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి దిక్కులేక ఇతర పార్టీ నుండి అభ్యర్థిని తీసుకొచ్చి పోటీలో పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రజల మనసులో మోడీ ఉన్నారని, ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ప్రజలు బిజెపి పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, మరొకసారి మోడీ దేశ ప్రధానిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలోబిజెపి పార్టీకి ఓటు బ్యాంకు పెరిగిందని అన్నారు. గతంలో బిజెపికి నాలుగు స్థానాలు వచ్చాయని, ఇప్పుడు 17 స్థానాలు బిజెపి పార్టీ కైవసం చేసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద రెడ్డి, శివరాజ్, బసవలింగం, పాండు గౌడ్, కే పీ రాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ దందాపై రెవెన్యూ అధికారుల మెరుపు దాడి

ఎర్రరాయి మైనింగ్ దందాకు పుట్టినిల్లుగా మారిన గణేష్ పూర్ గ్రామం
హిటాచి, టిప్పర్ స్వాధీనం
మరో ఐదు వాహనాలు పరార్
విచారణ చేపడుతున్నట్లు తెలిపిన న్యాల్కల్ తహసిల్దార్ భాను కిరణ్

జహీరాబాద్, 21 ఫిబ్రవరి వెలుతురు:
తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు సంగారెడ్డి జిల్లా న్యాల్ కల్ మండలం, గణేష్ పూర్ గ్రామం మైనింగ్ దందాకు పుట్టినిల్లుగా మారింది. ప్రభుత్వ, అసైన్డ్, పట్టా భూముల్లో అనునిత్యం ఎదేచ్ఛగా ఎర్రరాయి కొనసాగుతుగుతుంది. ఈ ఎర్ర రాయి తవ్వకాలను ఆసరా చేసుకుని కొందరు అక్రమార్కులు ఎర్ర రాయి తవ్వకాలను ఇస్టాను సారంగా కొనసాగిస్తూ లక్షల్లో సొమ్ము చేసు చేసుకుంటున్నారు. పాతిక రోజులుగా నిలిచి పోయిన మైనింగ్ దందా (ఎర్ర రాళ్ల తవ్వకం)ను తిరిగి బుధవారం కొనసాగిస్తున్నట్లు సమాచారం న్యాల్కల్ మండల రెవెన్యూ అధికారులు ఉదయం మెరుపు దాడి చేశారు.

తహసిల్దార్ భాను కిరణ్, ఉప తహసిల్దార్ రాజిరెడ్డిలు గ్రామ శివారులో కొనసాగుతున్న మైనింగ్ ప్రదేశాన్ని

పరిశీలించారు. అక్రమంగా ఎర్ర రాళ్ల తవ్వకాలు, మట్టి తరలిస్తున్న ఇటాచి, టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని స్థానిక హద్నూర్ పోలీస్ స్టేషనకు తరలించారు. రెవెన్యూ అధికారుల రాకను గుర్తించిన కొందరు మరో ఐదు వాహనాలతో పరారయ్యారు. విచారణ చేపడుతున్నట్లు తహాసిల్దార్ భాను కిరణ్ తెలిపారు.

పొన్నం ప్రభాకర్‌ని కలిసి
వినతిపత్రం అందజేసిన సెల్ఫ్ హెల్ప్ ఉద్యోగులు

కరీంనగర్, వెలుతురు, ఫిబ్రవరీ 21:
శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ద్వారా విధులు నిర్వహిస్తున్న వర్కర్స్, ఉద్యోగుల అవుట్ సోర్సింగ్ విధానానికి సహకరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి వర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతిపత్రం అందజేసిన సెల్ఫ్ హెల్ప్ ఉద్యోగులు .... సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ల్లో ఉండి యూనివర్సిటి లో వివిధ విభాగాల్లో చాలి చాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించడం కోసం ప్రభుత్వ నిబంధనల మేరకు చట్టబద్దంగా గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సంకసాల మల్లేష్

తీసుకుంటున్న చర్యలపై కొంతమంది పని గట్టుకొని చేస్తున్న అసత్య, దుష్పచారాన్ని, మంత్రి దృష్టికి ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తరువున తీసుకెళ్లడం జరిగింది...యునివర్సిటీ పై గత కొన్ని రోజులుగా వస్తున్న అసత్య కథనాల ప్రచారం, ఆరోపణలు, అవాస్తవాలపై బుధవారం మంత్రిని కలిసి మా యూనియన్ తరుపున కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది... దీంతో మంత్రి సానుకూలంగా స్పందిచినారని. జీవో ప్రకారం మాత్రమే సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ సభ్యులను న్యాయం జరిగేల చూస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడం జరిగిందని ఆన్నారు మంత్రి ని కలిసిన వారిలో ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ న్యాలం కిషన్ గౌడ్, మరియు యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

అయోధ్య వెళ్తున్న భక్తుల ప్రత్యేక వాహనాన్ని కాషాయ జండా ఊపి ప్రారంభిస్తున్న మండల బిజెపి అధ్యక్షులు

వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 21 :
మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట నుండి అయోధ్యలో బాలరాముని దర్శనానికి వెళ్తున్న భక్తుల ప్రత్యేక వాహనాన్ని పెద్ద శంకరంపేట లోని రామాలయం వద్ద బుధవారం మండల బిజెపి అధ్యక్షుడు కాషాయ జండా ఊపి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల నుండి బిజెపి నాయకులు భక్తులు అధిక సంఖ్యలో కామారెడ్డి నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రైన్ లో అయోధ్యకు తరలి వెళ్లారు.

ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు శ్రావణ్ కుమార్. మంగలి కృష్ణ.. బుగుడాల కృష్ణ ఆర్ఎస్ఎస్ బాద్యులు సీతారామారావు దేశ్పాండే.. వీరప్ప.. సంతోష్ కుమార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లోల్ మైనారిటీ గురుకులంలో ఘనంగా అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరైన శ్రామిక విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు డాక్టర్ విజయ లక్ష్మీ

జహీరాబాద్, 21 ఫిబ్రవరి, వెలుతురు :
"మాతృ భాష తేనే కంటే తియ్యనిది, భాష లేనిదే సమాజంలో మానవుని మనుగడ లేదు" అని శ్రామిక విజ్ఞాన కేంద్రం జహీరాబాద్ నిర్వాహకులు డాక్టర్ విజయ లక్ష్మీ తెలిపారు. సంగారెడ్డి జిల్లా అల్లోల్ మైనారిటీ బాలుర గురుకులంలో ఘనంగా జరిగిన అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ వేడుకల్లో వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాతృభాష పట్ల ఆసక్తి, అవగాహన

పెంచాల్సిన ఆవశ్యకతతో పాటు మాతృభాషను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని ఆమె అన్నారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతు మాతృభాష లో వివిధ రకాలైన మంచి పుస్తకాలను చదవాలని రీడింగ్ క్లబ్ మరియు సైన్స్ క్లబ్ ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జే. రాములు, కే.ఎస్.జమీల్, కోఆర్డినేటర్లు రహీం, నాగర్జున, శ్రీనివాస్, సమీయుద్దీన్, ఇర్ఫాన్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహం

అనగనగా రాంపూర్ అనే గ్రామంలో సింధు, కృష్ణవేణి, రాధ అనే ముగ్గురు స్నేహితులు ఉండేవారు. వారిలో కృష్ణవేణి, సింధు ఎక్కువ స్నేహంగా ఉండేవారు. వారిద్దరు ఎక్కువ స్నేహంగా ఉండడం రాధకు నచ్చేది కాదు. ఎలాగైనా సరే వారిద్దరి మధ్యన గొడవ పెట్టాలని రాధ అనుకుంది.

ఒకరోజు కృష్ణవేణి పాఠశాలకు యాభై రూపాయలు తెచ్చుకుంది. ఆ విషయం రాధకు తెలుసు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో కృష్ణవేణి, సింధు ఇద్దరు కలిసి భోజనానికి వెళ్తారు. అదే సమయంగా భావించి అక్షయ ఎవరు లేని సమయం చూసి కృష్ణవేణి బ్యాగ్ నుంచి యాభై రూపాయలు తీసి సింధు బ్యాగ్ లో పెడుతుంది. భోజనం చేసి వచ్చిన కృష్ణవేణి బ్యాగులో యాభై రూపాయలు లేవు. ఏమి చేయాలో అర్థం కాక కృష్ణవేణి ఏడుస్తుంది.

కృష్ణవేణిని రాధ దగ్గర తీసుకుని ఓదారుస్తుంధి. అందరి బ్యాగులు సింధు చెక్ చేస్తుంది. ఎవ్వరి బ్యాగులో కూడా యాభై రూపాయలు దొరకలేదు. చివరకు అక్షయ నీ బ్యాగ్ కూడా చెక్ చెయ్ అని సింధును అంటుంది. సింధు బ్యాగులో యాభై రూపాయలు దొరుకుతాయి. అందరూ ఆశ్చర్యపోతారు. రాధ మనసులోనే నవ్వుతుంది. కానీ కృష్ణవేణి తన ఆలోచన అప్పటికప్పుడే మార్చుకుని, నేను సింధు బ్యాగ్ లో డబ్బులు పెట్టి మర్చిపోయాను అంటుంది. సింధు ఆశ్చర్యపోతుంది. రాధ తను తప్పు తెలుసుకుంటుంది. స్నేహమంటే ఇలాగే ఉంటుందని గ్రహించి తిరిగి వారిద్దరితో కలిసి ఉండసాగింది.

నీతి: సహాయం

రేణుక
ఎనిమిదవ తరగతి
ZPHS హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా
6302411016

ఆలోచన

అనగనగా ఒక ఊరిలో సోనీ, చైత్ర అనే ఇద్దరు అక్కాచెల్లెల్లు ఉండేవారు. ఇద్దరు ప్రతిరోజు బడికి వెళ్లేవారు. వీళ్లు బడికి వెళ్లే దారిలో బాగా కోతులు ఉండేవి. ఒకరోజు ఆ కోతులను చూసి ఇద్దరు పరిగెత్తి దూరంగా పరుగెత్తారు. ఇంటికి వెళ్ళుదామంటే అమ్మ నాన్న పొలం పనులకు వెళ్తారు. ఏం చేయాలో వారికి అర్థం కావడం లేదు. కానీ వాళ్లు బడికి వెళ్లాలన్న పట్టుదలతో ఉన్నారు.

చాలాసేపు ఒక చోటు దగ్గర నిల్చున్నారు. ఇద్దరు కలిసి బాగా ధైర్యం తెచ్చుకున్నారు. తాము తెచ్చుకున్న సంచిలో బిస్కెట్ ప్యాకెట్ ఉంది. నెమ్మదిగా బిస్కెట్లను చేతిలో పట్టుకొని దారి పక్కకు విసిరేశారు. కోతులు బిస్కెట్ల వైపు వెళ్ళగానే అక్క చెల్లెలు ఇద్దరు బడికి వెళ్లారు. బడిలో మాస్టారులకు కోతుల గురించి చెప్పగా వారు ప్రతి రోజు సోని, చైత్రలను బడికి తీసుకువచ్చి తిరిగి వాళ్ళ ఇంటికి పంపే ఏర్పాటు చేశారు. ఇద్దరూ చక్కగా చదువుకుని మంచి పేరు తెచ్చుకున్నారు

నీతి: చక్కటి ఆలోచనతో సమస్య పరిష్కరించుకోవచ్చు

చెప్యాల స్నిగ్ధ
ఆరవ తరగతి
ZPHS హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా
9705182096

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న డా:ఉజ్వల్ రెడ్డి

జహీరాబాద్, 21 ఫిబ్రవరి, వెలుతురు :
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోగల షాహిన్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టి ట్యూట్ 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ డా.ఉజ్వల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం షాహిన్ స్కూల్ మరియు కళాశాల గ్రూప్ ఆఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ ఫుర్కాన్ డా: ఉజ్వల్ రెడ్డికి స్వాగతం పలికి వేదిక పైకి ఆహ్వానించి సన్మానం చేయడం జరిగింది. అనంతరం వార్షికోత్సవం వేడుకలను ఉద్దేశించి డా: ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ వార్షికోత్సవానికి ఆహ్వానించినందుకు ముందుగా షాహిన్ గ్రూప్ ఆఫ్ వారికి ప్రత్యేక నమస్కారాలు తెలియజేస్తూ ఇంతటి గొప్ప వార్షికోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉందని, అదేవిధంగా ఈనాటి బాల బాలికలే రేపటి పౌరులని, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండి, మంచి అలవాట్ల వైపు మొగ్గు చూపాలని విద్యార్థిని, విద్యార్థులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ

నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు, యన్ యస్ యు ఐ నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం...

హైదరాబాద్ నుండి సిద్దిపేటకు హుటా హుటిన చేరుకున్న ఎమ్మెల్యే హరీష్ రావు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

కొన్ని గంటలపాటు భారీగా ఎగసిపడిన మంటలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఫోన్ లో మాట్లాడిన హరీష్ రావు

సంఘటన స్థలం వద్ద ఉండి ఎప్పటికిప్పుడు ఫైర్ ఆఫీసర్స్ విద్యుత్ అధికారులతో మాట్లాడుతు గజ్వేల్ దుబ్బాక హుస్నాబాద్ నుండి ఫైర్ ఇంజన్స్‌ను తెప్పించిన ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట టౌన్, వెలుతురు ఫిబ్రవరి21:
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 220/132 kv సబ్ స్టేషన్‌లో ఒక్కసారిగా భారీ మంటలు ఎగిసి పడ్డాయి. ఈ ప్రమాదంలో మంటలు భారీగా చెలరేగుతుండటంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను నిలిపివేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. సబ్ స్టేషన్ అగ్ని ప్రమాదం

సంభవించడంతో సిద్దిపేట పట్టణం అలాగే చుట్టుపక్కల మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంటలు పక్కన ఉన్న ట్రాన్స్ ఫార్మర్లు కూడా వ్యాపించడంతో అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది శ్రమించాల్సి వస్తుంది. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు హైదరాబాద్ నుండి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు ఎమ్మెల్యే హరీష్ రావు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డిలు ప్రమాదానికి సంబంధించిన పరిస్థితిపై విద్యుత్ అధికారులను అడిగి

తెలుసుకున్నారు. ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకోవాలని అగ్నిమాపక మునిసిపల్ అధికారులతో హరీష్ రావు ఫోన్లో మాట్లాడి సిద్దిపేటతో పాటు దుబ్బాక గజ్వేల్ హుస్నాబాద్‌ల నుండి రప్పించారు. ఫైరింజలతో ఆర్పేందుకు ప్రయత్నించిన మంటలు అదుపులోకి రాకపోవడంతో మంటలను ఆర్పే అగ్ని నివారణ పోమ్‌ను ఉపయోగించారు.

ప్రజలకు ఇబ్బంది కలవకుండా ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.

కల్లుగీత కార్మికులు సమస్యలను పరిష్కరించండి

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు రాగిరి కృష్ణయ్యా

వెలుతురు న్యూస్ రామన్నపేట యాదాద్రి జిల్లా:
కల్లుగీత కార్మికుల సంక్షేమానికి చొరవ చూపాలని, కల్లు గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు రామన్నపేట ఎక్సైజ్ సీఐ బదిలీపై వెళ్లిన నాగలత మేడంను సన్మానించి, నూతన బాధ్యతలు స్వీకరించిన బానోజీ నాయకకు స్వాగతం పలికినారు. బుధవారం రామన్నపేట ఎక్సైంజ్ కార్యాలయంలో కలిసి కల్లుగీత కార్మిక సమస్యలను పరిష్కరించాలని ప్రతి గ్రామంలో ఈత చెట్లను పెంచి కల్లుగీత కార్మికులు నూతన సభ్యత్వాలను ఇవ్వాలని పెండింగ్లో ఉన్న ఎక్స్ గ్రేషియా వెంటనే ఇవ్వాలని నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలను విడదీస్తూ నూతన లైసెన్సులు ఇప్పించాలని కోరారు.

ఇట్టి కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు బావడ్లపల్లి బాలరాజు. జిల్లా నాయకులుబత్తుల లక్ష్మయ్య గౌడ్, కునూరు మల్లేశం, రామన్నపేట మండల కార్యదర్శి

పులిబిక్షం. చౌటుప్పల్ మండల అధ్యక్షులు మారగొని అశోక్ గౌడ్, మండల నాయకులు మాల్లేగోని లక్ష్మయ్య, పల్సంఅంజయ్య గౌడ, మారగోని పెద్దులు గౌడ్, పల్లె సత్యం పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, 21 ఫిబ్రవరి, వెలుతురు :
కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఒక వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. జహీరాబాద్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పాలెం ప్రశాంత్, గ్రామస్తుల కథనం ప్రకారం మొగుడంపల్లి గ్రామానికి చెందిన పి.రాజు (26)తండ్రి పోచప్ప కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల తర్వాత భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో రాజు మనస్తాపానికి గురై బుధవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బావిలో నుండి మృతదేహం ను బయటకు తీశారు. పోస్ట్ మార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆరుగ్యారెంటీలపై స్పష్టత ఇవ్వండి

నిధులు ఎలా సమకూరుస్తారో ప్రజలకు చెప్పండి

ఆర్టీసీ బస్సులో ఫ్రీ జర్నీతో జీవితాలు మారవు

మహాలక్ష్మి కింద 2500 ఎప్పుడు ఇస్తారు

బిఆర్ఎస్ ఓడినా పెద్దగా నష్టం లేదు

బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్,ఫిబ్రవరి21(వెలుతురు): ఆరుగ్యారెంటీలను ఎలా అమలు చేస్తారో..వాటికి నిధులు ఎలా సమకూరుస్తారో చెప్పాలని కేంద్రమంత్రి, బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ వద్ద ప్రణాళిక లేదన్నారు. ఈసందర్భంగా తెలంగాణ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు రావని చెప్పారు. ఆరు గ్యారెంటీలు ఎప్పటి నుంచి అమలులోకి తీసుకొస్తారని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ. 2500 ఎప్పటి నుంచి ఇస్తారన్నారు. ఆరు గ్యారెంటీలు అయ్యేది కాదు.. పోయేది కాదని ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారో ప్రజలకు చెప్పారా?.. ఆరు గ్యారెంటీలను ఎప్పటి నుంచి.. ఏరకంగా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే బిఆర్ఎస్, కాంగ్రెస్ ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఛార్జిషీట్ ప్రకటించింది. ఛార్జిషీట్ల ఆధారంగా కేసులు ఎందుకు నమోదు చేయలేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఛార్జిషీట్ నిజమైతే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చర్యలు ఎందులు లేవని ఆయన ఆడిగారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకటే.. రెండు కుటుంబ పార్టీలేనని కిషన్ రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ తో పోటీ పడాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ కు ఈ ఎన్నికల్లో పోటీకి ఎలాంటి అజెండా లేదని చెప్పారు. బిఆర్ఎస్ ఒక్క సీటు రాకున్నా జనానికి వచ్చే నష్టం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ లో అన్ని ఎంపి సీట్లు గెలుస్తున్నామని ఆయన వెల్లడిచారు. కర్నాటకలో 25 సీట్లు బిజెపి గెలవబోతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ 3-4 సీట్లు గెలిచినా రాష్ట్రానికి ప్రయోజనం ఉండదని చెప్పారు. మోడీని మరోసారి ప్రధాని కాకుండా ఎవరూ ఆపలేరని కిషన్ రెడ్డి జోస్య చెప్పారు.

తెలంగాణలో అత్యధిక సీట్లు బిజెపి గెలవకుండా ఏ శక్తి అడ్డుకోలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. అలవికాని హామీలిచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. సోనియా కుటుంబానికి సేవ తప్ప.. హామీల అమలుపై కాంగ్రెస్ కు దృష్టి లేదని చెప్పారు. హామీలు నెరవేర్చడానికి ఆర్థిక వనరులు ఎలా సమకూర్చు కుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణకు సంబంధించినవి కావు.. దేశానికి సంబంధించిన ఎన్నికలని అన్నారు. ప్రజలంతా నరేంద్రమోదీని ఆశీర్వదించాలని కోరారు. మన పిల్లల కోసం, దేశం కోసం, దేశ భవిష్యత్తు కోసం మోదీని ఎన్నుకోవాలని సూచించారు. 2013లో తెలంగాణ సాధన కోసం ఇక్కడ నుంచే ప్రారంభించిన పోరు యాత్ర తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించింది. అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణలో కూడా మార్పు రావడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్ర చేస్తున్నామన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటున్నారని తెలిపారు. తొమ్మిదేళ్లు కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటే.. ఇప్పుడు రాహుల్ గాంధీ తెలంగాణను దోచుకొని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఖర్చు పెట్టడానికి వాడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ట్యాక్స్ కడుతుందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదలకు 4 కోట్ల ఇండ్లు కట్టించిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటే అవినీతి, కుంభకోణాలే ఉంటాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్? రెడ్డి విమర్శించారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా నరేంద్ర మోదీ దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో మోదీ ప్రభుత్వం అణచివేసిందన్నారు. పేద ప్రజల కష్టాల తీర్చడానికి నరేంద్ర మోదీ పని చేస్తున్నారని చెప్పారు. దేశంలో కరెంటు కోతలు, ఎరువుల కోరతలు లేవని కిషన్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అలివి కాని హామీలతో అధికారంలోకి వచ్చిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. తాను ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి కరెంటు బిల్లులు కట్టొద్దన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు అతీగతీ లేదని విమర్శించారు.

తాను రాగానే రైతులకు రుణమాఫీ, ఎకరానికి రూ.15,000, మహిళలకు రూ.2500 ఇస్తా అని చెప్పారు. మహాలక్ష్మి లేదు.. మహారాజు లేదు.. వాళ్లు మాత్రం కుర్చీలో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ, అవినీతి, ప్రజలను మోసం చేసే పార్టీలని ఆరోపించారు.

ప్రభుత్వాన్ని పడగొడతారా...
టచ్ చేసి చూడండి తెలుస్తుంది

భువనగిరికి 200 కోట్లు ఇవ్వలేని అసమర్థుడు

గడ్కరీని కలసి ఆర్ఆర్ఆర్‌కు నిధులు అడిగాం

రాష్ట్రం కోసం ప్రధాని మోడీని కూడా కలుస్తాం

కిషన్‌రెడ్డికి కోమటిరెడ్డి సవాల్

హైదరాబాద్,ఫిబ్రవరి21(వెలుతురు): ప్రభుత్వాన్ని పడగొడ్తమన్నట్టుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్ అయ్యారు. టచ్ చేసి చూడు..



నామరూపాల్లేకుండా చేస్తామన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భువనగిరి ఖిల్లా మీద రోప్ వేసుకుందామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని రూ. 200 కోట్లు అడిగితే కనీసం స్పందించలేదన్నారు. నాలుగేండ్ల నుంచి ఫైల్ దగ్గర పెట్టుకొని సొంత రాష్ట్రానికి కనీసం రూ. 200 కోట్లు తేలేని మంత్రి కిషన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కేబినెట్ లో ఉంటూ కనీసం రూ. 200 కోట్ల నిధులు ఇవ్వలేక పోయారని, తాము వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ. 3 వేల కోట్ల పనులు తెచ్చుకున్నామన్నారు. అభివృద్ధి పనుల కోసం అవసరమైతే ప్రధాన మంత్రిని కూడా కలుస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెప్పి అధికారంలోకి రాలేదని అన్నారు. రెండు మూడు రోజుల్లో మరో రెండు హామీలను అమలు చేయబోతున్నామని చెప్పారు. ఎన్నికలకు ముందు మోదీ మాట్లాడిన స్పీచ్ ఆడియోలు తన వద్ద ఉన్నాయని, 20 కోట్ల ఉద్యోగాలిస్తానన్న ప్రధాని ఇచ్చారా.. అని ప్రశ్నించారు. బ్లాక్ మనీ తెస్తానన్నప్రధాని తెచ్చారా..ఓ వైపు ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. రూ. 500 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ. 1200 చేరిందని అన్నారు. నమామి గంగాకు కేంద్రం రూ. 4 వేల కోట్లు ఖర్చు చేసిందని, హైదరాబాద్ లోని మూసీకి నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేసుల నుంచి తప్పించుకునేందుకే బీఆర్ఎస్, బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకుందని విమర్శించారు. అందులో భాగంగానే కేసీఆర్ ఢిల్లీ వెళుతున్నారని అన్నారు. శత్రువైన మోదీ దగ్గరికి కేసీఆర్ వెళ్లిన కేటీఆర్ ను ఆశీర్వదించండి అని అడిగారంటే ఇద్దరి మధ్య దోస్తానా కుదిరినట్టేనన్నారు. తమ ఢిల్లీ పర్యటన విజయవంతం అయిందని... తెలంగాణ రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు నిధులు కేటాయిస్తానని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు రోడ్ల భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్ పూర్తి అయితే హైదరాబాద్‌తో పాటు తెలంగాణ 50 శాతం కవర్ అవుతుందని.. హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయిని అన్నారు. రైల్వే ప్రాజెక్టుకు కూడా హామీ ఇచ్చారని.. ఇక పనులు మొదలవుతాయని తెలిపారు. నల్గొండ రింగ్ రోడ్డుకు రూ.700కోట్లు ఇస్తామని అన్నారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు మోడీని ఇక్కడ తిడతారు అక్కడ కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భువనగిరి అభివృద్ధికి నిధులు ఇవ్వమంటే ఇవ్వలేదని.. కిషన్ రెడ్డి తెలంగాణకు నిధులు తేలేని అసమర్థుడని వ్యాఖ్యలు చేశారు. కిషన్ రెడ్డి తమ ప్రభుత్వాన్ని కూలగొడతాం అంటున్నారని.. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే అప్పుడు తామేంటో చూపిస్తామని హెచ్చరించారు. వచ్చే ఐదేళ్లలో తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ అపాయింట్ మెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగారని.. త్వరలో మోడీని కలుస్తామని చెప్పారు. సీఆర్ఎఫ్ కింద ప్రపోజల్ పంపామని.. రూ.800 కోట్లు విడుదల అవుతున్నాయని తెలిపారు.

అవసరం లేకున్నా పంజాబ్, హర్యానాలో డబ్బులు ఖర్చు పెట్టి దుబారా చేశారని మండిపడ్డారు. కేఆర్ఎంబీ అంటే ఏంటిదో బీఆర్ఎస్ వాళ్లకు తెలియదన్నారు. కేఆర్ఎంబీకి రూ.200 కోట్లు, జీఆర్ఎంబీకి రూ.200కోట్లు మెయింటెనెన్స్‌కు ఇస్తామని చెప్పారన్నారు. నీళ్ల విషయంలో నల్లగొండను మోసం చేసినందుకు 11 చోట్ల ప్రజలు ఓడగొట్టారన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఒక్క సీటు గెలవదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

ధరణి పోర్టల్ స్థానంలో త్వరలోనే కొత్త పోర్టల్

త్వరలో ఫ్రీ కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్

గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలను త్వరలో ప్రారంభిస్తాం

ఆటో డ్రైవర్లకు రూ. 12 వేలు ఇస్తాం

ప్రభుత్వ భూములను కాజేసిన వారిపై కఠిన చర్యలు

మంత్రి శ్రీధర్ బాబు కీలక విషయాలు వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి21(వెలుతురు): ధరణి పోర్టల్ స్థానంలో త్వరలోనే కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫేక్ డాక్యూమెంట్స్‌తో ప్రభుత్వ భూములను కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడే వారి నుంచి ఛార్జీలు వసూలు చేయబోమని తెలిపారు.

గ్యాస్ సిలిండర్లపై రూ.500 రాయితీ ఇస్తామన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని 17 స్థానాలకు గానూ 17 సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పామని, అందులో భాగంగా ఇప్పటికే రెండు అమలు చేశామన్నారు. త్వరలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలు చేస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్ల కు రూ. 12 వేలు ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చినవి ఎన్ని అమలు చేసిందో చెప్పాలన్నారు మంత్రి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామన్నారు. అభివృద్ధి కాంక్షించి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడే వారిని పార్టీ లోకి ఆహ్వానిస్తుమని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో
ఫ్రీ మెడికల్ హెల్త్ క్యాంప్

హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 21:
బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని మెల్కోటే పార్క్ లో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డ ఫ్రీ మెడికల్ హెల్త్ క్యాంప్ ని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్ ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంప్ లో వివిధ టెస్టులను చేసి మరియు వారికి సంబంధించిన రిపోర్ట్‌ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మెల్కుట్టి పార్క్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణ్ రావు మరియు చాలామంది వాకర్స్ పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల కోలాహలం

జంపన్నవాగులో పుణ్యస్నానాలు

ములుగు,ఫిబ్రవరి21(వెలుతురు): మేడారం జాతరకు వచ్చిన భక్తులతో జంపన్నవాగు జన సంద్రమైంది. మేడారం వన దేవతల దర్శనానికి వచ్చిన భక్తులు మొదట జంపన్నవాగు వద్దకు చేరుకుని అక్కడ పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులతో జంపన్నవాగు ఇరువైపులా కిక్కిరిసిపోయింది. పుష్కలంగా నీరు ఉండడంతో కొంతమంది భక్తులు జంపన్నవాగులో, మరి కొంతమంది భక్తులు జంపన్న వాగు వద్ద ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ వద్ద స్నానాలు చేశారు. ఇసుక వేస్తే రాలనంత భక్త జనంతో జంపన్నవాగు ప్రాంతం సందడిగా మారింది. పుణ్యస్నానాలు ఆచరించిన వారు గ్దదెల వద్దకు చేరుకునేందుకు కూడా బాగా సమయం పడుతోంది. క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. గంటల తరబడి క్యూలైన్లో నిలుచోవాల్సి వస్తోందని భక్తులు తెలిపారు. మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ మహా జాతర దృష్ట్యా ములుగు, భద్రాది కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో ఇసుక విక్రయాలను నిలిపివేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ తెలిపింది.

కేరళలో ప్రతాపం చూపుతున్న భానుడు

6 జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించిన ఐఎండీ

కేరళ,ఫిబ్రవరి21(వెలుతురు): కేరళ హీటెక్కింది. సమ్మర్ ప్రభావం అప్పుడే మొదలైంది. ఫిబ్రవరిలోనే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. కేరళలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఎండలు దంచికొడుతున్నాయి. ఆరు జిల్లాలకు వార్నింగ్ వాతావరణశాఖ వార్నింగ్ ఇచ్చింది. ఎర్నాకుళం, త్రిసూర్, కన్నూరు, అలప్పుజా, కొట్టాయం, కోజికోడ్

జిల్లాలకు వాతావరణశాఖ అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉష్ణోగ్రతలు అధిక స్థాయిలో నమోదవుతున్నాయి. వాతావరణశాఖ హెచ్చరిక ప్రకారం ఎర్నాకుళం, త్రిసూర్, కన్నూరు జిల్లాల్లో అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. అలప్పుజా, కొట్టాయం, కోజికోడ్ జిల్లాల్లో 36 డిగ్రీలు నమోదైనట్టు ఐఎండీ తెలిపింది. సాధారణ స్థాయి కన్నా.. సుమారు 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు ఆ జిల్లాల్లో నమోదు కానున్నట్లు ఐఎండీ తన అలర్ట్‌లో పేర్కొంది. నిజానికి మార్చి నుంచి జూన్ మధ్య కాలంలో కేరళలో అధిక ఉష్ణోగ్రతలే ఉంటాయి. కానీ ఈసారి ఫిబ్రవరిలోనే వెదర్ వేడెక్కినట్లు తెలుస్తోంది. వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు తగిన చర్యలు తీసుకోవాలని కేరళ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ పేర్కొంది.

కాంగ్రెస్ ప్రభుత్వ అమలుకాని హామీలు

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ లకు ప్రజలు బుద్ధి చెబుతారు

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ,ఫిబ్రవరి21(వెలుతురు): కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీలను అమలు పరచలేక బీఆర్ఎస్ పార్టీ పై ఎదురుదాడి చేస్తోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. బుధవారం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను గమనిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి మహిళలను, రైతులను, యువకులను మోసం చేసింది. బీజేపీ నాయకులు చవటలు, దద్దమ్మల్లా



మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు దక్కని బీజేపీ పార్టీతో మాకు పొత్తు ఏంటని ప్రశ్నించారు ఎమ్మెల్యే కడియం శ్రీహరి. చిన్న చిన్న పార్టీలను కలుపుకొని పొత్తు పెట్టుకునే దౌర్భాగ్యస్థితి బీజేపీదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారు. మతాల మధ్య కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే పార్టీ బీజేపీ అని అన్నారు. సెక్యులర్ పార్టీ అయిన బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీతో ఎలాంటి పొత్తు పెట్టుకోదన్నారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ హక్కుల కోసం, గోదావరి జలాల కోసం పోరాటం చేసే పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై ధ్యాస లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ మధ్యే పోటీ ఉంటుందన్నారు. బీజేపీ వారిని హెచ్చరిస్తున్నాం.. మాటలు జాగ్రత్తగా మాట్లాడకపోతే ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు ఎమ్మెల్యే కడియం శ్రీహరి.

స్కిన్‌తో చికెన్ తింటే ఆరోగ్యానికి మంచిదేనా?

మీరు చికెన్ షాప్‌కి వెళ్లినప్పుడు కచ్చితంగా స్కిన్ లెస్ చికెన్ ఇవ్వమని అడుగుతారు. దుకాణాదారుడు కూడా మీకు ఏది కావాలని ప్రశ్నిస్తాడు. అంటే స్కిన్ ఉంచాలా? వద్దా అని ప్రశ్న వేస్తాడు. వందలో 90 మంది స్కిన్ లెస్ చికెన్ కావాలనే అడుగుతారు. ఆ తర్వాత కేవలం చర్మంతో మాంసం మాత్రమే ఇస్తాడు. చర్మం వద్దనుకునే వారు అందులో కొవ్వు, కొలెస్ట్రాల్, గుండెకు మంచిది కాదంటూ కారణాలు చెబుతారు.

కానీ పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, కోడి చర్మం ఆరోగ్యానికి మంచిది. కానీ దాని పరిమాణం మితంగా ఉండాలి. అంటే తక్కువ మొత్తంలో తినాలి. అంటే మాంసంతో పాటు కొంచెం తోలు ఉంటే టేస్టీగా, హెల్తీగా ఉంటుందన్నమాట. మనందరం అనుకునే విధంగా చికెన్ స్కిన్ అంత చెడ్డది కాదు. దీని గురించి కచ్చితంగా తెలుసుకుందాం..

చికెన్ చర్మంతో తినవచ్చు

కొవ్వు విషయానికి వస్తే, ఒక ఔన్స్ చికెన్ చర్మంలో కేవలం ఎనిమిది గ్రాముల అసంతృప్త కొవ్వు, మూడు గ్రాముల సంతృప్త కొవ్వు ఉంటుంది. చర్మాన్ని పరీక్షించిన నిపుణులు అందులో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వు (లేదా ఒలీక్ యాసిడ్) ఉన్నట్లు గుర్తించారు. ఈ యాసిడ్ యొక్క ప్రయోజనాల్లో ఒకటి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. అంటే మనం ఇప్పటివరకు భయపడినట్లుగా ఇది కార్డియాక్ అరెస్ట్ ప్రమాదాన్ని పెంచదు. దానిని తగ్గిస్తుంది. ఇది శరీరంలోని హార్మోన్ల పరిమాణాన్ని కూడా నియంత్రిస్తుంది.

స్కిన్ లెస్ అయితే నూనె ఎక్కువగా కావాలి

చికెన్ తినేవాళ్లు క్యాలరీల గురించి చాలా ఆందోళన చెందుతారు. కానీ చికెన్ స్కిన్ లేని మాంసంలో కేలరీలలో తేడా ఎక్కువగా లేదు. చర్మంపై ఉన్న మాంసంలో కొన్ని కేలరీలు మాత్రమే ఎక్కువగా ఉంటాయి. చర్మంతో మాంసం తక్కువ నూనెను గ్రహిస్తుంది. చర్మం లేని మాంసం ఎక్కువ నూనెను తీసుకుంటుంది. చికెన్ వండేప్పుడు స్కిన్ లెస్ అయితే నూనె ఎక్కువగా కావాలి. వంట సమయంలో ఎక్కువ నూనె వేయాలి. కానీ మీరు చర్మంతో ఎక్కువ మాంసం తినగలరా? తినలేరని చెప్పాలి. చర్మం ఉంటే చూసేందుకు, తినేందుకు బాగా అనిపించదు. ఎందుకంటే చర్మం పరిమాణం పెరిగితే, అది శరీరంలో మంటను కలిగిస్తుంది. అందుకే చికెన్ తెచ్చుకునేప్పుడు మితమైన చర్మం కలిగి ఉండటం చాలా ముఖ్యం. మీరు చర్మంతో చికెన్ మాంసం తింటే చాలా తినాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మీరు తక్కువ మొత్తంతో సంతృప్తి చెందవచ్చు. కానీ చర్మం లేని మాంసాహారం తింటే ఎంత తిన్నా తృప్తి కలగదు. మరింత ఎక్కువగా తినాలనే ఉత్సాహం వస్తుంది. మీరు మాంసం ఫ్రై చేయాలని చూస్తే.. చర్మం క్రిస్పీగా మారే వరకు వేయించవద్దు. ఎందుకంటే నల్లటి చర్మం దానిలోని అన్ని మంచి లక్షణాలను కోల్పోయేలా చేస్తుంది. నలుపులో కొంత భాగం ఆరోగ్యానికి హాని కలిగించే కార్బన్‌గా మారుతుంది.

చికెన్ రోజూ తినవచ్చా?

అయితే మరో ముఖ్య విషయం ఏంటంటే.. ప్రతిరోజూ చికెన్ తినడం వల్ల శరీరంలో ప్రోటీన్ అధికంగా పేరుకుపోతుంది. దీనిని తగ్గించాలి. వారంలో ఒక్కసారి తింటే సరిపోతుంది. అలాగే ఎక్కువగా తింటే ఎముకల సమస్యలు కూడా వస్తాయి. చికెన్‌లో ఒక రసాయనం ఉంటుంది, ఇది పెద్దప్రేగు క్యాన్సర్‌కు కారణమవుతుంది. ప్రతిరోజూ చికెన్ తినకూడదు.

చికెన్‌లో కొవ్వు ఎక్కువగా ఉంటుంది. చికెన్‌ని తరచుగా తీసుకోవడం వల్ల మీ గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. చికెన్ తినడం వల్ల శరీరంలో అధికంగా వేడి చేరుతుంది. ప్రతిరోజూ తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇది అనేక అనారోగ్యాలకు కారణం అవుతుంది. చికెన్‌లో కొవ్వు, కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజూ తింటే బరువు పెరిగే అవకాశం ఉంది. చికెన్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది పోషకాలతో నిండిన ఆహారం. అయితే అధికంగా తినడం మాత్రం ప్రమాదం. ప్రతిరోజూ చికెన్ తినాలనుకుంటే రోజుకు 50 గ్రాములకు మించి తినకపోవడమే మంచిది. అందుకే చికెన్ ఎక్కువగా తినకూడదు.

కారం తింటే గుండె పోటు...

తగ్గుతుందా ?..

నిపుణులు ఏం చెబుతున్నారంటే..

పచ్చి మిరపకాయలను ఆహారంలో ఉపయోగించకపోతే అస్సలు రుచిగా ఉండదు. భారతీయ వంటలలో దాదాపుగా ప్రతి వంటకానికి పచ్చి మిరపకాయలు వాడాల్సిందే. కొంతమంది పచ్చి మిరపకాయలు ఎక్కువగా తినడానికి ఇష్టపడతారు. మరికొందరు తక్కువ కారంగా తినడానికి ఇష్టపడతారు. అయితే రుచిని పెంచే ఈ మిరపకాయ మీ గుండెకు చాలా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పచ్చి మిరపకాయలు తినడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. పచ్చిమిర్చి తినడం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని కార్డియాలజీ సీనియర్ కన్సల్టెంట్ తెలిపారు. మరి ఆ వివరాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. బరువు తగ్గడం మొదలుకుని అనేక అనారోగ్య సమస్యలకు మిర్చి చెక్ పెడుతుందని నిపుణులు చెబుతున్నారు. మిరపకాయలో ఉండే క్యాప్సైసిన్ కారంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. మిర్చిపై ఇటీవలి పరిశోధనలు చేసిన తర్వాత మిరపకాయ గుండెపోటు లేదా స్ట్రోక్‌తో మరణించే అవకాశాలను తగ్గిస్తుందని వెల్లడైందని నిపుణులు చెబుతున్నారు.

పరిశోధనలో ఏం తేలింది..

వారంలో కనీసం నాలుగు సార్లు మిరపకాయ తింటే గుండె సంబంధిత వ్యాధితో మరణించే అవకాశాలు 44 శాతం తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే స్ట్రోక్ నుండి మరణించే అవకాశాలు 61 శాతం తగ్గుతాయని చెబుతున్నారు. ఇటువంటి అధ్యయనాలు కేవలం పరిశీలనాత్మకమైనవని తెలుసుకోవడం ముఖ్యం అని వైద్యనిపుణులు చెబుతున్నారు.

రోగనిరోధక శక్తి బూస్టర్

తాజా, ఎండు మిర్చిలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుందని చెబుతున్నారు వైద్యనిపుణులు.

మీ పిల్లలు అతిగా టీ,కాఫీ తాగుతున్నారా..

డేంజర్‌లో పడ్డట్లే!

ఉదయం లేవగానే అందరికీ గుర్తు వచ్చేది టీ. తెల్లవారుజాము కాగానే, చాలా మంది టీ తాగడానికి ఇష్టపడుతారు. ఇక కొంత మందికి టీ తాగనిదే ఆ రోజే గడవనట్లు అనిపిస్తుంది. ఇక టీ ఆరోగ్యానికి మంచిదే అయినా అతిగా తాగడం ఆరోగ్యానికి హానికరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అయితే కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు అతిగా టీ తాగడం అలవాటు చేస్తుంటారు. ఉదయం గ్లాస్ టీ, అలాగే మధ్యలో కూడా టీ లేదా కాఫీ బిస్కెట్స్ ఇస్తూ పిల్లలను అనారోగ్యం బారిన పడేలా చేస్తుంటారు. వైద్యుల ప్రకారం,14 సంవత్సరాలకంటే తక్కువ వయసున్న పిల్లలకు టీ లేదా కాఫీ ఇవ్వడం వలన ఇది వారి పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందంట. అలాగే టీ అనేది పిల్లల దంతాలు, ఎముకలను బలహీనపరుస్తాయి. అంతే కాకుండా టీ, కాఫీలో ఉండే కెఫిన్ మెదడును ఉత్తేజపరుస్తుంది. హృదయ స్పందన రేటును పెంచుతుంది. అదనంగా, కాఫీ తీసుకోవడం కూడా పిల్లల నిద్రకు భంగం కలిగిస్తుంది. ఫలితంగా, దాని ప్రభావంతో పిల్లల ఎదుగుదల కూడా దెబ్బతింటుంది. అందువలన తల్లిదండ్రులు పిల్లలకు టీ, కాఫీలు అస్సలే అలవాటు చేయకూడదు అంటున్నారు వైద్యులు.

ఉదయం టీకి బదులుగా కలబంద జ్యూస్ తాగితే.. ప్రయోజనాలెన్నో..

కలబంద ఆరోగ్యాల గని అంటారు. దీని వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.ముఖ్యంగా ఉదయాన్నే పరగడుపున కలబంద రసం తాగడం ఆరోగ్యానికి చాలా మంచిదంట. కానీ చాలా మంది ఉదయం లేవగానే టీ లేదా కాఫీ తాగుతుంటారు. కానీ వాటికి బదులుగా కలబంద రసం తాగడం శ్రేయస్కరం. కలబందలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అందువలన ఇది ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. రోజూ ఉదయం పరగడుపున అలోవెరా జ్యూస్ తాగడం వలన అది కొలెస్ట్రాలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే దీని వలన చర్మం నిగ నిగ మెరవడమే కాకుండా,చురుకుదనం, జీర్ణశక్తిని పెంచడం, రక్తంలో చక్కెరను నియంత్రించడం వంటివి చేస్తుంది. అదే విధంగా కలబందలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ పాలీఫెనాల్స్ శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను తగ్గిస్తుంది. అంతే కాకుండ సమ్మర్‌లో చాలా మంది డీ హైడ్రేషన్ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు రోజూ ఉదయం అలోవెర జ్యూస్ తాగడం లేదా, జెల్ పీసెస్‌లో కాస్త చక్కెర వేసుకొని తినడం వలన శరీరం హైడ్రేట్‌గా ఉంటుంది. శరీరంలోని వేడిని తగ్గించడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది.

మార్చిలో బ్యాంక్ సెలవులు

ఇవే - చూసారా..

2024 ఫిబ్రవరి ముగియడానికి మరి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నెలతో పోలిస్తే వచ్చే నెలలో (మార్చి) బ్యాంకులకు సెలవులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి నెలలో ఏకంగా 14 రోజులు బ్యాంకులు మూత పడనున్నట్లు తెలుస్తోంది. ఈ సెలవులు కాకుండా మార్చి 9, 23 రెండవ, నాలుగవ శనివారాలు.. 3, 10, 17, 24, 31 ఆదివారం సెలవులు ఉన్నాయి. ఇవన్నీ కలిపి మొత్తం 14 సెలవులు ఉన్నాయి. కాబట్టి బ్యాంకులు పనిచేయవు. బ్యాంకులకు వెళ్లి చేసుకోవాల్సిన ఏదైనా అత్యవసరమైన పని చేసుకోవాలనుకునే వారు బ్యాంక్ హాలిడేస్ గమనించి ముందుగానే పనులు పూర్తి చేసుకోవాలి. అయితే ఆన్‌లైన్ సేవలు అన్నీ అందుబాటులో ఉంటాయి.

స్వల్ప లాభాల్లో

దేశీయ స్టాక్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30గంటల సమయంలో సెన్సెక్స్ 76 పాయింట్ల స్వల్ప లాభంతో 73134 వద్ద నిఫ్టీ 21 పాయింట్ల స్వల్ప లాభంతో 22218 వద్ద ట్రేడింగ్ ను కొనసాగిస్తుంది. టాటా స్టీల్, హిందాల్కో, ఐసీఐసీఐ బ్యాంక్, ఎం అండ్ ఎం, ఎథేర్ మోటార్స్,గ్రాసిమ్,ఓఎన్జీసీ,బజాజ్ ఫిన్ సర్వ్, అదానీ ఎంటర్ ప్రైజెస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, టాటా మోటార్స్, ఆల్ట్రా టెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, ఐటీసీ షేర్లు లాభాల్లో కొనసాగుతుండగా.. హీరో మోటోకార్ప్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఇన్ఫోసిస్, బీపీసీఎల్, లార్సెన్, బజాజ్ ఆటో, హెచ్ సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. మార్కెట్ గురించి సాక్షి వెబ్ సైట్లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్రమే తప్ప.. వారు పెట్టే పెట్టుబడులకు సాక్షి మీడియా గ్రూపు ఎలాంటి హామీ ఇవ్వదు.)

ఈపీఎఫ్ఓ, పీఎంఓ డేటా లీకేజీ కలకలం?.. అప్రమత్తమైన కేంద్రం

———దేశంలో డేటా లీకేజీ కలకలం రేపుతోంది. ప్రధాని కార్యాలయం (పీఎంఓ), ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ)ల డేటాబేస్ నుంచి డేటా లీకైనట్లు తెలుస్తోంది. ఈ డేటా లీకేజీపై స్పష్టత ఇవ్వాలని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా (CERT-In) కేంద్రం ఆదేశాలు జారీ చేసినట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. డేటా లీకేజీపై సమాచారం ఉంది. కానీ వాస్తవమా? కాదా? అని తెలుసుకునేందుకు రివ్యూ జరుపుతున్నాం. సీఈఆర్టీ.ఇన్ ఇచ్చే రిపోర్ట్ కోసం ఎదురు చూస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డేటా లీకేజీ అంటూ వస్తున్న నివేదికలను పరిశీలిస్తున్నట్లు కేంద్రానికి చెందిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు తెలిపారు. 'డేటా లీకేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. అయితే, సైబర్ నేరస్తులు ఒక సర్వర్ ను యాక్సిస్ చేసినట్లు కొన్ని వాదనలు వినిపిస్తున్నాయని, అందుకు తగ్గ ఆధారాలు లేవు' అని స్పష్టం చేశారు. గ్లోబల్ సాఫ్ట్‌వేర్, కోడ్ రిపోజిటరీ గిత్ హబ్‌లో చైనీస్ సైబర్ ఏజెన్సీలకు చెందిన కొన్ని పత్రాలు లీక్ అయ్యాయని, ఈ డాక్యుమెంట్‌లలో ఈపీఎఫ్ఓ, ఇండియన్ పీఎంఓ, ఇతర పబ్లిక్ నుండి డేటా ఉందని సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ ఎక్స్ లో పలు పోస్ట్ లు వెలుగులోకి వచ్చాయి. అయితే, ఈ డేటా లీకేజీ అంశంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

భారత్ లక్ష్యంగా

గత ఏడాది నవంబర్ లో విడుదల చేసిన నివేదిక ప్రకారం..ఇటీవల కాలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, తాజ్ హోటల్స్, ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్ వంటి సంస్థలపై సైబర్ దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయి. దీంతో పాటు ఐటీ, బిజినెస్ ఔట్ సోర్సింగ్ సంస్థలతో సహా పలు సర్వీసులు అందించే సంస్థలపై అత్యధికంగా సైబర్ దాడులు జరిగినట్లు నివేదికలు హైలెట్ చేశాయి. సింగపూర్ కు చెందిన సైబర్ ఫిర్మా 2023 నివేదిక సైతం ప్రపంచ వ్యాప్తంగా జరిగే సైబర్ దాడులు భారత్ ను లక్ష్యంగా చేసుకుని 13.7శాతం ఉందని, ఆ తర్వాత అమెరికా, ఇండో నేషియా,చైనా దేశాలు ఉన్నట్లు తేలింది.

వాట్సాప్‌లో కీలక మార్పు..

ఇక ఆ పని చేయడానికి నో ఛాన్స్

వినియోగదారుల వ్యక్తిగత భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫేమస్ మెసేజింగ్ యాప్ 'వాట్సాప్' (%ఔఫ్ఖ్రాజూజూ%) ఓ కీలకమైన మార్పుకు సిద్ధమైంది. వినియోగదారు అనుమతి లేకుండా వ్యక్తిగత ఫోటోలను స్క్రీన్ షాట్ తీసుకోవడాన్ని నిరోధించడానికి వాట్సాప్ ప్రయత్నిస్తోంది. గుర్తు తెలియని వ్యక్తుల కాల్ బ్లాకింగ్, చాట్‌లాక్ వంటి ఫీచర్స్ మాదిరిగానే డిస్‌ప్లే పిక్చర్ లాక్ అనే ఫీచర్ కూడా త్వరలోనే రానున్నట్లు సమాచారం. ఇది మనకు తెలియని వ్యక్తులు మన వాట్సాప్ ప్రొఫైల్ ఫోటోను స్క్రీన్ షాట్ తీసుకోకుండా నిరోధిస్తుంది. ఇది ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనే విషయాలు వెల్లడి కాలేదు. రాబోయే రోజుల్లో మనకు నచ్చిన వాళ్లకు మాత్రమే ఫోటో కనిపించేలా సెట్ చేసుకోవచ్చు. ఈ ఫీచర్ వల్ల మనకు నచ్చని వారికి ఫోటో కూడా కనిపించకుండా చేయొచ్చని తెలుస్తోంది. కాబట్టి మనకు నచ్చని వారు మన ఫోటోను స్క్రీన్ షాట్ తీసుకోలేరు. డీప్ ఫేక్‌లు చెలరేగుతున్న సమయంలో కంపెనీ తీసుకువస్తున్న ఈ ఫీచర్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

అక్కడ పెళ్ళి చేసుద్దాం... కలిసివెళ్ళి



ప్రియాంకా చోప్రా – నిక్‌జోన్స్, దీపికా పదుకొనే – రణ్‌వీర్‌సింగ్, ఇషా అంబానీ – ఆకాశ్.... ఇలా ప్రముఖులందరూ డెస్టినేషన్ వెడ్డింగ్ బాట పట్టారు. ఖర్చు పెట్టే సామర్థ్యం ఉన్నవాళ్లందరూ గోవా, జోధ్‌పూర్, ఉదయపూర్, ఇటలీలోని లేక్ కోమో లాంటి రకరకాల చోట్లకు క్యూ కడుతున్నారు. కొత్తగా ఆలోచిస్తే, మీ డెస్టినేషన్ వెడ్డినేషన్‌ను మరింత విభిన్నంగా ప్లాన్ చేసుకోవచ్చు. అలాంటి హార్ట్‌బీట్ పెంచే ఆఫ్‌బీట్ వెడ్డింగ్ డెస్టినేషన్స్‌లో కొన్నిటి గురించి....

ఆ ద్రాక్షతోటల్లో...

ఆ ఇద్దరూ కాబోయే దంపతులు. చుట్టూ ఎంతో మంది అతిథులు. సరిగ్గా సూర్యాస్తమయం అవుతోంది. ఆ అరుణ కిరణాలు వారి మీద పడుతున్నాయి. ఈ క్షణం కోసమే వారందరూ ఎదురుచూస్తున్నారు. అప్పుడే ఒకటయ్యారు. అప్పటి నుంచి ఫోటోలు క్లిక్‌మంటూనే ఉన్నాయి. జీవితంలోని ఈ అపురూప ఘట్టానికి ఇంతకుమించిన అందాల వేదిక ఎక్కడ ఉంటుంది? చాలా మంది ఇటలీలోని వైన్‌యార్డులను ఎంచుకుంటారు. అయితే ఎక్కడో విదేశాల దాకా వెళ్లక్కర్లేదు. మహారాష్ట్రలోని నాసిక్‌లోని వైన్‌యార్డ్స్ ఇప్పుడు ఆఫ్‌బీట్ డెస్టినేషన్‌గా ఖ్యాతి చెందాయి. సకల వసతి సౌకర్యాలు ఉంటాయి. వినోదానికి ఏ మాత్రం ఢోకా ఉండదు.

ఎలా వెళ్లాలి: ముంబయి నుంచి 171 కి.మీ. అక్కడ నుంచి అయిదు గంటల ప్రయాణం.

ఖర్చెంత: 500 నుంచి 2000 మంది ఒకేసారి పాల్గొనే అవకాశం ఉంటుంది. మొత్తం రూ. 1,50,000 వసూలు చేస్తారు.

ట్రైబల్ వెడ్డింగ్!

ఈశాన్య రాష్ట్రాల అందాలకు ఫిదా కాని వారు ఎవరు ఉంటారు చెప్పండి! కాస్త సమయం చిక్కితే ఈ ప్రాంతాలకు వెళ్లాలనుకునేవాళ్లు చాలామంది ఉంటారు. కేవలం పర్యాటకానికే కాదు డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కూడా మేఘాలయ రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడే చాలా రిసార్టులు ఈ సౌకర్యం కల్పిస్తున్నాయి. అంతేకాదు ఇక్కడ ట్రైబల్ వెడ్డింగ్ కూడా చేసుకోవచ్చు. ఈ రాష్ట్రంలో కాశీ తెగ వారు అత్యధికంగా ఉంటారు. అక్కడ ఉన్న జైనిటా పర్వతాల మధ్య ఉన్న ఓ చిన్న పల్లెలో ఈ వివాహం చేసుకోవచ్చు. చాలా సింపుల్‌గా ఉంటుంది. వధూవరులిద్దరూ కాశీ తెగవారి దుస్తులు ధరిస్తారు. ఉంగరాలు మార్చుకుంటారు.

ఎలా వెళ్లాలి: మేఘాలయ రాజధాని షిల్లాంగ్ నుంచి డాకి పట్టణం 81 కి.మీ దూరంలో ఉంది.

సింపుల్..'టు స్టేట్స్' టెంపుల్

అమ్మాయి.... దక్షిణాది రాష్ట్రం తమిళనాడులో పుట్టింది. ఇక అబ్బాయి.... స్వస్థలం పంజాబ్.

వీరిద్దరూ కలిసింది ఐఐఎమ్ అహ్మదాబాద్‌లో. ఇద్దరూ ప్రేమలో పడ్డారు. వేర్వేరు నేపథ్యాలు. విభిన్న సంస్కృతులు. నానా తంటాలు పడి పెద్దలను ఒప్పించుకున్నారు. ఇక చివరికి మహాబలిపురం సాగరతీరంలో ఉన్న ప్రఖ్యాత ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఇది చాలా క్రితం వచ్చిన 'టూ స్టేట్స్' అనే సినిమా కథ. ఈ పెళ్లి సన్నివేశం చాలా ఫేమస్ అయింది. అంతే కాదు ఆ తర్వాత ఆ మహాబలిపురం గుడిలో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు డిమాండ్ పెరిగింది. వధూవరులు అక్కడికి దగ్గర్లో ఉన్న రిసార్టులు బుక్ చేసుకొని, ఈ ఆలయంలో వివాహం చేసుకుంటున్నారు.

ఎలా వెళ్లాలి: చెన్నై నుంచి 56 కి.మీ దూరంలో ఉంది.

హిమాలయాల సాక్షిగా.....

అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ పట్టణం ఇప్పుడిప్పుడే పెళ్లి వేడుకలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఎప్పటినుంచో హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా నూతన వధూవరులకు ఇష్టమైన ప్రదేశం ఇది. హిమాలయ పర్వతాల సోయగాలను వీక్షిస్తూ, ఆ ప్రకృతి ఒడిలో కొత్త జీవితానికి స్వాగతం పలకాలనుకునేవారికి ఇది సరైన్ ఛాయిస్. పెళ్లి వేడుకల కోసం ఇక్కడ చాలా రిసార్టులు అందుబాటులో ఉన్నాయి.

ఎలా వెళ్లాలి: కోలకతా నుంచి రోడ్డు, విమానమార్గాల్లో వెళ్లవచ్చు. గౌహతిలోని లోకనాథ్‌ప్రియ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 480 కి.మీ దూరంలో ఉంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెల వరకు ఈ ప్రాంతం పర్యాటకానికి అనువుగా ఉంటుంది.

ఇసుక కొండల్లో... భయం భయంగా!

దుబాయ్ ఆకాశహర్మ్యాలకే కాదు... ఎడారి యాత్రలకు కూడా ప్రసిద్ధమైనదే. 'ఆకాశాన్ని ముద్దాడాలని తహతహలాడుతున్నాయా!' అన్నట్టు ఉన్నాయి దుబాయ్‌లోని భవన సముదాయాలు. చక్కని పరిశుభ్రమైన నగరం దుబాయ్. విశాలమైన రోడ్లు, ఫ్లై ఓవర్‌లతో అలజడి లేని అరేబియన్ సముద్రతీరాన వెలసిన స్వర్గధామం కొత్త దుబాయ్ నగరం. 'వ్వావ్ దుబాయ్' అనిపించింది తొలిచూపులోనే! హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి ప్రయాణం నాలుగు గంటల లోపే!

మామూలు కార్లకు నో ఛాన్స్!

దుబాయ్ నగరానికి సుమారు 40 కి.మీ. దూరంలో గొప్ప ఎడారి ఉంది. ఎడారి అంటే అంతా పెద్ద ఇసుక కొండలు. మన ప్రాంతంలో చాలాచోట్ల రాతి కొండలు కనిపిస్తాయి. కానీ ఇసుక కొండలు దుబాయ్‌కి ప్రత్యేకం. ఈ ఎడారిలో మన మామూలు నాలుగు చక్రాల కార్లు నడవవు. ఎనిమిది చక్రాలుగల లాండ్ క్రూయిజ్ వంటి భారీ వాహనాలను ఈ సఫారీ యాత్రకు ఉపయోగిస్తారు.

మా అందరి కోసం ఓ ఎనిమిది లాండ్ క్రూయిజ్‌లు ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఎడారిలో ప్రయాణమేమో, ఎంతో మధురానుభూతి కలిగిస్తుందనుకున్నాం. తీరా ప్రయాణం మొదలయ్యాక తెలిసింది ఆ పర్యటన ఎంత భయానకమో! ప్రయాణమంతా ఇసుక కొండలు, ఆ పక్కనే వున్న లోయల్లో సుమారు ముప్పై నిమిషాలకు పైగా సాగింది. అక్కడ డ్రైవర్లు చాకచక్యంగా నడపగల సమర్థులే. అయినప్పటికీ ఈ ప్రయాణం సాహసోపేతమైనదనే చెప్పాలి. ఈ యాత్రలో ప్రమాదాలు సర్వసాధారణం అని డ్రైవర్ చెప్పాడు. రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ఏ మాత్రం సురక్షితం కాదన్నాడు. అపురూపమైన ఆ ఎడారిలో ప్రాణాలు అరచేతిలో ఉంచుకొని, భయం భయంగా ఆ టూర్‌ని ఆస్వాదించాం. డిజర్ట్ సఫారీ యువతకు కూడా అంత క్షేమం కాదు. ఆ ప్రాణాంతకమైన యాత్రను ఇప్పుడు తలుచుకుంటే వెన్నులోంచీ చలి పుట్టుకొస్తోంది. దుబాయ్ వెళ్ళి వచ్చిన వారిని 'అక్కడ సఫారీకి వెళ్ళారా?' అని అడుగుతూ ఉంటారు. సాహస ప్రవృత్తి, ఆరోగ్యం, గుండె ధైర్యం ఉన్నవాళ్ళే ఈ యాత్రకు సిద్ధపడడం మంచిదన్నది నా వ్యక్తిగత అనుభవం ద్వారా వచ్చిన అభిప్రాయం!

అద్భుతాల గుహ..

అదొక సున్నపురాతి గుహ. ఆ గుహలోకి అడుగుపెడితే ఆశ్చర్యం కలిగించే అద్భుత నిర్మాణాలు, పిల్లి, సింహం, ఇతర జీవులు విగ్రహాల్లా దర్శనమిస్తూ, కనువిందు చేస్తాయి. అలాగనీ వాటిని ఏ చిత్రకారులు చెక్కలేదు. అవి ప్రకృతి చెక్కిన ఆకృతులు. ఈ గుహ పేరు 'అల్ హుటా'. ఇరవై లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ గుహ ఒమన్‌లోనే ప్రసిద్ధి గాంచిన పర్యాటక స్థలం.

ఎలా ఏర్పడిందంటే!

వర్షం కురిసినప్పుడు గాలిలోని కార్బన్‌డయాక్సైడ్ కరిగి, కార్బోనిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంది. కార్బోనిక్ ఆమ్లం ఉన్న నీళ్లు పారడంతో గుహలోని సున్నపురాయి కరిగి విభిన్నమైన ఆకారాలు సహజ సిద్ధంగా ఏర్పడ్డాయి. ఒమన్‌లో ఇలాంటి గుహలు చాలా ఉన్నాయి. అయితే ఏ గుహలో లేని ఆకృతులు అల్ హూటా గుహ సొంతం. కార్బోనిక్ ఆమ్లం వల్ల 100 ఏళ్లలో 100 మిల్లీమీటర్ల సున్నపురాయి కరిగిపోతూ ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడ రాళ్ల దొంతరలు, పరదాల వంటివి ఏర్పడటానికి ఇరవై లక్షల సంవత్సరాలు పట్టింది.

ఇవీ ఆకర్షణలు:

గుహ లోపల భూమి నుంచి పొడుచుకు వచ్చినట్లుగా ఉండే పెద్ద సింహం, పిల్లి, ఇతర జంతువుల ఆకారాలు, గుహ పై భాగం నుంచి వేలాడుతూ ఉండే రకరకాల వింత రూపాలు, రంగు రంగుల్లో మెరిసిపోయే రాళ్ల వరసలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటాయి. ఈ గుహలో 800 మీటర్ల పొడవైన సరస్సు ఉంది. అరుదైన 'గ్యారెబ్యారెఇమియాయి' (బ్లైండ్ ఫిష్)అనే చూపు పూర్తిగా లేని చేపలను ఈ సరస్సులో చూడొచ్చు. గబ్బిలాలు, ఇతర కీటకాలు, మొలస్కాలు, నత్తలు, నీటి పురుగులు కూడా ఉంటాయి.

ఎలా వెళ్లాలి:

ఒమన్‌లోనే ఎత్తైన జబల్ షామ్స్ పర్వత పరిసర ప్రాంతాల్లో ఉంది అల్ హూట గుహ. ఒమన్‌లో నిజ్వా, బహ్లా పట్టణాలకు మధ్యన 34 కి.మీ. దూరంలో ఈ గుహ ఉంది. మస్కట్ నుంచి రెండు గంటలు ప్రయాణిస్తే 'అల్ హుటా' గుహ ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. అన్నట్టు అరేబియా ద్వీపకల్పంలో పర్యాటకులను అనుమతిస్తున్న, మొదటి, ఏకైక గుహ కూడా ఇదే!

ముందస్తు బుకింగ్:

సందర్శకులను విద్యుత్ రైల్లో గుహ ప్రవేశ ద్వారం వద్దకు తీసుకెళ్తారు.ఒక గంటలో గుహను చూసి రావడానికి అనుమతిస్తారు. పర్యావరణ శాఖ ఆదేశాల మేరకు రోజుకు 750 మంది పర్యాటకులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ముందస్తు టికెట్ బుకింగ్ సౌకర్యం కూడా ఉంది.

అనుమతించే వేళలు:

మంగళవారం నుంచి ఆదివారం వరకు పర్యాటకులను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల మధ్య గుహలోకి అనుమతిస్తారు. నాలుగున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ గుహలో 500 మీటర్ల దూరం వరకు వెళ్లడానికి వీలుంటుంది. గుహ సమీపంలో అక్కడి భూగర్భశాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఒమన్ చరిత్ర, ఆల్ హూటా గుహతో పాటు, ఒమన్‌లోని ఇతర గుహల విశేషాలనూ తెలుసుకోవచ్చు.

గుహ పై భాగం నుంచి వేలాడుతూ ఉండే రకరకాల వింత రూపాలు, రంగు రంగుల్లో మెరిసిపోయే రాళ్ల వరసలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటాయి. అరుదైన 'గ్యారెబ్యారెఇమియాయి' అనే చూపు పూర్తిగా ఉండని చేపలను ఈ గుహలోని సరస్సులో చూడొచ్చు.



దేవదేవుడు... శ్రీ వేంకటేశుడు

'వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి'

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీనివాసుడికి సాటిరాగల దేవుడు ఇటు భూత కాలంలో కానీ.. అటు భవిష్యత్తులో కానీ మరెవరూ ఉండరు... ఇదీ శ్లోకానికి అర్థం.

తిరుమల పుణ్యక్షేత్రం 'కలియుగ వైకుంఠ'మని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి మూలకారణం.. స్వయం వ్యక్త స్వరూపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు. తిరుమలగిరిపై పవిత్రాద్భుతమైన ఒక సాలగ్రామశిల ద్వారా స్వయంభూగా వెలసిన శ్రీ వేంకటేశ్వరుణ్ణి శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ, తిరుమలప్ప, తిమ్మప్ప అని.. ఇలా ఎన్నో పేర్లతో భక్తజనులు ఆర్తిగా సంబోధిస్తూ ఉన్నారు. ఆనందనిలయుడైన శ్రీవారు నెలకొన్న బంగారు మందిరానికి 'ఆనంద నిలయ'మనే వ్యవహారం అనాదిగా ప్రసిద్ధమై ఉంది.

స్థలపురాణం

కలియుగారంభంలో... అనగా సుమారు 5వేల సంవత్సరాల క్రితం.. వక్ష స్థల మహాలక్ష్మి సమేతంగా ఆవిర్భవించిన శ్రీనివాసునికి తరతరాలుగా ఎందరో భక్తులు మందిర, గోపుర, ప్రాకార, మహాద్వారాలు నిర్మిస్తూ వచ్చారు. వేంకటపతికి నిత్యోత్సవ, వార్షికోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నారాయణవనం అధిపతులు ఆకాశ రాజు, తొండమాన్ చక్రవర్తి, పల్లవరాణి సామవై, విజయ నగర సామ్రాజ్యాధీశులు సాళువ నరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, తిరుమలరాయలు, అచ్యుతరాయలు ఇలా.. ఎందరో మహానుభావులు.. ఇక్కడ అద్భుత నిర్మాణాలను చేపట్టి అపూర్వసేవా కైంకర్యాల నెలవుగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దారు.

శ్రీవారిని దర్శించుకునే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడైన వరాహస్వామివారిని దర్శించుకోవాలని స్థలపురాణంలో ఉంది. అలాగే స్వామి వారి దర్శనానంతరం... తిరుపతిలో పద్మావతి/బీబీనాంచారి/అలివేలుమంగ అమ్మ వారిని, గోవిందరాజస్వామి వారిని దర్శించుకోవాలి. తిరుమలగిరులలో ఉన్న పవిత్ర ఆకాశగంగ.. పాపనాశనం.. వకుళమాత ఆలయం,, హాథీరాంజీ మఠం.. త్రిదండి జీయర్‌స్వామివారి మఠం..వన్యప్రాణుల పార్క్.. వంటి ఆధ్యాత్మికపర్యాటక ప్రాశస్త్యమున్న ప్రాంతాల్ని దర్శించుకోవచ్చు. తితిదే బస్సు సర్వీసులతో పాటు ఆయా ప్రదేశాలకు ప్రైవేటు వాహనాలూ అందుబాటులో ఉంటాయి. తలనీలాలు మొక్కుబడి ఉన్నవారు తప్పనిసరిగా స్వామివారి 'కల్యాణకట్ట' వద్దనే తలనీలాలు సమర్పించాలి

తితిదే ప్రకటించిన వేళల వివరాలివీ:

వారం	సమయం
ఆదివారం	ఉదయం 9గం. నుంచి సాయంత్రం 7గం. వరకు
సోమవారం	ఉదయం 9గం. నుంచి సాయంత్రం 7గం. వరకు
మంగళవారం	ఉదయం 9గం. నుంచి సాయంత్రం 7 గం. వరకు
బుధవారం	ఉదయం 10గం. నుంచి సాయంత్రం 7గం. వరకు
గురువారం	ఉదయం 9గం. నుంచి సాయంత్రం 4గం. వరకు
శుక్రవారం	ఉదయం 10గం. నుంచి సాయంత్రం 4గం. వరకు
శనివారం	ఉదయం 7 గం. నుంచి సాయంత్రం 4 గం. వరకు

వృద్ధులకు, వికలాంగులకు దర్శన వేళలు:

శ్రీవారి దర్శనానికి వచ్చే వికలాంగులు, వృద్ధులకు తితిదే ప్రత్యేక ప్రవేశ అవకాశం కల్పిస్తోంది. మందిరం మహాద్వారం సమీపం నుంచి ఆలయంలోకి చేరుకునే సౌలభ్యం కల్పించింది. నిత్యం ఉదయం 10, మధ్యాహ్నం 3గంటలకు ఆలయ ప్రవేశాలకు అనుమతిస్తుంది. ఈ దర్శన సమయాల కన్నా గంట ముందుగా ఆయా భక్తులు పరిశీలనకు హాజరవ్వాల్సి వుంటుంది. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులకు వయస్సు ధ్రువీకరణ పత్రం ఆధారంగా అనుమతిస్తారు. నడవలేని పరిస్థితిలో ఉన్నవారి వెంట సహాయకులను అనుమతిస్తారు. వికలాంగులు, గుండె జబ్బుతో ఆపరేషన్ చేసుకున్న భక్తులను వైద్యులు జారీచేసి పత్రాల పరిశీలన అనంతరం అనుమతిస్తారు. బ్రహ్మోత్సవాలు వంటి విశేష పర్వదినాల్లో ఈ దర్శనాలను తితిదే రద్దు చేస్తుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని తితిదే ముందుగానే ప్రకటిస్తుంటుంది.

తిరుపతి, తిరుమలకు ప్రయాణ సదుపాయాలు

తిరుమల, తిరుపతి శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు రోడ్డు.. రైలు.. ఆకాశ మార్గాల్లో విస్తృతమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకునే భక్తులకు స్టేషన్ ఎదురుగానే కొండపైకి తీసుకెళ్లే ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు ప్రతి నిమిషానికో బస్సు చొప్పున బ్రహ్మోత్సవాల సమయంలో నడుస్తుంటాయి. ప్రీపెయిడ్ ట్యాక్సీలు కూడా అందుబాటులో ఉంటాయి.

రేణిగుంట విమానాశ్రయం నుంచి నిత్యం మధ్యాహ్నం ఒక ఆర్టీసీ సూపర్ లగ్జరీ సర్వీసు నిర్వహిస్తున్నారు. ఈ బస్సు తిరుమల నుంచి ఉదయం 11 గంటలకు బయల్దేరి.. రేణిగుంట విమానాశ్రయానికి మధ్యాహ్నం 12.30 నిమిషాలకు చేరుతుంది. తిరిగి విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుమలకు బయల్దేరుతుంది. విమానాశ్రయంలో ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి. తిరుపతి కేంద్రంగా ఉన్న ట్రావెల్ కంపెనీలకు సమాచారం ఇచ్చే పక్షంలో వాహనాలను సమకూర్చుతారు. అన్ని రకాల సొంత వాహనాలనూ తిరుమల వెళ్లేందుకు తితిదే అనుమతిస్తోంది. అలిపిరి భద్రతా వలయంలో తనిఖీలు నిర్వహించుకున్న అనంతరం టోల్ రుసుం చెల్లించి ఆయా వాహనాల్లో తిరుమలకు రావాల్సి ఉంటుంది. అన్ని రకాల వాహనాలు అలిపిరి నుంచి తిరుమలకు రెండో కనుమ రహదారిలో 28 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని తితిదే వేగ నియంత్రణ చర్యలు చేపట్టింది. అదేవిధంగా తిరుమల నుంచి తిరుపతికి మొదటి కనుమ రహదారిలో ప్రయాణ సమయం 45 నిమిషాలు తీసుకోవాల్సి వుంటుంది. నిర్దేశిత సమయం కంటే ముందుగా వచ్చే పక్షంలో సంబంధిత వాహనాలను తిరుమలకు 10 రోజులపాటు రాకుండా నిషేధం విధిస్తూ చర్యలు తీసుకుంటారు! రెండోసారి కూడా నిబంధనలు పాటించని పక్షంలో జరిమానా విధిస్తారు. సమయాన్ని లెక్కించడానికి అలిపిరి భద్రతావలయంలో వాహనదారులకు తితిదే బార్ కోడింగ్ రశీదులను జారీ చేస్తుంది.

కాలినడకన వెళ్లే భక్తుల కోసం

అలిపిరి, శ్రీవారి మెట్టు నుంచి తిరుమలకు కాలినడకన రావడానికి తితిదే అనుమతిస్తుంది. అలిపిరి నుంచి 24 గంటల సమయం, శ్రీవారి మెట్టు ల నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రవేశం కల్పిస్తుంది. గరుడోత్సవం సమయంలో 24 గంటల సమయం అనుమతించాలని నిర్ణయించింది. అడవి జంతువులను దృష్టిలో పెట్టుకుని శ్రీవారి మెట్టు మార్గంలో పగటి సమయంలో మాత్రమే భక్తుల రాకపోకలకు అనుమతిస్తున్నారు. వీరికి మార్గమధ్యంలో దివ్యదర్శనం టోకెన్లను తితిదే ఉచితంగా జారీ చేస్తుంది. టోకెన్లను పొందిన భక్తులకు శ్రీవారి దర్శనం ఉచితంగా కల్పించడంతో పాటు ఒక లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తారు. రెండు లడ్డూలు కావాలంటే రూ. 10 చొప్పున రాయితీపై అందజేస్తారు. అవసరమైన వారు రూ. 25 ధరపై మరో రెండు లడ్డూలూ పొందవచ్చు. భక్తుల లగేజీని తితిదేయే తిరుమలకు ఉచితంగా చేరవేస్తుంది. అలిపిరి, శ్రీవారిమెట్టు ప్రవేశమార్గంలో ఈ ఉచిత లగేజీ రవాణా కేంద్రాలు ఉన్నాయి. అక్కడ భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసి రశీదు చూపి ఈ లగేజీని తీసుకోవచ్చు.

బ్రహ్మోత్సవాల సమయంలో తితిదే ప్రత్యేక ప్రవేశ దర్శనాల టికెట్లను కరెంటు బుకింగ్ కింద ఇవ్వడాన్ని రద్దు చేస్తుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నారు. అడ్వాన్స్ బుకింగ్ కింద నిత్యం అంతర్జాలంలో 6వేలు, ఇదర్శన కౌంటర్ల ద్వారా మరో 5వేల టికెట్లను రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. టికెట్లలో నిర్దేశించిన సమయానికి ఆయా భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో శ్రీవారి దర్శనానికి హాజరుకావాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డు, సంప్రదాయ దుస్తులు ధరించని పక్షంలో శ్రీవారి దర్శనానికి అనుమతించరు. ఒక్కో టికెట్‌పై రెండు ప్రసాద లడ్డూలు ఉచితంగా అందజేస్తారు.

తిరుమలలో భక్తులందరికీ తితిదే స్వామివారి అన్నప్రసాదం అందజేస్తోంది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఈ అన్నప్రసాదం అందుబాటులో ఉంటుంది. ఎలాంటి సిఫార్సు లేకుండా ప్రతిఒక్కరూ ఈ అన్న ప్రసాదాన్ని ఉచితంగా స్వీకరించవచ్చు. బ్రహ్మోత్సవాల్లో రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడే భక్తులకు అల్పాహారం, పానీయాలనూ అందించేందుకు తితిదే ఏర్పాట్లు చేస్తోంది.

వసతి సౌకర్యం

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు 24 గంటల పాటు ఉచిత వసతి కల్పిస్తారు. తితిదే ఆధ్వర్యంలో తిరుపతితిరుమల ప్రాంతాల్లో సుమారు 15వేల కాటేజ్‌లు భక్తుల కోసం అందుబాటులో ఉన్నాయి. హాథీరాంజీ మఠం, జీయర్ మఠం, శంకరమఠం తదితర సంస్థల ఆధ్వర్యంలోనూ వసతి లభిస్తుంది.

ఇవికాక ఆర్జితసేవలు పొందేవారి కోసం ప్రత్యేక కాటేజ్‌లు ఉన్నాయి. అలాగే వివిధ రాష్ట్రాల టూరిజం శాఖల అతిథిగృహాలు, వివిధ ఆధ్యాత్మిక సంస్థల అద్దెగదులు అందుబాటులో ఉన్నాయి. ముందస్తు రిజర్వేషన్, ఇతర వివరాలకు తితిదే కార్యాలయంలో సంప్రదించాలి

ప్రధాన/ ప్రత్యేక పూజలు:

నిత్యసేవలు: సుప్రభాతం
ప్రవేశం: ఒకరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ. 120
నిత్యసేవలు: తోమాల
ప్రవేశం: ఒకరికిరోజు: మంగళ, బుధ, గురుటిక్కెట్టు ధర: రూ.220
నిత్యసేవలు: అర్చన
ప్రవేశం: ఒకరికిరోజు: మంగళ, బుధ, గురుటిక్కెట్టు ధర: రూ.220
నిత్యసేవలు: కల్యాణోత్సవం
ప్రవేశం: ఇద్దరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ. 1000
నిత్యసేవలు: ఆర్జిత బ్రహ్మోత్సవం
ప్రవేశం: ఒకరికి రోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ.200
నిత్యసేవలు: డోలోత్సవం
ప్రవేశం: ఒకరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ.200
నిత్యసేవలు: సహస్ర దీపాలంకరణ సేవ
ప్రవేశం: ఒకరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ.200
నిత్యసేవలు: వారం సేవలు విశేషపూజ
ప్రవేశం: ఒకరికిరోజు: సోమవారంటిక్కెట్టు ధర: రూ.600
నిత్యసేవలు: అష్టదళ పాదపద్మారాధనం
ప్రవేశం: ఒకరికిరోజు: మంగళవారం టిక్కెట్టు ధర: రూ. 1,250నిత్యసేవలు: సహస్ర కలశాభిషేకం
ప్రవేశం: ఒకరికిరోజు: బుధవారంటిక్కెట్టు ధర: రూ.850
నిత్యసేవలు: తిరుప్పావడ సేవ
ప్రవేశం: ఒకరికిరోజు: గురువారంటిక్కెట్టు ధర: రూ.850
నిత్యసేవలు: అభిషేకం
ప్రవేశం: ఒకరికిరోజు: శుక్రవారంటిక్కెట్టు ధర: రూ.750
నిత్యసేవలు: నిజపాద దర్శనం

శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన వేళలు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక దర్శనవేళలు ఒక్కోరోజు ఒక్కోవిధంగా ఉంటాయి. స్వామివారికి జరిగే నిత్య, వారపు సేవలను బట్టి ఆయా సమయాలను తితిదే నిర్దేశించింది. టిక్కెట్లను ముందస్తుగా అంతర్జాలం, ఈదర్శన్, తపాలా శాఖ ద్వారా విక్రయిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రంలోపు నిర్దేశించిన సమయం లోపు శ్రీవారిని దర్శించుకునే వేళలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న సమయం టిక్కెట్టుపై ముద్రితమవుతుంది. ఈ సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవడానికి వరుస వద్దకు రావాల్సి ఉంటుంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నిత్యం రూ.300 ధర వంతున 26వేల టిక్కెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 56 రోజులకు ముందుగా టిక్కెట్లను పొందే అవకాశం ఉంది. విశేష పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ల సంఖ్యను దేవస్థానమే తగ్గిస్తుంది.

కుటుంబమే కేంద్రబిందువు!

ఆదాము చేసిన తొలి పాపం దేవుని ఆజ్ఞను ఉల్లంఘించడమే! ఏదెను తోటలోని ఒక చెట్టు ఫలాన్ని తినవద్దని అతని మేలు కోసమే దేవుడు ఖండితంగా ఆజ్ఞాపించాడు. కాని హవ్వ వచ్చి "పరవాలేదు తిను!" అని చెబితే, దేవుని ఆజ్ఞను పక్కన పెట్టి ఆదాము దాన్ని తిన్నాడు. అలా లోకంలో తమకు

ఆప్తులైన వారిని సంతోషపెట్టేందుకూ, ఇతర స్వార్థప్రయోజనాలను ఆశించీ దేవుణ్ణి బాధపెట్టి సమాజంలో కీడుకు బాధ్యులవుతున్న వారి సంఖ్య ఈనాటికీ బాగా విస్తరిస్తోంది.

కుటుంబానికి భర్త లేదా తండ్రి నాయకుడు, యజమాని. కుటుంబంలో అస్తవ్యస్తమైన పరిస్థితులు ఉంటే దేవుడు పురుషుణ్ణే నిలదీస్తాడు, ఎందుకంటే 'కుటుంబ బాధ్యత' ప్రాథమికంగా పురుషుడిది. అయితే యజమానిగా పురుషుడు తప్పకుండా తన భార్యను అన్ని విషయాల్లో సంప్రతించాలి (ఆది 21:12). భార్య తన భర్తను చెప్పుచేతల్లో పెట్టుకోవాలనుకున్నా, కుటుంబ వ్యవహారాల్లో భార్యను సంప్రదించడాన్ని భర్త తేలిగ్గా తీసుకున్నా అందుకు దేవుడు అనుమతించడు. కుటుంబం సవ్యంగా సాగాలంటే, అది దైవ నిర్ణాయక విధానంలో సాగితేనే సాధ్యం. 'సమాజంలోని కీడు'కు ఆరంభ కేంద్రం కుటుంబమే! దైవ నిర్ణయాలను ఉల్లంఘించిన కుటుంబంలో ఆరంభమైన కీడే సమాజంలోకి విస్తరిస్తుంది. మొత్తం లోకాన్ని కలుషితం చేస్తుంది. కాబట్టి 'సమాజ ప్రక్షాళన' కుటుంబం నుంచే ఆరంభం కావాలి.

ఆర్జన ధర్మ సమ్మతంగా ఉండాలి!

మనిషికి ఈ ప్రపంచంలో డబ్బు సంపాదించడాన్ని ఒక పరీక్షగా అల్లాహ్ పెట్టాడు. అతడికి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని ప్రసాదించాడు. మనిషి కోరుకుంటే ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా ఉపాధిని అన్వేషించవచ్చు. లేదా అధర్మమైన మార్గాలను అనుసరించి ధనరాశులను కూడబెట్టవచ్చు. కాని ప్రళయదినాన అల్లాహ్ సమక్షానికి హాజరై, తప్పనిసరిగా సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. ఆ రోజున అల్లాహ్ అతను సంపాదించిన ధనం గురించి ప్రశ్నిస్తాడు. "నువ్వు కూడబెట్టిన ధనాన్ని ఎలా సంపాదించావు? దాన్ని ఎలా ఖర్చు చేశావు?" అని.

"ప్రజలారా! ఒకరి సొమ్మును మరొకరు అధర్మంగా తినకండి. పాపాలకు మీరు దూరంగా ఉంటే, మీ చిన్న దోషాలను లెక్కలోంచీ తీసేస్తాం. మిమ్మల్ని గౌరవ స్థానాల్లో ప్రవేశింపజేస్తాం" అని దివ్య ఖుర్ఆన్ అన్నిసాలో పేర్కొన్నారు.

దైవ ప్రవక్త ఇలా తెలిపారు: "నిషేధించిన పద్ధతుల్లో చేసిన (హరామ్) సంపాదనతో పోషించిన శరీరం స్వర్గంలో ఎంతమాత్రం ప్రవేశించలేదు. ఆ శరీరం నరకానికి పోయే అర్హత కలిగి ఉంటుంది.

నిషేధిత సంపాదన సత్కార్యాలను నాశనం చేస్తుంది. ఇహలోక జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. అంటే మనిషి చేసే దుఆ(ప్రార్థన)కు దైవామోదం ఏమాత్రం లభించదు. మనిషి అన్ని వేళల్లో, అన్ని కార్యాల్లో నిస్సహాయుడు. ప్రతి విషయంలో దైవ సహాయం తప్పకుండా అవసరం అవుతుంది. అప్పుడు అతను రెండు చేతులనూ పైకెత్తి అల్లాహ్‌ను వేడుకుంటాడు. అలా ఎలుగెత్తి పిలిచిన తన ప్రతి భక్తుడి వైపూ కరుణామయుడైన అల్లాహ్ మరలుతాడు. అతడి వేడుకోలును ఆలకిస్తాడు. అతడి అవసరాలను తీర్చుతాడు. కానీ ఎవరైతే నిషేధిత పద్ధతుల్లో సంపాదించిన ధనం కలిగి ఉంటాడో, బంధుత్వ సంబంధాలను తెంచుకుంటాడో అటువంటి వ్యక్తి ఎంతగా మొరపెట్టినా, అతడి ప్రార్థనలను ఆలకించడు. అతడి అవసరాలను తీర్చడు. చివరకు ఈ స్థితిలో అతడు పవిత్ర గృహమైన మక్కాకు వెళ్ళి ప్రార్థించినా సరే!"



వార్ధక్యం సహజమూ, అనివార్యమే కావచ్చు. అయితే, వార్ధక్యాలన్నీ ఒక్కటి కావు. సహజ వార్ధక్యం, అకాల వార్ధక్యం అంటూ ఇది రెండు రకాలు. ఏ 80 ఏళ్ల తర్వాతో శరీర భాగాలు వశం తప్పుతున్నాయంటే అది సాధారణం, సహజం. కానీ, ఈ రోజుల్లో చాలా మంది శరీరాలు పెద్ద వయసు రాకముందే కుంటుపడుతున్నాయి. ఈ స్థితినే అకాల వృద్ధాప్యం అంటాం. సహజ కాలానికన్నా ముందే ఎందుకిలా అంటే? దానికి కారణాలు అనేకం...

నూరేళ్లూ హుషారుగా!

మానవ శరీరంలో ప్రతి క్షణం అనేకానేక జీవకణాలు క్షీణిస్తూ కొత్త కణాలు పుడుతుంటాయి. అయితే ఈ జీవ కణాల ఆయుఃకాలం కొన్ని గంటల నుంచి కొన్ని రోజులు మాత్రమే ఉంటుంది. శరీరంలో అనుక్షణం ఉత్పత్తి అయ్యే జీవకణాల సంఖ్య కంటే మరణించే కణాల సంఖ్య ఎక్కువ కావడం, లేదంటే ఉత్పత్తి అయ్యే కణాల సంఖ్యే బాగా తగ్గిపోవడం ఇందుకు కారణం కావచ్చు. ఇలా ఆరోగ్యానికి హాని చేసే మృత కణాలు పెరిగిపోవడమో లేదా జీవక్రియల్లో భాగంగా ఆ మాలిన్యాల ఉత్పత్తి పెరగడమో ఇందుకు కారణమవుతుంది. మనిషి జీవించినంత కాలం ఆరోగ్యంగా ఉండడం అసలైన ఆయుర్దాయంగా పరిగణనలోకి వస్తుంది. సహజ క్రమంలో కాకుండా అకాల వృద్ధాప్యం అంటూ వస్తే దాన్ని ఒక వ్యాధిగానే పరిగణించాల్సి ఉంటుంది. ఈ అకాల వృద్ధాప్యం వెనుక, మనిషి, వృత్తి, ప్రవృత్తి వాతావరణంలో సంతులనం తప్పి పోవడం ఒక మౌలిక కారణం. ఈ సంతులనం తప్పినప్పుడు కలిగేదే అకాల వృద్ధాప్యం,



ఫ్రీ ర్యాడికల్స్....

శరీరంలోని జీవ కణాలు ఉత్పత్తికంటే ఎక్కువగా నశించినప్పుడు అనేక వ్యర్థపదార్థాలు (ఫ్రీ రాడికల్స్/ ఆక్సిడెంట్స్) తయారవుతాయి. అయితే వివిధ ప్రక్రియల ద్వారా ఈ వ్యర్థపదార్థాలను ఎప్పటికప్పుడు విసర్జించడం శరీరంలో నిరంతరం జరుగుతూ ఉంటుంది. కాకపోతే, సహజ పరిణామానికన్నా మించి, శరీరంలో మలినాలు తయారైనప్పుడు శరీరం వ్యధకు గురవుతుంది. వ్యాధుల పాలవుతుంది. అయితే శరీరంలో పేరుకుపోయిన ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించడానికి, ప్రకృతి సహజంగానే శరీరంలో కొన్ని యాంటీ ఆక్సిడెంట్లు (వ్యర్థ పదార్థాల నిరోధకాలు) ఉత్పన్నమవుతాయి. అయితే యాంటి ఆక్సిడెంట్ల వ్యాధి నిరోధక శక్తిని మించి, వ్యర్థ పదార్థాలు ఉత్పత్తి అవుతున్నప్పుడు వాటిని సమర్థంగా ఎదుర్కోవ డానికి, ఆహారం, ఔషధ రూపాల్లో అదనంగా మరికొన్ని యాంటీ ఆక్సిడెంట్లను ఇవ్వాల్సి ఉంటుంది.

యౌవనంలోనే..

వార్ధక్యంలో ధాతుక్షయ వేగం పెరగడం వల్ల సహజంగానే, శరీరం త్వరితంగా శక్తిహీనమవుతూ ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి శరీరం తరుచూ వ్యాధిగ్రస్థమవుతూ ఉంటుంది. అందుకే ప్రతి మనిషీ యవ్వనంలో ఉన్నప్పుడే సరియైన ఆహారం, అవసరమైనప్పుడు ఔషధాలు సేవిస్తే, ఓజస్సు (జీవ శక్తి) పెరిగి, వార్ధక్యంలో వచ్చే వ్యాధులు సమర్థంగా నిరోధించబడతాయి. ఇందుకోసం, ఆహారం విషయంలో వృద్ధులు విధిగా కొన్ని నియమాలు పాటించాలి. వాటిలో ముఖ్యంగా...

- మాంసాహారం బాగా తగ్గించాలి.
- మలబద్ధకం రాకుండా జాగ్రత్త పడాలి.
- ఆహారం మృదువుగా, సులభంగా నమిలే రీతిలో ఉండాలి.
- పాల వంటి క్యాల్షియం ధాతు ప్రధానమైన ఆహారం రోజూ తీసుకోవాలి. చేపలు లేదా వృక్ష సంబంధ ప్రొటీన్ తరుచూ తీసుకోవాలి.
- ఆకలిని పెంచే సూప్స్ భోజనానికి ముందు ప్రత్యేకంగా తీసుకోవాలి.
- అవసరమైన మేరకు మంచి నీళ్లు తాగడంతో పాటు వ్యర్థపదార్థాలను తొలగించే యాంటీ ఆక్సిడెంట్లు గల ఆహార పదార్థాల పైన ప్రత్యేక దృష్టి పెట్టాలి.

విటమిన్లూ అంతే ముఖ్యం

- విటిమిన్ 'ఎ' కెరోటినాయిడ్స్ రూపంలో పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగులో ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లో ఉంటుంది. ముఖ్యంగా, క్యారట్, ముల్లంగి, టమాట, మునగ, బొప్పాయి, పచ్చిమిర్చి, మామిడి పండ్లు, చేమ ఆకులు, పాలకూర, మెంతి కూరలో ఉంటుంది. అందుకే వీటిని తరుచూ వాడుతూ ఉండాలి. నేరుగా విటమిన్ ఏ రూపంలో చేపలు, మాంసం, పాలు, వెన్న, నెయ్యి గుడ్లు, లివర్‌లో ఉంటుంది.
- విటమిన్ సి అధికంగా, సిట్రస్ జాతిపండ్లైన నిమ్మ, బత్తాయి, నారింజ, ఉసిరి, సీతాఫలం, జామ, టమాట, మిర్చి, ఆకుకూరల వంటి వాటిలో అధికంగా ఉంటుంది.
- విటమిన్ ఇ అధికంగా, నూనె గింజలు (ఆల్మండ్, ఎప్రికాట్స్) వెజిటబుల్ ఆయిల్స్ (సన్‌ఫ్లవర్, వేరుశెనగ, సోయా) కాడ్ చేపలు, మాంసం, మొలకెత్తిన గింజలలో (పెసర్లు, శనగలు, వేరు శనగ) ఉంటాయి.
- లవణాల్లో ముఖ్యంగా సెలీనియం, కాపర్, జింక్, మెగ్నీషియం వంటివి నువ్వులు, వేరు శనగ, సోయా, ఆల్మండ్స్, నూనెగింజలు, రాగులు, అలచందలు జొన్నలు, సజ్జల వంటి చిరుధాన్యాలు, వివిధరకాల పప్పుధాన్యాల్లో ఉంటుంది, ముదురాకు పచ్చని ఆకు కూరల్లో కూడా ఈ లవణాలు ఎక్కువగానే ఉంటాయి. వీటిని తరుచూ తీసుకోవడం ద్వారా అకాల వృద్ధాప్యాన్ని అరికట్టవచ్చు.

రసాయనాలు కీలకం

వృద్ధాప్యాన్నీ, వృద్ధాప్య లక్షణాల్నీ, ఆ వయసులో వచ్చే పలు రకాల వ్యాధుల్నీ ముందుగానే నిరోధించే ఔషధాల విషయంలో శ్రద్ధ వహించాలి. అలాంటి ఔషధాల్నే రసాయనాలు అంటారు. ఈ రసాయనాల్లో త్రిఫల రసాయనం, భృంగరాజ రసాయనం, మేధ్య రసాయనం, అశ్వగంధ రసాయనం, ధాత్ర్యాధి రసాయనం ముఖ్యమైనవి. వీటితో పాటు శిలాజిత్ రసాయనం, హరీతకీ రసాయనం, పిప్పలీ రసాయనం, పలాశ రసాయనం, అమలకీ ర సాయనం, హరీతకీ రసాయనం కూడా ఎంతో ప్రభావవంతమైనవి.

పిల్లల్లో పెరుగుదల లోపాలను గుర్తించేదెలా?

సాధారణంగా తల్లిదండ్రులు పిల్లలను బంధువులు, చుట్టుపక్కల పిల్లలతో పోల్చుకుని తమ పిల్లల్లో లోపం గ్రహించి వైద్యుల్ని కలుస్తూ ఉంటారు. కానీ అలా కలిసేలోపే వాళ్ల పిల్లలు మాగ్నిమం గ్రోత్‌కు చేరుకుని ఉంటారు. ఇక అప్పుడు చికిత్స చేయటానికి కుదరదు. పిల్లల గ్రోత్‌ను పెంచే చికిత్సలన్నీ ఎంత త్వరగా మొదలుపెడితే అంత మంచి ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి పిల్లలు వయసుకు తగిన ఎత్తు పెరుగుతున్నారో లేదో ఎప్పటికప్పుడు పీడియాట్రిషియన్ సహాయంతో గ్రోత్ చార్ట్ మెయిన్‌టెయిన్ చేస్తూ ఉండాలి. బరువు చెక్ చేసినట్టే ఎత్తును కూడా చెక్ చేస్తూ ఉండాలి. ఇందుకోసం ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ తయారుచేసిన గ్రోత్ చార్ట్‌ను ప్రామాణికంగా తీసుకుని వయసువారీగా, జెండర్‌పరంగా పిల్లల ఎత్తును కొలుస్తూ ఉండాలి. పెరుగుదల ఆగినట్టు కనిపిస్తే వెంటనే ఎండోక్రైనాలజిస్ట్‌ని కలవాలి.

గోళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే?

చర్మం పట్ల చూపించిన శ్రద్ధ గోళ్ల పట్ల చూపించం. వాటిని డబ్బాల మూతలు తీయడానికి, కూరగాయల తొడిమలు తెంపడానికి వాడతాం, నేల మీద ఒలికిన కొవ్వొత్తి బొట్లను తొలగించడానికీ ఉపయోగిస్తాం. ఈ పనుల వల్ల గోళ్లు పగులుతాయి, చిట్లుతాయి. పొరలుగా విడిపోతాయి. విరిగిపోతాయి. ఈ నష్టంతో పాటు గోళ్ల చిగుళ్లు ఇన్‌ఫెక్షన్‌కు లోనై కొత్త సమస్యలూ వచ్చి పడతాయి. కాబట్టి గోళ్ల ఆరోగ్యం కాపాడుకోవడం కోసం వాటిని తరచుగా పరీక్షించుకుంటూ, శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, 'మానిక్యూర్, పెడిక్యూర్' లాంటి గోటి చికిత్సలు తరచుగా తీసుకుంటూ ఉండాలి. మాయిశ్చరైజర్ పూసుకుంటూ, కాపాడుకుంటూ ఉండాలి. గోళ్ల పట్ల తీసుకోవలసిన మరిన్ని జాగ్రత్తలు ఏవంటే....

- చిగుళ్ల లోపలకి లేదా మరీ బయటకు కత్తిరించుకోకూడదు. చిగుళ్ల లోపలికి కత్తిరించుకుంటే సూక్ష్మక్రిములు తేలికగా లోపలికి ప్రవేశిస్తాయి. బయటకు కత్తిరించుకుంటే గోళ్ల అడుగున మట్టి చేరుకుంటుంది.
- గోళ్లు విరిగితే వాటిని అలాగే వదిలేయకూడదు. విరిగిన గోళ్ల లోకి నీరు చేరి ఫంగస్ పెరుగుతుంది.
- కత్తిరించేటప్పుడు, ఒక వైపు నుంచి మొదలు పెట్టి ముగించాలి. అంతేగానీ అడ్డదిడ్డంగా కత్తిరించుకోకూడదు.
- గోళ్లు కత్తిరించుకున్న తర్వాత కచ్చితంగా ఫైలర్‌తో గోళ్ల అంచులు నునుపు చేయాలి. లేదంటే ఎగుడుదిగుడు గోటి అంచుల గుండా నీరు లోపలికి చేరి గోళ్లను బలహీనపరుస్తుంది.
- స్నానం చేసిన తర్వాత గోర్లు మెత్తబడతాయి. కాబట్టి
- కత్తిరించడానికి అదే అనువైన సమయం.
- నెయిల్ కట్టర్ నాణ్యమైనదై ఉండాలి. దాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.
- గోళ్ల రంగు తొలగించడానికి నాణ్యమైన అసిటోన్‌నే వాడాలి.
- ప్రతి రాత్రీ గోళ్లకు నెయిల్ మాయిశ్చరైజర్ పూసుకోవాలి.
- వారంలో కనీసం వరుసగా మూడు రోజుల పాటు అయినా రంగు వేసుకోకుండా గోళ్లకు గాలి, వెలుతురు సోకనివ్వాలి.
- నాణ్యమైన గోళ్ల రంగులనే ఎంచుకోవాలి.
- వేసుకున్న గోళ్ల రంగు రెండు రోజులకు మించి ఉంచుకోకూడదు.

యూత్‌ను అట్రాక్ట్ చేస్తున్న డాన్స్ యోగా

నగరానికి వచ్చిన నయా యోగా.. డ్యాన్స్ యోగా. డ్యాన్స్ ను ఓ ఫిట్‌నెస్ మార్గంగా భావించడం మొదలుపెట్టిన తరువాత ఏరోబిక్స్, జుంబా లాంటివి వచ్చినట్లే ఇప్పుడు యోగాతో డ్యాన్స్‌ను మిక్స్ చేసి డ్యాన్స్ యోగా అంటున్నారు

యోగా.. ఫిట్‌నెస్ కోసం ఇటీవలి కాలంలో ఎక్కువ మంది అనుసరించడానికి వినియోగిస్తున్న మార్గం. అవే సూర్యనమస్కారాలు.. లేదంటే ఆసనాలు... బోర్ కొడుతుంది అనే యువత కోసం ఆక్రో యోగా, ఏరియల్ యోగా.. ఇలా భిన్న రీతులలో యోగా అందుబాటులోకి వచ్చి వారిలో యోగా పట్ల అభిరుచిని పెంచుతోంది. ఈ క్రమంలో ఆడపాదడపా ఆయా దేశాలతో పాటుగా ఇండియాలో కూడా జరిగిన డ్యాన్స్ యోగా ఇప్పుడు నగరానికి వచ్చింది. అనహిత యోగా జోన్ ఫౌండర్ ప్రతిభా అగర్వాల్ ఈ డ్యాన్స్ యోగా వర్క్‌షాప్‌ను ఇటీవల ఆలంకృత రిసార్ట్‌లో చేసి నగరంలో అధికారికంగా ఈ యోగా వచ్చిందనిపించారు.

సెలబ్రేషన్ ఆఫ్ బాడీ

డ్యాన్స్, యోగా రెండూ ఒకదానితో ఒకటి అనుసంధానించబడినవి. ఈ రెండూ కలిస్తే శరీరానికి అవసరమైన జీవశక్తి వస్తుందన్నది మోడ్రన్ యోగా నిపుణుల భావన. అనాదిగా ఆరోగ్యం కొరకు అనుసరిస్తున్న వెల్‌నెస్ మార్గాలకు నృత్యం జోడించడంతో పాటుగా సూర్యనమస్కారాలు,ఆక్రోయోగా వంటి వాటిని అనుసంధానించడం ద్వారా డ్యాన్స్ యోగా రూపుదిద్దుకుందన్నది యోగా ఇన్‌స్ట్రక్టర్ల మాట. డ్యాన్స్‌తో యోగాను మిళితం చేయడం వల్ల శరీరంలో శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం సాధ్యమవుతుందట. నృత్యం, యోగా రెండూ కూడా దాదాపు ఒకే రీతిలో ఉంటాయి కానీ రెండూ విభిన్నమైనవి. ఇదే విషయమై అనహిత యోగా జోన్ ఫౌండర్ ప్రతిభా అగర్వాల్ మాట్లాడుతూ ఽ డ్యాన్స్ యోగా పూర్తి సౌకర్యవంతమైనది. మన శ్వాసతో పాటుగా శరీరం కూడా మూవ్‌అవుతుంది. మనం ఎంత రిజిడ్‌గా ఉన్నా ఈ మూవ్‌మెంట్స్ మాత్రం తప్పనిసరి. దాన్ని ఎక్స్‌ప్లోర్ చేయాలనుకున్నప్పుడు ఈ డ్యాన్స్ యోగా బెస్ట్ మార్గంగా తోచింది. యోగాలోని బలాన్ని, డ్యాన్స్‌లోని వేగంతో జోడించి దాన్ని శ్వాసతోఅనుసంధానించడం ద్వారా ఈ డ్యాన్స్ యోగా తీర్చిదిద్దాం. నాలుగు రోజులు మా ఇన్‌స్ట్రక్టర్లతో కలిసి ప్రాక్టీస్ చేసి ఈ మూవ్‌మెంట్స్ తీర్చిదిద్దా. యువత నుంచి మంచి రెస్పాన్స్ వచ్చిందిద్ అని అన్నారు. డ్యాన్స్ యోగాలో మూవ్‌మెంట్స్ చాలా సులభంగా ఉండటమే కాదు.. డ్యాన్స్ అసలు రాని వారు కూడా చేసే రీతిలో ఉండటం విశేషం. తమ జీవనశైలిలో క్రమ శిక్షణ అలవాటు చేసుకోవడానికి ఈ డ్యాన్స్ యోగా ఉపయోగపడుతుందంటూనే ఆరోగ్యకరమైన జీవనశైలికు కూడా తోడ్పడుతుందని చెబుతున్నారు ఇన్‌స్ట్రక్టర్లు.

అలౌకిక ఆనందం..

నేటి యువతకు ఇన్‌స్టెంట్ ఫలితాలు కావాలి. తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలు కనిపించాలి. జిమ్,జుంబా లాంటి ఫిట్‌నెస్ యాక్టివిటీల పట్ల మొగ్గు చూపడానికి కారణం ఇదే. తమకు కావాల్సిన వినోదం అందిస్తూనే యాక్టివిటీ ఉండే ఈ తరహా వ్యాయామాలను ఇష్టపడే వారు సీరియ్‌సగా ఆసనాలు చేయడాన్ని అంతగా ఇష్టపడరు. అది దృష్టిలో పెట్టుకునే ఈ డ్యాన్స్ యోగా వెలువడిందన్నది ఇప్పటికే ఈ డ్యాన్స్ యోగాను ప్రాక్టీస్ చేస్తున్న వారి మాట. ప్రతిభా అగర్వాల్ సైతం ఇదే చెబుతూ మోర్ అండ్ మోర్ యంగస్టర్స్ కోసం తీర్చిదిద్దిర యోగా ఇది. యోగా ను కూడా ఆసక్తికరంగా చేయాలని చేసిన యోగా ఇది. యువతకు టైమ్ అసలు ఉండటం లేదు. గంటలోనే కోరుకున్న హెల్త్ రిజల్ట్‌తో పాటుగా స్ట్రెస్‌నుంచి రిలీఫ్ కావాలని కోరుకుంటున్నారు. అందుకే హఠ యోగా, ఆక్రోయోగా, సూర్య నమస్కార్ వంటి పోశ్చర్స్‌ను డ్యాన్స్‌తో మిళితం చేసి ఈడ్యాన్స్‌కు రూపకల్పన చేశాం. 10 నిమిషాలలో 25 పోశ్చర్స్ ఉండేలా దీన్ని డిజైన్ చేశాం. ఈ ఆసనాలు అసాధారణ స్ట్రెంగ్త్,బ్యాలెన్స్ ఇవ్వడమే కాదు.. బాడీ, మైండ్ కో ఆర్డినేషన్ కూడా చేస్తాయి. అందరితోనూ స్నేహంగా ఉండేలా తీర్చిదిద్దుతాయి.ద్ అని అన్నారు. ఈ డ్యాన్స్ యోగా ద్వారా తమ ఫేసియల్ మూవ్‌మెంట్స్ మారడంతో పాటుగా సన్నబడటం కూడా జరిగే అవకాశాలున్నట్లు ఈ సెషన్స్‌కు హాజరైన వారు చెబుతున్న మాట.

డ్యాన్స్ యోగాను హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా ధన్‌తేరస్ రోజు చేశాం. రెస్పాన్స్ బాగా వచ్చింది. ముఖ్యంగా యువత నుంచి. ఈ డ్యాన్స్ యోగా ద్వారా సెన్స్ ఆఫ్ టుగెదర్‌నెస్ పెరుగుతుంది. ఈ యోగా ద్వారా ఫ్లెక్సిబిలిటీ బాగా ఇంప్రూవ్ అవుతుంది.



చింత ఎంతో మేలు!

చింతపండు, ఆకు రెండూ ఆరోగ్యకరమే! వీటిలోని పోషకాలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. హెపటైటిస్ ఎ, బి, సిల నుంచి రక్షణ కల్పించడంతోపాటు, ఇతరత్రా ఇన్‌ఫెక్షన్‌లకు గురి కాకుండా కాలేయాన్ని కాపాడతాయి.

కాలేయం దాదాపు 500 జీవక్రియలను నిర్వహిస్తుంది. తనను తాను పునర్నిర్మించుకునే సామర్థ్యం కలిగిన ఏకైక అవయవం కాలేయం! అయితే అస్తవ్యస్త జీవనశైలి, ఆహారపుటలవాట్లు, వివిధ చికిత్సల్లో భాగంగా వాడే మందుల ప్రభావంతో కాలేయంలో క్రమంగా విషాలు పేరుకుంటూ ఉంటాయి. వీటిని ఎప్పటికప్పుడు విసర్జించేలా చేయాలంటే, ఓ చిట్కా పాటించాలి. గుప్పెడు లేత చింత ఆకులను శుభ్రంగా కడిగి, ఒక లీటరు నీళ్లలో కలిపి 15 నిమిషాలపాటు మరిగించాలి. దీన్లో రుచికి తేనె లేదా చక్కెర కలుపుకోవచ్చు. ఈ కషాయాన్ని ఉదయం, సాయంత్రం చెరొక కప్పు తాగితే కాలేయం ఆరోగ్యం భేషుగ్గా ఉంటుంది.

రాగిపాత్రలో నీరు... రోగాలను తగ్గిస్తుందా?

రాగి పాత్రలో ఉంచిన నీరు తాగడం మంచిదే. రాగి మన శరీరంలో రోగ నిరోధక శక్తి పెంపొందడానికి, ఆహారంలోని ఇనుమును శరీరం శోషించుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది. అయితే రాగి పాత్రల్లో ఆహారం వండడం లేదా తినడం అందరికీ మంచిది కాదు. కొన్ని రకాల ఆహార పదార్థాల్లోని ఆమ్లాలు, సాల్ట్స్ రాగితో కలిసి శరీరానికి హాని కలిగించే వ్యర్థ పదార్థాలను తయారు చేసే ప్రమాదం ఉంది.

కాలేయం, క్లోమం, మూత్రపిండాలు మొదలైన అవయవాలన్నీ ఆరోగ్యంగా ఉన్న వారు రాగి పాత్రలో ఆహారం తీసుకున్నా, వ్యర్థాలను శరీరం విసర్జించ గలుగుతుంది. కానీ ఆరోగ్య సమస్యలున్నవారు రాగి పాత్రల్లో ఆహారం తీసుకుంటే మాత్రం అది టాక్సిసిటీకి దారి తీసి కాలేయం, మూత్రపిండాల సమస్యలు ఎదురు కావచ్చు. అందువల్ల రాగి పాత్రలను నీళ్లు తాగడానికి పరిమితంచేస్తే మంచిది.

కాంగ్రెస్‌తో ఎలాంటి విభేదాలు లేవు

కాంగ్రెస్, సమాజ్ వాదీ పొత్తు చెక్కుచెదరలేదన్న అఖిలేష్

లక్నో,ఫిబ్రవరి21(వెలుతురు): కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ బుధవారం అఖిలేష్‌తో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత సీట్ల పంపకాల చర్చలపై అస్పష్టత తొలగిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్ వాదీ పొత్తు చెక్కుచెదరలేదని అఖిలేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల చర్చలు సరైన దారిలోనే ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 17 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేసే అవకాశం ఉందని వెల్లడించారు. లక్నోలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీట్ల పంపకాల ఒప్పందాన్ని ప్రకటించనున్నాయి. మొత్తం 17 సీట్లు కాంగ్రెస్‌కు అఖిలేష్ ఆఫర్‌గా పేర్కొన్నారు. ఈ ఆఫర్‌ను కాంగ్రెస్ అంగీకరించే వరకు రాష్ట్రంలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో

చేరబోనని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్‌తో ఎలాంటి విభేదాలు లేవని, త్వరలోనే మీకు తెలుస్తుందని 'ఆల్ ఈజ్ వెల్' అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ 'మేము పోటీ చేయగలిగినన్ని సీట్ల నుండి పోటీ చేస్తుంది' అని అఖిలేష్ చెప్పారు. యూపీలో 80 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా, సమాజ్‌వాదీ పార్టీ 31 మంది అభ్యర్థులను ప్రకటించింది. తాజా అభ్యర్థుల జాబితాలో, బుదౌన్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి అఖిలేష్ మామ శివపాల్ యాదవ్‌ను సమాజ్‌వాదీ పార్టీ బరిలోకి దింపింది. వారణాసి నుండి సురేంద్ర సింగ్ పటేల్, కైరానా నుంచి ఇక్రా హసన్, బరేలీ నుంచి ప్రవీణ్ సింగ్ అరోన్ ఉన్నారు. ఎస్పీ తన తొలి జాబితాలో బుదౌన్ నుంచి పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ తమ్ముడు అభయ్ రామ్ యాదవ్ కుమారుడు ధర్మేంద్ర యాదవ్‌ను బరిలోకి దింపింది. తన తల్లి సోనియా గాంధీ ఇప్పటి వరకు ప్రాతినిధ్య వహించిన నియోజకవర్గం రాయ్‌బరేలి నుంచి తొలిసారి లోక్‌సభ బరిలోకి దిగబోతున్న ప్రియాంక గాంధీ .. యూపీలో సీట్ల షేరింగ్ విషయంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.ఫిబ్రవరి 24న మొరాదాబాద్ నుంచి రాహుల్ గాంధీ యాత్రలో ప్రియాంక గాంధీ పాల్గొనే అవకాశం ఉంది. యాత్ర రాష్ట్రంలోకి ప్రవేశించినప్పుడు, తాను ఆసుపత్రిలో చేరానని, అందుకే హాజరు కాలేదని ప్రియాంక చెప్పారు. కాంగ్రెస్ సీట్ల పంపకం ఒప్పందం కుదిరిన తర్వాతే యాత్రలో పాల్గొంటానని అఖిలేష్ యాదవ్ కూడా హెచ్చరిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ యాత్రకు ప్రియాంక, అఖిలేష్ ఇద్దరూ హాజరవుతారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

రక్తమోడిన రైతుల చలో ఢిల్లీ యాత్ర

పోలీస్ కాల్పుల్లో యువరైతు మృతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(వెలుతురు): ఛలో ఢిల్లీ మార్చ్‌లో భాగంగా పంజాబ్– హర్యానా సరిహద్దు శంభు వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. హర్యానా పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌ను విడవగా ఒక రైతు తలకు గాయాలై మరణించాడు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఘర్షణకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. రైతులు చేపట్టిన చలో ఢిల్లీ మార్చ్‌లో భాగంగా బుధవారం పంజాబ్– హర్యానా సరిహద్దు శంభు వద్ద ఉద్రిక్తత

వాతావరణం నెలకొంది. ఖానౌరీ సరిహద్దులో నిరసనకారులను అడ్డుకునే క్రమంలో హర్యానా పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. దీంతో ఒక రైతు తలకు గాయాలై మరణించాడు. పలువురు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఒకవైపు ఘర్షణ వాతావరణం కొనసాగుతుంటే.. మరోవైపు కేంద్రం వారిని చర్చలకు ఆహ్వానించింది. 'రైతుల డిమాండ్లపై మరోసారి చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. చర్చలకు రైతు సంఘం నాయకులను ఆహ్వానిస్తున్నాం. శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడం చాలా ముఖ్యం' అంటూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా ఎక్స్(ట్విటర్)లో పోస్టు పెట్టారు. ఇప్పటికే రెండు వర్గాల మధ్య నాలుగు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. అయితే ప్రస్తుతం రైతుల వైపు నుంచి ఎలాంటి స్పందనా రాలేదని, వారి డిమాండ్లను పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని నాయకులు చెబుతున్నారు. అలాగే రైతుల నిరసనల కారణంగా దేశ రాజధాని సరిహద్దు ప్రాంతాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. పొ÷–లకెయిన్లు, జేసీబీ ఆపరేటర్లకు వార్నింగ్ ఇచ్చారు. భారీ మెషినరీతో ఆందోళనకారులకు సహకరించవొద్దని, భద్రతా సిబ్బందికి హాని కలిగిస్తే నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరికలు జారీ చేశారు. రైతులుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మద్దతుగా నిలిచారు. 'రైతుల డిమాండ్లకు పరిష్కారం లభించాలి. కొన్ని అవసరమైన పంటలకు కనీస మద్దతు ధర విషయంలో చట్టబద్ధత ఉండాలి. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుంది' అని స్పష్టం చేశారు.

కృష్ణా, తుంగభద్ర నదులే పాలమూరు జిల్లాకు జీవనాధారం

360 రోజులు నీటిని ఉపయోగించుకునేలా పాలమూరు ప్రాజెక్ట్

మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి21(వెలుతురు): కృష్ణా తుంగభద్ర నదులే పాలమూరు జిల్లాకు జీవనాధారం అని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 360 రోజులు నీటిని ఉపయోగించుకునేలా కేసీఆర్ పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్ తలపెట్టారు. కొడంగల్, నారాయణ పేటకు నీరు ఇవ్వడానికి పాలమూరు నుంచి రెండు కెనాల్లు ప్రతిపాదించారు. ప్రస్తుతం పాలమూరు – రంగారెడ్డిలో కేవలం 7 నుంచి 10 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులు పూర్తిచేస్తే కొడంగల్, నారాయణ పేటకు గ్రావిటీ ద్వారా నీరు అందించవచ్చు. కానీ ఆ రెండు కెనాల్స్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా రూ.2,900 కోట్లతో ఆ రెండు నియోజకవర్గాల కోసం కొత్త ప్రాజెక్ట్‌కు ప్లాన్ చేసింది. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేస్తున్నారు. కానీ ప్రతిపాదిత నిధుల్లో కేవలం అరవై డెబ్బై శాతం ఖర్చు పెడితే ఓపెన్ కెనాల్‌తో నీరు ఇవ్వొచ్చు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టుతో నీరు ఇవ్వొద్దనే భేషజంతోనే సీఎం రేవంత్ మళ్లీ కొత్త ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు. పాలమూరు, రంగారెడ్డి పనులు పూర్తి చేసి నీరిస్తేనే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు నిరంజన్ రెడ్డి. జూరాలపై కొత్త ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ప్రజలపై భారం పడుతుంది. బేషజాలకు వెళ్లకుండా కెనాల్స్ పూర్తి చేస్తే తక్కువ ఖర్చుతో నీరు ఇవ్వొచ్చు. శ్రీశైలంకు వచ్చే నీటిని ఆపేసేలా కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై బ్యారేజ్ నిర్మాణం తలపెడుతోంది. ముందు దాన్ని అడ్డుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే మాట్లాడి దాన్ని అడ్డుకోవాలి అని నిరంజన్ రెడ్డి సూచించారు. జాతీయ పార్టీల పొత్తుల కోసం అర్రులు చాచటం లేదు. జాతీయ పార్టీలే ప్రాంతీయ పార్టీలతో పొత్తులు కోసం ప్రయత్నిస్తున్నాయి. పార్టీల పొత్తులు అనేవి అయా పార్టీల అధినేతలు నిర్ణయిస్తారన్నారు అని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఏపీలో వణికిస్తున్న బర్డ్ ఫ్లూ..

నెల్లూరు జిల్లాలో ఏవియన్ ఇన్ ఫ్లూయెంజా కలకలం

అమరావతి,ఫిబ్రవరి21(వెలుతురు): ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లాలోని రెండు గ్రామాల్లో ఏవియన్ ఇన్ ఫ్లూయెంజా కలకలం రేపింది. ఈ రెండు ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల ప్రాంతానికి మూడు కిలోమీటర్ల పరిధిలో మూడు రోజుల పాటు చికెన్ షాపులను పోలీసులు మూసివేశారు. వ్యాధి నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని నెల్లూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.మహేశ్వరుడు తెలిపారు. ఈ రెండు కేంద్రాల్లో మూడు నెలల పాటు కోళ్ల పెంపకంపై తాత్కాలిక నిషేధం ఉందని, ఆ తర్వాత 10 నుంచి 20 కోళ్ల పెంపకానికి అనుమతిస్తామని తెలిపారు. ఏవియన్ ఇన్ఫ్లుఎంజా, సాధారణంగా బర్డ్ ఫ్లూ అని పిలుస్తారు. ఇది వైరల్ ఇన్ఫెక్షన్. ప్రధానంగా పక్షులను ప్రభావితం చేస్తుంది కాని అప్పుడప్పుడు మనుషులకు, ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. ఇది అడవి పక్షులలో సహజంగా సంభవించే ఇన్ఫ్లుఎంజా వైరస్ వల్ల వస్తుంది. జనాలకు వ్యాప్తి సాధారణంగా సోకిన పక్షులు లేదా వాటి విసర్జనలతో ప్రత్యక్ష సంబంధం ద్వారా వస్తుంది. జనాల్లో తేలికపాటి శ్వాసకోశ అనారోగ్యం మొదలుకొని న్యుమోనియాకు దారితీస్తుంది. ఒక్కొసారి చనిపోవచ్చు కూడా. ఇక మానవులలో ఏవియన్ ఇన్ఫ్లుఎంజా లక్షణాలు జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, కండరాల నొప్పులు మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగి ఉండవచ్చు. ఇది ఆసుపత్రిలో చేరడం లేదా మరణానికి దారితీస్తుంది. సమస్యలను నివారించడానికి లక్షణాలను ముందుగా గుర్తించాలి. బర్డ్ ఫ్లూ నివారణ చర్యలలో పౌల్ట్రీ ఫారాలలో పరికరాలను క్రిమిసంహారక చేయడం. వ్యాప్తిని వెంటనే గుర్తించడానికి నిఘా అవసరం. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి చేతులు కడుక్కోవడం. పౌల్ట్రీ కార్మికులకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. కాగా చిత్తూరు జిల్లాపై నెల్లూరుజిల్లా బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ పడింది. దీంతో నెల్లూరు జిల్లాకు పక్కనే ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పౌల్ట్రీ ఉత్పత్తులు, ఎగుమతుల సంక్షోభానికి కారణం అయ్యింది. దీంతో జిల్లాలో పెద్ద ఎత్తున పౌల్ట్రీ రంగంపై ఆధారపడ్డ రైతాంగం లబోదిబోమంటోంది. వారం క్రితం నెల్లూరు జిల్లా పొదలకూరు ప్రాంతంలో బయట పడ్డ బర్డ్ ఫ్లూ ఇప్పుడు చిత్తూరు జిల్లా పౌల్ట్రీ బిజినెస్ ను కుంగదీసింది. రోజువారీగా బెంగళూరు పాండిచ్చేరి, చెన్నైలకు కోళ్లు, కోడిగుడ్లు ఎగుమతులు చేస్తున్న చిత్తూరు జిల్లాలోని హెచరీస్ సంస్థలు ఎగుమతులు లేక తీవ్రంగా నష్టపోతున్నాయి. జిల్లా లోని పౌల్ట్రీ

ఉత్పత్తులను అనుమతించని తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల తీరు ఇబ్బందిగా మారింది. దీంతో బార్డర్ చెక్ పోస్టుల వద్దనే పౌల్ట్రీ రంగం ఉత్పత్తులను రవాణా చేస్తున్న వాహనాలు నిలిచిపోతున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏడాదికి 10 లక్షల ఫారం కోళ్లు,7 లక్షల పెరటి కోళ్లు పెంపకం జరుగు తుండగా.. ఏటా రూ. 800 కోట్ల మేర పౌల్ట్రీ బిజినెస్ జరుగుతోంది. ఏడాదికి 37, 089 మెట్రిక్ టన్నుల కోళ్లు, 10.73 లక్షల కోడిగుడ్లను హేచరీస్ సంస్థలు, రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. సరాసరి రోజువారీగా రూ. 5 కోట్ల వ్యాపారం చేస్తున్నారు. తాజాగా.. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో.. ఫౌల్ట్రీ వాహ నాలను చెక్‌పోస్టుల దగ్గర అధికారులు నిలిపివేస్తుండటంతో.. రోజుకి రూ.5కోట్ల వ్యాపారం ఆగిపోతోందంటూ ఫౌల్ట్రీ రైతుల ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చిత్తూరు జిల్లా యంత్రాంగం కూడా అలెర్ట్ అయ్యింది. చిత్తూరు జిల్లాలో 31 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసింది. జిల్లాలో పిపిఈ కిట్లు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచింది. దాదాపు జిల్లాలో 8 వేల మంది రైతులు పౌల్ట్రీ రంగంపై ఆధారపడినట్లు చెబుతున్న అధికార యంత్రాంగం.. నెల్లూరు జిల్లా నుంచి కోళ్ల ఎగుమతులను నిషేధించింది. చికిత్స, టీకా లేని బర్డ్ ఫ్లూ ను కేవలం నివారించడం ఒక్కటే మార్గం అంటోంది. పశువైద్య సిబ్బంది ద్వారా జిల్లా యంత్రాంగం ప్రజల్లో బర్డ్ ఫ్లూ పై అవగాహన కల్పిస్తోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా అలెర్ట్ గా ఉన్నామంటున్నారు చిత్తూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని జిల్లా ప్రజలు భయపడాల్సిన పని లేదంటున్నారు. అయితే తగిన జాగ్రత్తలు తీసుకొని కోడి మాంసం కోడిగుడ్లు వినియోగించాలం టున్నారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చ రిస్తున్నారు.

అధికారులకు ఎన్నికల సంఘం దిశానిర్దేశం

పాదర్శకంగా ఎన్నికలు జరగాలి

ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

ఓటర్ జాబితాలపై కీలక సూచనలు

అమరావతి,ఫిబ్రవరి21(వెలుతురు): దేశవ్యాప్తంగా త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు దూకుడుగా ముందుకెళ్తున్నారు. లోక్ సభ ఎన్నికల కోసం దేశవ్యాప్తంగా ఈసీ అధికారులు పర్యటిస్తుండగా ఆంధ్రప్రదేశ్ లో శాసనసభ ఎన్నికలు కూడా ఉండటంతో మరింత ఫోకస్ పెట్టారు. ఇప్పటికే రెండుసార్లు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్ల గురించి కలెక్టర్లు, ఎస్పీలతో కీలక సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో పాదర్శకంగా ఎన్నికలు జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలు,పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు,అక్రమ మద్యం,నగదు సరఫరాపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఆదేశాలు జారీ చేశారు%శ%చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ కూడా రాష్ట్రంలో అధికారులతో సమావేశం తర్వాత ఎన్నికల ఏర్పాట్లపై మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేసారు..ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కూడా అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణపై కీలక సూచనలు చేస్తున్నారు. వచ్చే నెల 9 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందనే సమాచారంతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు మరింత వేగంగా ముందుకెళ్తున్నారు. తాజాగా మరోసారి అమరావతికి

వచ్చారు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు. కీలక అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఎన్నికల కోసం అన్ని రాష్ట్రాల పర్యటనలు చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు మరోసారి అమరావతి వచ్చారు. త్వరలో జరుగనున్న సార్వత్రికల ప్రక్రియలో భాగంగా క్రమబద్ధమైన ఓటర్ల అవగాహన, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాలు(స్వీప్) అమలుకై జిల్లాల స్వీప్ నోడల్ అధికారులతో ఈసీఐ స్వీప్ అధికారులు చర్చించారు. కేంద్ర ఎన్నికల సంఘం స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మీరా నేతృత్వంలో లవ్ కుష్ యాదవ్, రాహుల్ కుమార్ లు అమరావతి సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర అదనపు ఎన్నికల ప్రధానాధికారి ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్, డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు, రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన స్వీప్ నోడల్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాల వారీగా స్వీప్ కార్యక్రమాలపై చర్చించారు. ప్రతి పౌరునికి, ఓటరుకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు, వారి సమాచార భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి అందుబాటులో ఉన్న వివిధ ఆన్ లైన్, ఆఫ్ లైన్ మాధ్యమాల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో కేవలం ఓటు వేయడమే ఓటర్ బాధ్యత కాదని, పారదర్శకంగా ఎన్నికలు జరగడంలో ఓటర్లు కూడా ప్రముఖపాత్ర వహించేలా చూడాలని స్వీప్ నోడల్ అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి ఓటర్లలో స్వీప్ ద్వారా అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.

మరోవైపు ఇప్పటికే తుది ఓటర్ జాబితా విడుదలయినప్పటికీ ఓటర్ జాబితాలో మార్పులు–చేర్పులు, వివరాలు మార్చుకోవడానికి కూడా అవకాశం ఉంది. కాబట్టి ఆయా అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించచారు. జిల్లాల వారీగా స్వీప్ నోడల్ అధికారులు తీసుకుంటున్న చర్యలను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు అడిగి తెలుసుకున్నారు.

పత్రికా ప్రతినిధులపై దాడి పిరికిపంద చర్య

యావత్ పత్రికాస్వేచ్ఛకు తీవ్ర విఘాతం

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

ప్రజాసమస్యలు ఎత్తి చూపే జర్నలిస్టులు భవిష్యత్తులో కనుమరుగవుతారు

కైకలూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ

తహసీల్దార్, సిఐలకు వినతి పత్రం అందజేత

కైకలూరు,ఫిబ్రవరి21(వెలుతురు): రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఆరికట్టి జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కైకలూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీయూడబ్ల్యూజే యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఏవి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కైకలూరు నియోజకవర్గం ప్రెస్ క్లబ్ (ఏపీయూడబ్ల్యూజే అనుబంధం) ఆధ్వర్యంలో ఇటీవల జర్నలిస్టులపై జరిగిన దాడులను ఆరికట్టాలని పాత్రికేయులు నల్ల రిబ్బన్లు ధరించి కైకలూరు పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ నుండి ప్లకార్డులతో ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ యస్ పోతురాజు కి మరియు టౌన్ పోలీస్ మరియు రురల్ సిఐ కృష్ణ కుమార్ లకు వినతిపత్రం అందజేశారు.ర్యాలీలో జర్నలిస్టుల పై దాడులు నసించాలని,దాడులకు పాల్పడిన వారిని తక్షణమే శిక్షించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం బహిరంగ సభలో ఫోటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తలు మూకమ్ముడిగా దాడికి పాల్పడ్డారని,అదేవిధంగా కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి చేసి మీడియా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదన్నారు. అదే కర్నూలు జిల్లాలోని మద్దికెరలో వైసీపీ నాయకులు ఆంధ్రజ్యోతి విలేకరి కె వీరశేఖర్ పై దాడి చేయడం హేయమైన చర్య అని తెలిపారు. అంతేకాకుండా ఏలూరుజిల్లా చింతలపూడిలో రా కదలిరా సభలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీడియా విలేకర్ల ఫోన్లు లాక్కోని బెదిరించడం మంచిది పద్ధతి కాదని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాల్గోవ స్తంభంగా పిలువబడుతున్న మీడియాపై అప్రజాస్వామికంగా, అరాచకంగా దాడి చేసి తీవ్ర గాయాలపాలు చేశారు. పత్రికా ప్రతినిధులపై దాడి యావత్ పత్రికాస్వేచ్ఛకు తీవ్ర విఘాతంగా ఉంది. ఇది పిరికిపంద చర్య అని ఇలా అయితే ప్రజాసమస్యలు ఎత్తి చూపే జర్నలిస్టులు భవిష్యత్తులో కనుమరుగవుతారని పేర్కొన్నారు. ఇది సమాజానికి ఏమాత్రం హితం కాదని మీడియా ప్రతినిధుల పై మరియు ఈనాడు కార్యాలయంపై దాడికి పాల్పడ్డవారిపై పోలీసులు తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా సంయుక్త కార్యదర్శి పెద్ది సురేష్, సామ్నా జిల్లా కార్యదర్శి కురెళ్ళ కిషోర్,కార్యవర్గ సభ్యులు నరహరిశెట్టి శ్యాంబాబు, విజయ్ కుమార్, ముదినేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాగరాజు, సీనియర్ పాత్రికేయులు వి పౌల్ రాజు, శాంత రాజు,జి సర్వేశ్వరరావు, వై శ్రీనివాసరావు,అంబటి సత్యనారాయణ, కె శ్యాం సువర్ణ రాజు, బి సీతారామయ్య,నాగమల్లేశ్వరరావు, సంపత్,నిక్కు శంకర్,ఇక్బాల్, జి. దుర్గారావు, విజయ్,యమ్ తరుణ్, జే నాగరాజు,హరి, స్టాలిన్, పాండు,రాజేష్, రామకృష్ణ, కిషోర్, అనిల్, పేర్రాజు,భూషణం,వాను,శ్రీనివాస్,శివ,చంద్ర శేఖర్,అబ్రహం,శ్రీనివాస్,సత్య నారాయణ తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

తండ్రి కొడుకులకు ఉరిశిక్ష - తల్లికి యావజ్జీవ శిక్ష

కర్నూలు ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పు

నవ వధువు హత్య కేసులో కీలక తీర్పు

కర్నూలు,ఫిబ్రవరి21(వెలుతురు): కర్నూలు జిల్లాలో సంచలనం సృష్టించిన కేసులో చారిత్రాత్మక తీర్పు వెలువడింది. ఓ కేసులో తండ్రి కొడుకులకు ఉరిశిక్షతో పాటు తల్లికి యావజ్జీవ శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. కర్నూలు నాలుగో అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. గత ఏడాది మార్చి నెలలో పెళ్లయిన 14 రోజులకే నవ వధువును అనుమానంతో కడతేర్చిన అత్తింటికి వారికి కఠిన శిక్ష విధించింది కర్నూలు కోర్టు. ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు రుజువు కావడంతో భార్య, అత్తను చంపి మామను తీవ్రంగా గాయపరిచిన కేసులో ఇద్దరికీ ఉరిశిక్ష, ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ కర్నూలు నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలముని నగర్‌కు చెందిన శ్రావణ్ కుమార్ తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన రుక్మిణిని వివాహం చేసుకున్నాడు. పెళ్లయిన 14 రోజులకే ఆమె పాలిట అనుమానం పెనుభూతమైంది. అప్పటి నుంచి వేధింపులకు పాల్పడ్డాడు శ్రవణ్ కుమార్. రుక్మిణికి చిత్రవధ చూపించాడు. అంతేకాదు తల్లిదండ్రులతో కలిసి రుక్మిణితో పాటు ఆమె తల్లి రమాదేవిని అత్యంత కిరాతకంగా హతమార్చాడు శ్రవణ్ కుమార్. అడ్డొచ్చిన రుక్మిణి తండ్రి వెంకటేశ్‌ని దారుణంగా గాయపరిచాడు. ఈ ఘటనపై కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ లో అప్పట్లో కేసు నమోదైంది. విచారణ చేపట్టిన కర్నూలు పోలీసులు.. నిందితులపై అభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో కేవలం సంఘటన జరిగిన 13నెల లోపల విచారణ పూర్తి చేసింది కోర్టు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సంచలనాత్మకమైన తీర్పు చెప్పారు. శ్రవణ్ కుమార్‌తో పాటు అతని తండ్రికి ఉరి శిక్ష ఖరారు చేసింది కోర్టు. ఈ దారుణంలో పాలుపంచుకున్న శ్రావణ్ తల్లికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది కర్నూలు కోర్టు. కోర్టు తీర్పు పట్ల రుక్మిణి కుటుంబసభ్యులతో పాటు ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com